సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 12 సంచిక: 264

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 15-12-2019

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

మిస్ వరల్డ్‌గా జమైకా సుందరి

- 5లో

హ్యాట్సాఫ్ టు జగన్

ఏపీ 'దిశ' యాక్ట్‌కు తారల క్లాప్స్

నేరాలు కచ్చితంగా తగ్గుతాయి: కృష్ణంరాజు

ఇలాంటి చట్టం దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టాలి: పూరి

ఇది మహిళలకు న్యూ ఇయర్ గిఫ్ట్: జయసుధ

నిర్ణయం త్వరగా తీసుకోవాలనడం కరెక్ట్: వెంకటేష్

చర్చ లెందుకు.. నిర్ణయం జరిగిపోవాలి: నాగచైతన్య

- ఫ్యామిలీలో

దిశ చట్టం దేశమంతా అమలు చేయండి

- ఇదొక మైలురాయిలాంటి చట్టం
- న్యాయం అందించడంలో గేమ్ చేంజర్ వంటిది
- దేశవ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేసే వరకూ దీక్ష
- ప్రధాని మోదీకి ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: దిశ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్ ప్రధాని నరేంద్ర మోదీకి శనివారం లేఖ రాశారు. ఈ చట్టాలు శాసనవ్యవస్థలో మైలురాయి వంటివని పేర్కొన్నారు. మహిళలపై నేరాలకు పాల్పడిన ప్పుడు న్యాయం అందించడంలో ఇవి గేమ్ చేంజర్‌గా నిలుస్తాయని తెలిపారు. 'వందలాది మంది ఆడబిడ్డలు, సోదరీమణు లపై నేడు లైంగిక దాడులు జరుగుతున్నాయి. ఈ నేరాలు సమాజ సహన హద్దులను కూడా దాటిపోయాయి. గత కొన్ని వారాలుగా కోట్లాది మహిళలు, పురుషులు వీధుల్లోకి వచ్చి రేపిస్టులపై కఠిన చట్టాలు తేవాలని నిరసనలు నిర్వహించారు. రేపిస్టులకు శిక్ష విధించేందుకు ఒక నిర్దిష్ట ఫ్రేమ్‌వర్క్ రూపొం దించాలన్న డిమాండ్‌తో నేను కూడా

మిగతా 2వ పేజీలో ▶

నిరాహార దీక్షలో స్వాతి మలివాల్

గోదారంత సంబురం

- బేసిన్ ప్రాజెక్టుల్లో తొలిసారి గణనీయ నీటి లభ్యత
- ఏకంగా 176.55 టీఎంసీల నీరు అందుబాటులో
- గతేడాది కన్నా సుమారు 100 టీఎంసీలు అధికం
- మేడిగడ్డ నుంచి ఎల్ఎండీ వరకు ఎటుచూసినా నీరే

- వివరాలు 2లో

ఐడీసీ ఎత్తివేత!

- ఈఎన్‌సీల సంఖ్య పెంపు
- వారి పరిధిలోకి నలుగురైదుగురు సీఈలు
- సాగునీటి శాఖ పరిధిలో ఉన్న విధానాల పునర్‌వ్యవస్థీకరణ
- ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు కొత్త పాలసీ
- సీఎం సూచనల మేరకు 21, 22 తేదీల్లో వర్క్‌షాప్

- వివరాలు 4లో

శనివారం పశ్చిమ బెంగాల్‌లోని సాంత్రగచిలో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న నిరసనకారులు

'పౌరసత్వం'పై మంటలు

బెంగాల్‌లో రైల్వే స్టేషన్‌కు, పలు బస్సులకు నిప్పు

అస్సాంలో మంటల్లో ఆయిల్ ట్యాంకర్.. డ్రైవర్ మృతి

5 లో

శనివారం ఢిల్లీలో నిర్వహించిన భారత్ బచావో సభలో ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

నా పేరు రాహుల్ సావర్కర్ కాదు

చావనైనా చస్తాను కానీ నేను క్షమాపణ చెప్పను

దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ నాశనం చేశారు

అందుకు ఆయన క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్

5 లో

ఐఐటీ విద్యార్థులకు ఉద్యోగాల పంట

- 2020తో కోర్సు ముగుస్తున్న బీటెక్ విద్యార్థుల కోసం విదేశీ కంపెనీల క్యూ
- రూ. 60 లక్షల మొదలు రూ. కోటి వరకు వార్షిక వేతనాలు
- మద్రాస్, హైదరాబాద్ ఐఐటీలలో 60% మంది విద్యార్థులకు ఆఫర్లు
- ఖరగ్‌పూర్ ఐఐటీలో నియామకాలు చేపట్టిన 51 విదేశీ కంపెనీలు
- హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులకు 38 అంతర్జాతీయ సంస్థల ప్లేస్‌మెంట్లు
- ఢిల్లీ, బాంబే ఐఐటీలలో కొనసాగుతున్న నియామకాలు

ప్లేస్‌మెంట్లు ఆఫర్ చేసిన కంపెనీలు

మైక్రోసాఫ్ట్, ఉబెర్, పేపాల్ యాక్సెంచర్ జపాన్, డెస్కెరా, హనీవెల్

మైక్రోసాఫ్ట్ 100 మందికిపైగా విద్యార్థులకు రూ. కోటి అంత కంటే ఎక్కువ ఆఫర్ చేసింది.

సాక్షి ప్రత్యేక ప్రతినిధి: ఈ ఏడాది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల్లో ఉద్యోగ నియామకాలకు విదేశీ కంపెనీలు క్యూ కట్టాయి. ఉత్తర అమెరికా, యూరప్, సింగపూర్, జర్మనీ, జపాన్ వంటి దేశాలు ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థల విద్యార్థులను నియమించుకునేందుకు పోటీపడ్డాయి. ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థుల కోసం గత ఏడాది 26 విదేశీ కంపెనీలు బారులుతీరగా ఈ సీజన్‌లో ఏకంగా 51 విదేశీ కంపెనీలు నియామకాలు చేపట్టాయి. ఐఐటీ కాన్పూర్, ఐఐటీ బీహెచ్‌యూ, ఐఐటీ గువాహటిలలో ఒక్కో విద్యార్థికి సగటున ఐదు ఆఫర్లు లభించాయి. ఐఐటీ హైదరాబాద్ ఉద్యోగ నియామకాల్లో కొన్ని ఐఐటీలను దాటిపోయింది. ఈ విద్యా సంవత్సరం బీటెక్ పూర్తి చేసుకోబోతున్న విద్యార్థు లను నియమించుకునేందుకు 38 అంతర్జాతీయ కంపెనీలు అడుగుపెట్టాయి. ఐఐటీ మద్రాస్ (34), ఐఐటీ కాన్పూర్ (22), ఐఐటీ (బీహెచ్‌యూ) వారణాసి (11), ఐఐటీ గువా హటి (25) కంటే హైదరాబాద్ ఐఐటీ అంతర్జాతీయ కంపె నీలను ఆకర్షించడంలో ముందంజలో ఉంది. 'వచ్చే జనవరి నుంచి మొదలయ్యే తుది సీజన్ నియామకాల తరువాత అంతర్జాతీయ కంపెనీల సంఖ్య పెరుగుతుంది'అని ఐఐటీ హైదరాబాద్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

ఎక్కువ ఆఫర్ చేసిన మైక్రోసాఫ్ట్, ఉబెర్...

ఈ ఏడాది ఐఐటీ విద్యార్థులకు పెద్ద మొత్తంలో ఉద్యోగాలు ఆఫర్ చేసిన అంతర్జాతీయ కంపెనీల్లో మైక్రోసాఫ్ట్, ఉబెర్, పేపాల్‌తోపాటు యాక్సెంచర్ జపాన్, డెస్కెరా, హనీవెల్ వంటివి ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ 100 మందికిపైగా విద్యార్థులకు రూ.కోటి అంతకంటే ఎక్కువ ఆఫర్ చేయడం విశేషం. ఉబెర్, పేపాల్ వంటి అమెరికన్ కంపెనీలు తక్కువ సంఖ్యలో విద్యార్థులను నియమించుకున్నప్పటికీ కనిష్టంగా రూ. 60 లక్షలు, గరిష్టంగా రూ. కోటి మేర

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర రహదారులపై ఫాస్టాగ్ జాప్యం

సాక్షి, హైదరాబాద్: టోల్‌ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా వాహనాలు ముందుకు వెళ్లేలా ఉద్దేశించిన ఎలక్ట్రానిక్ టోల్ చెల్లింపు విధానం రాష్ట్ర రహదారులపై అందుబాటులోకి రావడానికి జాప్యమయ్యే అవకాశం ఉంది. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ఉన్న 17 టోల్‌గేట్ల వద్ద ఈ విధానం ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అన్ని ఏర్పాట్లు చేసింది. డిసెంబర్ 1వ తేదీనే ప్రారంభించాల్సి ఉన్నా దేశవ్యాప్తంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే. కానీ రాష్ట్రంలో మాత్రం అప్పటికే అన్నీ సిద్ధం చేసి పెట్టారు. ఈ నెల 15న రాష్ట్రంలోని జాతీయ రహదారులపై సాఫీగానే ప్రారంభం కానుంది. కానీ రాష్ట్ర రహదారుల విషయానికి వచ్చే సరికి సందిగ్ధత నెలకొంది. రాష్ట్ర రహదారులపై 4 టోల్‌ప్లాజాల వద్ద కూడా దీన్ని ప్రారంభించాల్సి ఉంది. ఫాస్టాగ్‌కు సంబంధించి యంత్ర పరికరాల ఏర్పాటు ఖర్చును ఎవరు భరించాలనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు మధ్య స్పష్టత కుదరలేదు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 58 వేల ఫాస్టాగ్‌లు అమ్ముడైనట్లు తెలిసింది.

ఆందోళన జరిగితే నెట్ కట్

- 2018లో వందసార్లకు పైగా ఇంటర్నెట్ షట్‌డౌన్
- ఈ ఏడాది 90 సార్లు
- రికార్డు సృష్టిస్తున్న భారత్

- వివరాలు 5లో

ఉల్లి... ఎందుకీ లొల్లి!

గత మార్చి నుంచి ఇప్పటివరకు ఉల్లి ధరలు 400 శాతం పెరిగాయి. దేశంలో చాలా చోట్ల కేజీ ఉల్లి ధర రూ.150 నుంచి రూ.200 వరకు చేరుకుంది.

ధరాఘాతం కేవలం ఉల్లికే పరిమితం కాలేదు. గత నాలుగు నెలల కాలంలో దాదాపు 20 నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపయ్యాయి. బియ్యం, గోధుమలు, పప్పు దినుసులు, కూరగాయలు, నూనె, బెల్లం వంటి సరుకుల రేట్లు ఆకాశాన్నంటాయి. అయినా ఉల్లి గురించే దేశవ్యాప్తంగా రచ్చ జరుగుతోంది. మిగిలిన వాటి ధరలు పెరిగినా పట్టించుకోని జనం.. ఉల్లి ధరపై ఎందుకింత తల్లడిల్లిపోతున్నారు? ఇదే సండే స్పెషల్..

ఇది మొఘల్స్ ఘాటు

ఇప్పుడంటే ఉల్లి కోసం అందరూ ఎగబడుతున్నారు కానీ ఒకప్పుడు ఉల్లికి మన సమాజంలో చోటే లేదు. మొఘలాయిలు మన దేశంలోకి అడుగుపెట్టక ముందు ఉల్లి, వెల్లుల్లికి బదులుగా భారతీయులు వంటల్లో అల్లం ఎక్కువగా వాడేవారని చరిత్రకారులు చెబుతున్నారు. 2 వేల ఏళ్ల కింద ఆయుర్వేద వైద్యుడు చరకుడి చరక సంహితలో ఉల్లి గురించి చాలా గొప్పగా రాశారు. కూరల్లో ఉల్లిని వాడితే మోకాళ్ల నొప్పులు తగ్గిపోతాయని, జీర్ణక్రియకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అప్పట్లో ఉల్లి వాడకం బాగా ఉండేది. కానీ కొన్ని దశాబ్దాల తర్వాత ఆయుర్వేదంలో ఉల్లిని నిషేధించారు. ఉల్లిని తమోగుణాన్ని పెంచే వస్తువుగా చూసేవారు. ఉల్లి తింటే శారీరక వాంఛలు పెరుగుతాయని తేల్చారు. దీంతో ఉల్లి అనేది కొన్ని కులాలకు మాత్రమే పరిమితమైంది. వితంతువులు ఉల్లి తినకూడదని ఆంక్షలు విధించారు. క్రీస్తుశకం 7వ శతాబ్దంలో భారత్‌ను సందర్శించిన చైనా యాత్రికుడు హ్యూయన్‌త్సాంగ్ పుస్తకాల్లో.. భారత్‌లో ఉల్లిపై నిషేధం ఉందని, దాన్ని వాడేవారిని ఊరి నుంచి వెలివేశారని రాశారు. క్రీ.శ.1526లో మొఘలాయిలు భారత్‌లో అడుగు పెట్టిన తర్వాత ఉల్లి వాడకం ఇంటింటికీ పాకింది. వాళ్లు చేసే బిర్యానీ, ఇతర వంటకాల్లో మసాలాలు, ఉల్లి లేనిదే రంగు, రుచి వచ్చేది కాదు. అలా కాలక్రమంలో ఉల్లి లేనిదే వంటలు చేయలేని పరిస్థితి వచ్చింది. అయితే జైనులు ఉల్లిపాయ, వెల్లుల్లికి ఎప్పుడూ దూరమే. ఒకప్పుడు బ్రాహ్మణ కుటుంబాల్లో కూడా ఉల్లి వాడేవారు కాదు. కానీ రానురానూ ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదన్న సత్యాన్ని గ్రహించి ఉల్లి వాడకాన్ని మొదలు పెట్టారు.

ఉల్లి ఉల్లికో కథ

సామాన్యుల నుంచి కోట్లకు పడగలెత్తిన వారి వరకు ఉల్లి లేనిదే అసలు ముద్దే దిగదు. ఏ వంట చేయాలన్నా ఉల్లి తప్పనిసరి. సలాడ్స్ నుంచి మాంచి మసాలాలు దట్టించిన కుర్మాలు, చికెన్, మటన్ వరకు ఉల్లి లేకుండా వంటలకి రుచే రాదు. శాకాహారులు ఎక్కువగా తినే సాంబార్‌లో చిన్న ఉల్లిపాయలు వాడకుండా టేస్ట్ తేలేరు. నిరుపేదలకు గంజన్నం, ఉల్లిపాయ ఉంటే చాలు అదే పంచభక్ష పరమాన్నం.

క్లుప్తంగా...

హైదరాబాద్‌కు 20న రాష్ట్రపతి కోవింద్ రాక

రాష్ట్రపతి నిలయంలో శీతాకాల విడిది 28న తిరిగి ఢిల్లీకి పయనం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శీతాకాల విడిది షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. శీతాకాల విడిదిలో భాగంగా ఆయన ఈ నెల 20న హైదరాబాద్‌కు రానున్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈనెల 20 నుంచి 22 వరకు బస చేయనున్నారు. 23న ఉదయం 10 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి చెన్నై లేదా పుదుచ్చేరి వెళ్లనున్నారు. అక్కడి నుంచి తిరువనంతపురం వెళ్లనున్నారు. అక్కడ్నుంచి 26న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. మరుసటి రోజు 27న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్‌హోం'కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, ప్రముఖులను ఆహ్వానించనున్నారు. 28న మధ్యాహ్నం 3 గంటలకు హకీంపేట విమానాశ్రయం నుంచి ఆయన ఢిల్లీకి వెళ్తారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఈ నెల 16న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషి సమీక్ష నిర్వహించనున్నారు.

ఇకపై మెట్రో రాత్రి 11 వరకు

సాక్షి, హైదరాబాద్: మెట్రో రైల్ ప్రయాణికులకు శుభవార్త..ఇక నుంచి మెట్రో రైళ్లు రాత్రి 11 గంటల వరకు నడవనున్నాయి. నగరంలో సుమారు 1000 సిటీ బస్సులను ఆర్టీసీ రద్దు చేస్తున్న నేపథ్యంలో మెట్రో రైలు వేళల్లో మార్పులు చేసినట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇక నుంచి అన్ని టెర్మినళ్ల నుంచి రాత్రి 11 గంటలకు బయలుదేరి ఆఖరు స్టేషన్‌కు 11.50 గంటలకు చేరుకుంటాయి. అలాగే ఉదయం 6 గంటలకు బదులుగా 6.30 గంటలకు మెట్రో రైళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. రాత్రి ఆలస్యంగా ఇళ్లకు చేరుకునే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఈ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు.

తక్షణమే విద్యుత్ ఉద్యోగుల విభజన పూర్తి చేయాలి..

ధర్మాధికారి కమిటీకి విద్యుత్ ఇంజనీర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి,, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల విభజనను తక్షణమే పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కోరింది. విద్యుత్ ఉద్యోగుల విభజన వివాద పరిష్కారం కోసం సుప్రీం కోర్టు నియమించిన జస్టిస్ ధర్మాధికారి ఏకసభ్య కమిషన్ శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విద్యుత్ సంస్థల అధికారులతో సమావేశమై చర్చలు జరిపింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రత్నాకర్‌రావు, పి.సదానందం నేతృత్వంలో ప్రతినిధి బృందం జస్టిస్ ధర్మాధికారిని కలిసి తక్షణమే విద్యుత్ ఉద్యోగుల విభజన పూర్తి చేయాలని వినతి పత్రం సమర్పించింది. ధర్మాధికారి కమిటీ మార్గదర్శకాలకు విరుద్ధంగా ఏపీ విద్యుత్ సంస్థలు తెలంగాణకు 582 మంది ఉద్యోగులను ప్రాథమికంగా కేటాయిస్తూ జాబితాలను ప్రకటించడం పట్ల అసోసియేషన్ ప్రతినిధులు హోటల్ ముందు నిరసన తెలిపారు. స్థానికత ఆధారంగా ఏ రాష్ట్రం ఉద్యోగులను ఆ రాష్ట్రానికే కేటాయించాలని డిమాండ్ చేశారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయొద్దు

సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ప్రకటించాలని సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖలో కోరారు. దీన్ని అమలు చేయబోమని ఐదు రాష్ట్రాల సీఎంలు ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో కూడా అమలు చేయకూడదని, ఈ విషయంలో టీఆర్ఎస్ ప్రభుత్వం తగిన విధగా స్పందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. మత కోణంలో తీసుకొస్తున్న ఈ చట్టాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించబోమని టీఆర్ఎస్ ఎంపీలు ఉభయసభల్లో నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి దేశ ప్రజాస్వామ్య, లౌకిక విలువలు కాపాడే విధంగా కృషి చేశారని ప్రశంసించారు. బీజేపీ ప్రభుత్వం లౌకిక విలువలను మంటగలిపేలా పార్లమెంట్‌లో పౌరసత్వ సవరణ బిల్లును ఆమోదించుకుందని మండిపడ్డారు.

కళకళలాడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు

పరిధిలోని అన్నారం సరస్వతీ బ్యారేజీ

గోదారంత సంబురం

- బేసిన్ ప్రాజెక్టుల్లో తొలిసారి గణనీయ నీటి లభ్యత
- ఏకంగా 176.55 టీఎంసీల నీరు అందుబాటులో
- గతేడాది కన్నా సుమారు 100 టీఎంసీలు అధికం
- మేడిగడ్డ నుంచి ఎల్ఎండీ వరకు ఎటుచూసినా నీరే

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ ప్రాంతాలను గోదావరి జలాలు సస్యశ్యామలం చేయనున్నాయి. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురవడంతో గోదావరి బేసిన్ ప్రాజెక్టులన్నీ నిండుకుండలను తలపిస్తున్నాయి. కాళేశ్వరం జలాల ఎత్తిపోతల ద్వారా దాని పరిధిలోని రిజర్వాయర్లు, బ్యారేజీలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది గోదావరి ప్రాజెక్టుల్లో ఏకంగా 176 టీఎంసీలకు పైగా నీటి లభ్యత ఉండటంతో పరీవాహక ప్రాంతాల్లో యాసంగి సీజన్ సంబరంగా మారుతోంది.

లభ్యత పుష్కలం..

రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో ఈ ఏడాది నీటి లభ్యత పుష్కలంగా ఉంది. గోదావరి బేసిన్‌లో ప్రాజెక్టులు, బ్యారేజీలు, రిజర్వాయర్‌ల పూర్తి నిల్వ సామర్థ్యం 251.61 టీఎంసీలు కాగా, ఈ ఏడాది 176.55 టీఎంసీల మేర నీటి లభ్యత ఉంది. గతేడాది ఇదే సమయానికి ఉన్న నిల్వలతో పోలిస్తే 108.83 టీఎంసీల మేర నిల్వలు ఎక్కువగా ఉండటం విశేషం. ముఖ్యంగా ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, కడెం, మిడ్‌మానేరులో పూర్తిస్థాయి నిల్వలున్నాయి. లోయర్ మానేరు డ్యాం (ఎల్ఎండీ)లో 24 టీఎంసీలకు గానూ 17.82 టీఎంసీల మేర నిల్వలున్నప్పటికీ కాళేశ్వరం మోటార్ల ద్వారా రోజూ 7,900 క్యూసెక్కుల మేర నీటిని ఇక్కడికి తరలిస్తున్నారు. ఇందులోంచి 3,600 క్యూసెక్కుల మేర నీటిని కాల్వలకు వదులుతున్నారు. మొత్తంగా మేడిగడ్డ మొదలు ఎల్ఎండీ వరకు 225 కిలోమీటర్ల మేర గోదావరి పరీవాహకం అంతా జలకళతో ఉట్టిపడుతోంది. మిడ్‌మానేరు ద్వారా వచ్చే నెల నుంచి కాళేశ్వరంలోని ప్యాకేజీ-10 కింద అనంతగిరి, రంగనాయక్‌సాగర్‌లోకి అటు నుంచి మల్లన్నసాగర్ కాల్వల ద్వారా కొండపోచమ్మ సాగర్‌కు నీటిని తరలించనున్నారు. దీనిపై ఇటీవలే గజ్వేల్ పర్యటన సందర్భంగా సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటన చేశారు. మిడ్‌మానేరు నుంచి ఎత్తిపోతలు మొదలైతే ఎగువ మేడిగడ్డ నుంచి లభ్యతగా ఉన్న వరద గోదావరినంతా మోటార్ల ద్వారా ఎత్తిపోస్తూ నీటి లభ్యతను మరింత పెంచనున్నారు.

గణనీయంగా ఆయకట్టు సాగులోకి..

నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్-1 కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఎస్సారెస్పీ నుంచి ఎల్ఎండీ వరకు 4 లక్షల ఎకరాలకు, అలీ సాగర్, గుత్ప, ఇతర పథకాల కింద మరో లక్ష ఎకరాలు, ఎల్ఎండీకి దిగువన 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. గతేడాది 9 తడుల్లో నీళ్లు ఇవ్వగా ఈసారి పది తడులు ఇచ్చేందుకై నా సిద్ధమని ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ నెల 26 నుంచి యాసంగికి నీటి విడుదల ఉండే అవకాశం ఉంది. ఎస్సారెస్పీ స్టేజ్-2 కింద ఈ ఏడాది 2.50 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వనున్నారు. ఇందుకోసం ఇప్పటికే టెయిల్ ఎండ్‌లోని 644 చెరువులను నింపుతున్నారు. కడెం కింద 30 వేల ఎకరాలు, కొమురంభీం, గడ్డెన్నవాగు, సాత్నాల వంటి మధ్యతరహా ప్రాజెక్టుల కింద మరో 2 లక్షల ఎకరాల మేర ఆయకట్టుకు నీరిచ్చేలా యాసంగి ప్రణాళిక సిద్ధమైంది. ఇక గోదావరి బేసిన్లోని 20,151 చెరువులకు గానూ 12,300 చెరువుల్లో పూర్తి స్థాయి నీటి లభ్యత ఉండగా, మరో 4,350 చెరువుల్లో సగానికి పైగా నిండి ఉన్నాయి. ఇదికూడా ఆయకట్టు సాగుకు దోహదం చేయనుంది.

నిండుకుండలా ఎస్సారెస్పీ ప్రాజెక్టు

మధ్యమానేరు ప్రాజెక్టులో నీటి నిల్వలు

గోదావరి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత (టీఎంసీలలో..)

ప్రాజెక్టు	వాస్తవ నిల్వ	నీటి లభ్యత	గతేడాది లభ్యత
ఎస్సారెస్పీ	90.31	89.21	33.55
మిడ్‌మానేరు	25.87	23	6.87
లోయర్ మానేరు	24.07	17.82	8.44
కడెం	7.60	7.39	3.82
ఎల్లంపల్లి	20.18	18.56	18.17
మేడిగడ్డ	16.17	4.50	0
అన్నారం	10.87	3.84	0
సుందిళ్ల	8.83	6.64	0
నిజాంసాగర్	17.80	3.99	0.96
సింగూరు	29.91	1.60	2.78

ఐఐటీ విద్యార్థులకు ఉద్యోగాల పంట

▶ మొదటి పేజీ తరువాయి

వేతనాలను ఆఫర్ చేశాయి. ఈ ఏడాది ఇప్పటివరకూ జరిగిన నియామకాల్లో ఐఐటీ మద్రాస్, ఐఐటీ హైదరాబాద్ విద్యార్థుల్లో 60 శాతం మందికి అంతర్జాతీయ కంపెనీలు ఆఫర్లు ఇచ్చాయి. అంతర్జాతీయ కంపెనీల నుంచి ఉద్యోగ ఆఫర్లు పొందిన వారికి అమెరికా, సింగపూర్, జపాన్, జర్మనీ వంటి దేశాల్లోనే ఉద్యోగాలు దక్కాయి. ఇలా ఉద్యోగాలు పొందిన వారికి సంబంధిత కంపెనీలే వర్క్ పర్మిట్ (ఆయా దేశాల్లో పని చేసేందుకు అనుమతి) తీసుకుంటాయి.

ప్లేస్‌మెంట్స్‌లో హైదరాబాద్ ఐఐటీ రెండో స్థానం...

ఐఐటీ ఖరగ్‌పూర్‌కు ఈసారి అంతర్జాతీయ సంస్థలు వెల్లువెత్తాయి. ఈ విద్యా సంవత్సరం బీటెక్ పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులను నియమించుకునేందుకు 51 కంపెనీలు నియామక ప్రక్రియను పూర్తి చేశాయి. ఐఐటీ బాంబేలో తుది దశ నియామకాల ప్రక్రియ పూర్తయితేగానీ ఈ ఏడాది అంతర్జాతీయ కంపెనీలు ఏ ఐఐటీని ఎక్కువగా సందర్శించాయన్న వివరాలు లభ్యం కావు. అయితే ఇప్పటివరకూ పూర్తయిన నియామక ప్రక్రియను పరిశీలిస్తే ఖరగ్‌పూర్ తరువాత ఆ స్థానం హైదరాబాద్‌కు దక్కుతుంది. హైదరాబాద్ ఐఐటీని సందర్శించిన అంతర్జాతీయ కంపెనీల సంఖ్య 38. ప్లేస్‌మెంట్లలో ఐఐటీ హైదరాబాద్ ఈసారి పాత ఐఐటీలు ఎన్నింటినో అధిగమించి రికార్డు దిశగా దూసుకుపోతోంది. ఢిల్లీ, బాంబే ఐఐటీలలో నియామకాల ప్రక్రియ ఇటీవలే మొదలైందని, జనవరి ఆఖరుతో పూర్తవుతుందని, ఆ తరువాత ఐఐటీలవారీగా నియామకాలు చేపట్టిన జాతీయ, అంతర్జాతీయ కంపెనీల వివరాలు వెల్లడిస్తామని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు. 'అంతర్జాతీయ పత్రికలు విద్యాసంస్థల రేటింగ్‌లో ఐఐటీలను తక్కువ చేసి చూపుతున్నా వాటిలో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న విద్యార్థులే రేటింగ్‌లకు చక్కని ఉదాహరణ అని ఆ ప్రతినిధి వ్యాఖ్యానించారు.

దిశ చట్టం దేశమంతా అమలు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాను. నేటికి 12 రోజులైంది. నేను తొలిరోజే మీకు లేఖ రాశాను. దేశవ్యాప్తంగా డిమాండ్లు ఉన్నప్పటికీ మీ నుంచి ఎలాంటి స్పందన లేదు' అని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో దారి చూపింది. ఏపీ అసెంబ్లీ రెండు దిశ బిల్లులను ఆమోదించింది. ఇవి శాసనవ్యవస్థలో మైలురాయి వంటివి. మహిళలకు వ్యతిరేకంగా నేరాలు జరిగినప్పుడు న్యాయం అందించడంలో ఈ బిల్లులు గేమ్ చేంజర్‌గా నిలుస్తాయి'అని తెలిపారు. బిల్లులో కీలకంగా ఉన్న ఇండియన్ పీనల్ కోడ్ సవరణ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సవరణ, మూడు నెలల్లో అప్పీళ్ల పూర్తి, స్పెషల్ సెషన్ కోర్టుల ఏర్పాటు, మహిళా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం, దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు వంటి ఐదు అంశాలను ఈ లేఖలో ప్రస్తావించారు.

దిశ చట్టం అమలయ్యే వరకు దీక్ష..

కొద్ది రోజుల్లోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చట్టాలను తెచ్చిందని స్వాతి మలివాల్ చెప్పారు. దేశంలోని మహిళల విషయంలో పార్లమెంటు స్పందించకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకున్నప్పుడు కేంద్రం ఎందుకు అంతే అత్యవసరంగా చట్టం తీసుకురాదు? ఎందుకు అంత సీరియస్‌గా పట్టించుకోదు? దేశవ్యాప్తంగా దిశ బిల్లులను అమలు చేయాలి. గడిచిన 12 రోజుల్లో 8 కిలోల బరువు తగ్గాను. శారీరకంగా చాలా బాధను అనుభవిస్తున్నాను. కానీ దేశవ్యాప్తంగా దిశ చట్టం అమలయ్యే వరకూ నిరాహార దీక్ష కొనసాగిస్తాను'అని స్పష్టం చేశారు.

'కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్న ప్రభుత్వాలు'

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు కె.హేమలత విమర్శించారు. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభను శనివారం కుషాయిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో కార్మిక చట్టాలు నీరుగారిపోవడంతో జీవించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికుల హక్కులను హరిస్తూ కార్పొరేట్లకు పెద్దపీట వేశారని మండిపడ్డారు. ఇండస్ట్రియల్ కోడ్ బిల్లు మూలంగా చట్టసభల్లో కార్మికుల సమస్యలు ప్రస్తావించే అవకాశముండదని, సమ్మెను చట్టవిరుద్ధంగా పరిగణిస్తారని తెలిపారు. ఇక తెలంగాణలో నియంత దొరపాలన సాగుతోందని హేమలత ఆరోపించారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం ఇటీవలి ఆర్టీసీ కార్మికుల సమ్మేనని చెప్పారు. ఈ నేపథ్యంలో వచ్చే జనవరి 8న జరిగే జాతీయ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఆర్. సుధాభాస్కర్, చుక్క రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ, భూపాల్, జయలక్ష్మి, రాజబాబు, మల్లికార్జున్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంపై దాడులు జరుగుతున్నాయి..

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మంగలేష్ ఆవేదన
- రాజ్యాంగం మీద నమ్మకం లేనప్పుడే ఎన్‌కౌంటర్లు జరుగుతాయి: నందిని సిధారెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన లిటరరీ ఫెస్ట్‌లో తెలుగెత్తి జైకొట్టు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంగలేష్, నందిని సిధారెడ్డి, శివారెడ్డి తదితరులు

హైదరాబాద్: దేశంలో సాహిత్యంపై దాడులు జరుగుతున్నాయని ప్రముఖ హిందీ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మంగలేష్ దబ్రాల్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు జరిగే 4వ లిటరరీ ఫెస్ట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా 135 మంది సాహితీవేత్తలు, స్కాలర్స్ రచించిన 'తెలుగెత్తి జైకొట్టు'పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంగలేష్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త చరిత్ర, కొత్త వ్యక్తులను ముందుకు తీసుకొస్తున్నారని, గాంధీ, నెహ్రూలకు బదులుగా వారి త్యాగాలను చరిత్రను చెరిపేసి సావర్కర్, వల్లభాయ్ పటేల్‌ను ముందుకు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. దేశంలో మత ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడపాలని ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రగతిశీలమైన రచయితలను నిషేధిస్తున్నారని విమర్శించారు. నేటి కవులు, రచయితలు అప్రమత్తంగా ఉండి దేశ వైవిధ్యాన్ని కాపాడాలన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. దిశ అత్యాచారం జరిగిన నేపథ్యంలో ప్రజల నిరసనలు పెరిగాయని అన్నారు. ప్రజల మీద, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం మీద నమ్మకం లేనప్పుడే ఎన్‌కౌంటర్లు జరుగుతాయన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని చెప్పారు. తెలుగును ఎత్తిపట్టుకోవాల్సిన సందర్భం వచ్చిందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను తీర్చడంతో పాటు వారిని అర్థం చేసుకునేది మాతృ భాష అని చెప్పారు. ప్రముఖ కవి సుధామ మాట్లాడుతూ.. సాహిత్యం లేకున్నా భాష ఉంటుంది.. కాని భాష లేకుంటే సాహిత్యం ఉండదని పేర్కొన్నారు. ప్రముఖ విమర్శకులు కె.శివారెడ్డి మాట్లాడుతూ.. సాహిత్యానికి ఎల్లలు లేవని అన్నారు. సమాజం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత కవులకు ఉందన్నారు. రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ.. భాష, సంస్కృతి ప్రజలను చైతన్యం చేస్తుందన్నారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవులు నిఖిలేశ్వర్, ఓయూ తెలుగు శాఖ అధిపతి సూర్య ధనుంజయ్, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

కుంచెకత్తి

మీపై అభిశంసనకు మద్దతివ్వడానికి ఎవరొచ్చారో చూడండి!

వ్యర్థం.. కానుంది 'అర్థం'!

సీ అండ్ డీ వేస్ట్ రీసైక్లింగ్‌తో కొత్త ఉత్పత్తులు ● త్వరలో ప్రారంభం కానున్న జీడిమెట్ల ప్లాంట్

నగరంలో నాలాలు పొంగిపొర్లడానికి ప్రధాన కారణం వాటిల్లో నీరు పారే దారి లేకుండా పేరుకుపోయిన వ్యర్థాలు. ఈ వ్యర్థాల్లో కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ (సీ అండ్ డీ) వేస్ట్ ఎక్కువగా ఉంటోంది. నాలాల సమస్యే కాదు.. రోడ్లపైనే వేస్తుండటం ప్రమాదాలకు కారణమవుతోంది. నడిచే బాటలు తగ్గిపోతున్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి త్వరలో సీఅండ్‌డీ వేస్ట్ రీసైక్లింగ్ ప్లాంట్ ప్రారంభం కానుంది. ఈ రీసైక్లింగ్ నుంచి వెలువడే ఉత్పత్తులను వివిధ అవసరాలకు వినియోగించవచ్చు. ఇలా రెండు రకాలుగా ప్రయోజనం ఉండటంతో జీహెచ్‌ఎంసీ దీనిపై దృష్టి సారించింది. నగరంలో రోజుకు 2 వేల మెట్రిక్ టన్నుల సీఅండ్‌డీ వేస్ట్ వెలువడుతున్నట్లు అంచనా. దీని రీసైక్లింగ్‌కు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే నాలుగు ప్లాంట్లకు టెండర్లు పిలిచారు. వీటిని దక్కించుకున్న రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ సంస్థ (హైదరాబాద్ సీఅండ్‌డీ వేస్ట్ ప్రైవేట్ లిమిటెడ్) 2 ప్రాంతాల్లో పనులు చేపట్టింది. జీడిమెట్ల ప్లాంట్ దాదాపు పూర్తయింది.

– సాక్షి, హైదరాబాద్

ప్రాజెక్ట్ వ్యయం రూ.15 కోట్లు..

- జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ప్రభుత్వం 17 ఎకరాల స్థలం కేటాయించగా, 2018, జనవరి నుంచి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.15 కోట్లు.
- శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి గ్రీన్ అండ్ ఎకో ఫ్రెండ్లీగా తిరిగి వినియోగించుకునేలా చేస్తారు.
- వేస్ట్ ప్రాసెసింగ్, ప్రొడక్షన్.. ఇలా రెండు విభాగాలుగా పనులు చేస్తున్నారు. రీసైక్లింగ్‌తో ఇటుకలు, పేవర్ బ్లాక్‌లు తయారు చేస్తారు. వ్యర్థాలను క్రషింగ్ ద్వారా కంకరగా, కోర్, ఫైన్ ఇసుకగా మారుస్తారు. ఈ కంకరను రోడ్ల లెవెల్ ఫిల్లింగ్‌కు, ఇసుకను రోడ్డు పనుల్లో పీసీసీగా, ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడొచ్చు.

వ్యర్థాలతో తయారుచేసిన బ్రిక్

బిల్డర్లు, ప్రజలు సీ అండ్ డీ వేస్ట్‌ను తరలించేందుకు సంబంధిత నంబర్‌కు ఫోన్ చేస్తే సంస్థ వాహనాల ద్వారా తరలిస్తారు. ప్లాంట్ ప్రారంభమయ్యాక టోల్‌ఫ్రీ నంబర్, ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెస్తారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ కాల్‌సెంటర్ నంబర్ 040-21111111, మై జీహెచ్‌ఎంసీ యాప్, జీహెచ్‌ఎంసీ పోర్టల్ ద్వారా సమాచారమిచ్చినా తరలిస్తున్నారు. దీనికి

టోల్‌ఫ్రీ నంబర్, యాప్ అందుబాటులోకి

గాను ప్రస్తుతం టన్నుకు రూ.256 వసూలు చేస్తున్నారు. ప్లాంట్ ప్రారంభమయ్యాక టన్నుకు రూ.342 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ వ్యర్థాలను సొంతంగానే తరలిస్తే ఖర్చు తగ్గుతుంది. అయితే వీటిని తరలించే వాహనాలు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ ఎం ప్యానెల్ జాబితాలో నమోదై ఉండాలి. లేకపోతే భారీ జరిమానాతోపాటు వాహనాలనూ సీజ్ చేస్తారు.

ప్రయోజనాలు...

- ఎక్కడ పడితే అక్కడ సీఅండ్‌డీ వ్యర్థాలుండవు.
- రీసైక్లింగ్‌తో పేవర్ బ్లాక్‌లు, కెర్బ్ స్టోన్‌లు, ఇసుక, ఇటుకలు తదితరమైనవి ఉత్పత్తి చేసి పునర్వినియోగించడం వల్ల సహజ వనరులు వృథాకావు.
- కాలుష్యం తగ్గుతుంది.

జీడిమెట్ల ప్లాంట్

కలెక్షన్ పాయింట్ల ఏర్పాటు...

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలో నిర్మాణ వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసి వివిధ రకాల మెటీరియల్‌ను ఉత్పత్తి చేసే లక్ష్యంతో జీడిమెట్లలో సీ అండ్ డీ వేస్ట్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు బల్దియా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఈఈలు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాంకీ ఎన్విరో బయోమెడికల్ వేస్ట్ బిజినెస్ హెడ్ ఎ.సత్య తెలిపారు. సీ అండ్ డీ వేస్ట్ సేకరించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కలెక్షన్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు.

క్రాప్ కాలనీలతో లాభసాటి సాగు

గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి

సాక్షి, హైదరాబాద్: క్రాప్ కాలనీలతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పంట దిగుబడి, గిట్టుబాటు ధరలు రావాలంటే సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శనివారం ఓ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచి ధరలు లభించే వరకు ఉత్పత్తులు భద్రపరచడానికి ప్రతి మండలంలో 5 వేల టన్నుల సామర్థ్యంతో కూడిన గోదాములను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ వినూత్న పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. ప్రస్తుత యువత ఆలోచన మారుతోందని..ఉద్యోగాల కంటే వ్యవసాయం చేయడానికి ఇష్టపడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం మంచి పరిణామమని పేర్కొన్నారు. ప్రకృతి విపత్తులతో రైతులకు కలిగే నష్టాన్ని తగ్గించేలా పరిశోధనలు చేయాల ని సూచించారు. ఈ సదస్సులో సీజీజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జువ్వాడి దేవీప్రసాద్ రావు, వ్యవసాయ వర్సిటీ మాజీ డైరెక్టర్ రత్నాకర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జి.వి.సుబ్బారెడ్డి, వ్యవసాయ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ జలపతి రావు, అన్నామలై యూనివర్సిటీ ఆర్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా శంకర్

సాక్షి, హైదరాబాద్: అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ శంకర్, కార్యదర్శిగా అంబాల కిరణ్ నియమితులైనట్లు ఏబీవీపీ ఎన్నికల అధికారి కే రాంచందర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరు 2019-20 ఏడాదికి గాను అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి 20 వరకు కాకతీయ వర్సిటీలో జరిగే 38వ రాష్ట్ర మహాసభల్లో కొత్త అధ్యక్ష, కార్యదర్శులు బాధ్యతలు స్వీకరిస్తారని వివరించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన డాక్టర్ శంకర్.. 1983 నుంచి ఏబీవీపీలో కొనసాగుతున్నారు. పీహెచ్‌డీ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం ఉస్మానియా వర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అంబాల కిరణ్ స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గొల్ల బుద్ధారం. రాష్ట్ర కార్యదర్శిగా ఆయన రెండోసారి ఎంపికయ్యారు.

చారిత్రక స్థలాలు పరాధీనం?

- నయాఖిల్లాలో కొద్ది రోజులుగా ఏఎస్ఐ ఆధ్వర్యంలో పరిశీలన
- భూగర్భంలో మొఘల్ గార్డెన్ తరహా నిర్మాణం
- గతంలోనే 14 ఎకరాల్లో వెలికితీసిన అధికారులు
- మిగతా స్థలంపై తాజా అధ్యయనం
- ఆ స్థలాన్ని ఇవ్వాలని కోరుతున్న గోల్ఫ్‌కోర్సు నిర్వాహకులు

సాక్షి, హైదరాబాద్: గోల్కొండ పక్కనే ఉన్న నయాఖిల్లాలో ఉన్న చారిత్రక ప్రాధాన్యమున్న భూములను గోల్ఫ్‌కోర్సుకు ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాంతంలో గతంలో భారీ విస్తీర్ణంలో మొఘల్ గార్డెన్ తరహా నిర్మాణం ఉండేది. శతాబ్దాల క్రితమే అది భూమిలోకి కూరుకుపోయింది. దాన్ని సరిగ్గా 11 ఏళ్ల క్రితం గుర్తించి తవ్వకాలు ప్రారంభించారు. దాదాపు 14 ఎకరాల విస్తీర్ణంలో అలనాటి అద్భుత ఉద్యానవన నిర్మాణ ఆనవాళ్లు వెలుగు చూశాయి. దాని చుట్టూ ఇంకా మరో 16 ఎకరాల స్థలం ఉంది. అందులోనూ భూగర్భంలో నిర్మాణాలున్నాయి. ఇప్పుడు 14 ఎకరాల స్థలం మాత్రమే భారత పురావస్తు సర్వేక్షణ విభాగం పరిధిలో ఉంచి, మిగతాదాన్ని తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ స్వాధీనం చేసుకోబోతోందని సమాచారం. ఆ ప్రాంతంలో చుట్టూ

గోల్ఫ్ కోర్సు విస్తరించి ఉంది. మధ్యలో ఉన్న ఈ స్థలాన్ని కూడా తమకు అప్పగిస్తే గోల్ఫ్‌కోర్సును విస్తరిస్తామంటూ దాన్ని నిర్వాహక కమిటీ చాలాకాలంగా కోరుతోంది. ఖాళీగా ఉన్న 16 ఎకరాల్లో కొన్ని రోజులుగా శాస్త్రీయ పరిశోధనలో భాగంగా ఏఎస్ఐ కందకాలు తవ్వుతోంది. భూగర్భంలో ఉన్న నిర్మాణ అవశేషాలను తెలుసుకుని, అంత ప్రాధాన్యమైనవి లేనట్టు తేలితే పరాధీనం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే మీటరు నుంచి రెండు మీటర్ల మేర ఈ కందకాలను ప్రతి 30 అడుగుల నుంచి 60 అడుగులకొకటి చొప్పున తవ్వి చూస్తున్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో వెలుగు చూసిన భారీ ఉద్యానవనానికి సంబంధించి నీటి చానళ్లు, ఇతర అనుబంధ నిర్మాణాల అవశేషాలు వాటిల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఆ చానళ్లు వాడే అవసరం లేనందున, ఇతర నిర్మాణాల్లోనూ ముఖ్యమైనవి పెద్దగా లేవన్న ఉద్దేశంతో ఆ స్థలాన్ని తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థకు అప్పగిస్తూ, దానితో ఏఎస్ఐ ఒప్పందం చేసుకోనుందని విశ్వసనీయంగా తెలిసింది. దీనివల్ల గోల్ఫ్‌కోర్సు విస్తరణకు వీలుకలిగే అవకాశం ఉంటుంది. ఏఎస్ఐ రీజినల్ డైరెక్టర్ మహేశ్వరి ఇటీవలే అక్కడికి వచ్చి సర్వే చేసి వెళ్లారు. త్వరలో ఆమె నివేదిక ఇవ్వనున్నారు.

క్రీ.శ.1600 పూర్వమే నిర్మాణం

దేశంలో తాజ్‌మహల్, ఔరంగాబాద్‌లోని బీబీకా మఖ్బారా ముందు మొఘల్ గార్డెన్స్ ఉన్నాయి. పచ్చికబయళ్లు, ఫౌంటెన్లతో కూడిన ఆ ఉద్యాన వనాలు అద్భుతంగా ఉంటాయి. వాటికంటే ముందే అంతకంటే గొప్పగా నయాఖిల్లా వద్ద ఉద్యానవనాన్ని నిర్మించారు. గోల్కొండ కోటకు అనుబంధంగా నయాఖిల్లా నిర్మాణం సమయంలో క్రీ.శ.1600 పూర్వమే ఈ వనం నిర్మించినట్టు హైదరాబాద్ స్టేట్‌లో పురావస్తు అధికారిగా పనిచేసిన గులాం యాజ్దానీ పరిశోధించి తేల్చారు. దాదాపు పదేళ్ల క్రితం చేపట్టిన తవ్వకాల్లో ఇవన్నీ వెలుగు చూశాయి. మధ్యలో కొంతకాలం పనులు నిలిపేసినా... గత నాలుగేళ్లుగా మళ్లీ జరుపుతున్నారు. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్న సమయంలో ఏఎస్ఐ-పర్యాటకశాఖ మధ్య ఈ స్థలం విషయంలో ఒప్పందం జరిగింది. అలనాటి నిర్మాణ జాడలు లేని స్థలాన్ని పర్యాటకశాఖకు అప్పగించాలని, నిర్మాణాలుంటే అక్కడ ఎలాంటి కొత్త పనులు చేపట్టవద్దని నిర్ణయించారు. ఇప్పుడు కందకాలు తవ్వి పరిశీలిస్తుంటే 2 ఎకరాల మేర తప్ప నిర్మాణాలు విస్తరించి ఉన్నట్టు గుర్తించామని ఓ ఏఎస్ఐ అధికారి వ్యాఖ్యానించారు.

వరకట్నం కేసులో ట్రైనీ ఐపీఎస్‌పై వేటు

సాక్షి, హైదరాబాద్: ప్రేమించి పెళ్లి చేసుకుని తీరా సివిల్ సర్వీసుకు ఎంపిక య్యాక కట్నం పేరుతో వేధించిన ట్రైనీ ఐపీఎస్ అధికారిపై వేటు పడింది. అతన్ని శిక్షణ నుంచి సస్పెండ్ చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. కడపకు చెందిన కె.వెంకట మహేశ్వర్‌రెడ్డి తొమ్మిదేళ్ల కిందట ఉస్మానియాలో పీజీ చదివే సమయంలో బిరుదుల భావన అనే యువతితో స్నేహం చేశాడు. కాలక్రమంలో అది ప్రేమగా మారి, 2018లో వీరిద్దరూ కులాంతర వివాహం చేసుకున్నారు. తర్వాత కాపురం కూడా పెట్టారు. భావన రైల్వేశాఖలో పనిచేస్తోంది. కాగా, ఇటీవల సివిల్స్‌కు ఎంపికైనప్పటి నుంచి మహేశ్వర్‌రెడ్డి ప్రవర్తనలో మార్పు వచ్చింది. అధిక కట్నం ఇస్తామని తనకు వేరే పెళ్లి సంబంధాలు వస్తున్నాయని, తనను వదిలేయాలని భావనతో చెప్పాడు. అదేంటని ఆమె నిలదీస్తే.. తనకు చాలా పలుకుబడి ఉందని బెదిరించాడు. దీంతో భావన ఈ విషయంపై గతంలో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో వారిద్దరినీ పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అయినా, మహేశ్వర్‌రెడ్డి బెదిరింపులు ఆగకపోవడంతో మరోసారి భావన పోలీసులను ఆశ్రయించడంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, గృహహింస చట్టాల కింద పోలీసులు కేసు నమోదుచేశారు. దీనిపై స్పందించిన కేంద్ర హోంశాఖ ఈనెల 2 నుంచి అతన్ని శిక్షణ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీచేసింది. కేసులను పరిష్కరించుకున్నాక, మళ్లీ దరఖాస్తు చేసుకుంటే.. అదే సీనియారిటీతో శిక్షణలో చేరొచ్చని సూచించింది. సర్దార్ వల్లభ్‌భాయ్ నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు సస్పెన్షన్ విషయాన్ని ధ్రువీకరించారు.

చెల్లప్పకు లీడర్‌షిప్ అవార్డు ప్రదానం

సాక్షి, హైదరాబాద్ : బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త జె. డేనియల్ చెల్లప్పకు 'పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా పీఆర్ఎస్ఐ లీడర్‌షిప్ అవార్డును హోంమంత్రి మహమూద్ అలీ ప్రదానం చేశారు. అఖిల భారత ప్రజా సంబంధాల సదస్సులో ప్రభుత్వ మీడియా సలహాదారు కేవీ రమణాచారి సమక్షంలో శనివారం అవార్డును అందజేశారు. తన నాయకత్వపటిమతో ప్రజల సంక్షేమం, ప్రగతి, అభివృద్ధికి చెల్లప్ప కృషి చేశారని వక్తలు ప్రశంసించారు. కాగా, సంస్థను వృద్ధిపథంలో తీసుకొచ్చేందుకు కృషి చేసినందుకు సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్‌కు 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్'పురస్కారాన్ని అందజేశారు.

ఉల్లి తల్లి "ఢిల్లీ"

- ప్రభుత్వాలను నిలబెట్టగలదు, పడగొట్టనూ గలదు. అవును. ఉల్లికి అంత శక్తి ఉంది. అందుకే ఎన్నికలకు ముందు ఉల్లి ధరలు పెరిగితే ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. కేంద్రంలో ఇందిగాగాంధీ నుంచి మన్మోహన్ సింగ్ వరకు, రాష్ట్రానికి వస్తే షీలాదీక్షిత్ నుంచి సుష్మా స్వరాజ్ వరకు ఉల్లి విసిరే సవాళ్లను ఎదుర్కొన్న వారే.
- 1980లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్ని ఉల్లిపాయ ఎన్నికలనే పిలుస్తారు. అత్యవసర పరిస్థితి తర్వాత ఘోరంగా ఓడిపోయిన ఇందిరాగాంధీ 1980లో జరిగిన ఎన్నికల్లో ఉల్లి ధరల్ని నియంత్రిస్తానన్న హామీతో అధికార అందలాన్ని అందుకున్నారు. ఆనాటి ప్రధానమంత్రి చరణ్ సింగ్ హయాంలో ఉల్లిపాయ ధర కేజీ 5 రూపాయలకు చేరుకోవడంతో జనం గగ్గోలు పెట్టారు. ఉల్లి ధరకి కళ్లెం వేస్తానన్న ఇందిర అధికారంలోకి వచ్చాక ఉల్లి ధర రూ.6కి చేరుకుంది. దీంతో పార్లమెంటులో తొలిసారిగా ఉల్లిపాయ దండలు ధరించి ప్రదర్శనలు నిర్వహించిన దృశ్యాలు కనిపించాయి.
- 1998లో కూడా ఉల్లిపాయ ధరలు ప్రభుత్వాల్ని కుదిపేశాయి. దేశంలో తొలిసారిగా ఉల్లి దొంగలు బయటకొచ్చారు. అప్పట్లో ఉల్లిపాయ ధరలు కేజీ 45 రూపాయలకు చేరుకోవడంతో జనం హడలెత్తిపోయారు. దీపావళి కానుకగా ఉల్లిపాయల్ని ప్రభుత్వం పంచిపెట్టింది. అడ్డూ అదుపూ లేకుండా ధరలు పెరిగిపోవడంతో అప్పట్లో ఢిల్లీలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ సుష్మాస్వరాజ్‌ను ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోపెట్టింది. రూ.5కే కిలో ఉల్లిపాయలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయింది. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి.. షీలా దీక్షిత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇక రాజస్థాన్‌లో కూడా బీజేపీలో భైరాన్ సింగ్ షెకావత్ ప్రభుత్వం ఉల్లి ధరల్ని అదుపు చెయ్యలేక అధికారాన్ని కాంగ్రెస్‌కి అప్పగించింది.
- 2010లో కూడా ఉల్లి సంక్షోభం తలెత్తింది. అప్పట్లో కేజీ రూ.90కి చేరుకుంది. మళ్లీ 2013లో ఉల్లి కొరత ఢిల్లీని కుదిపేసింది. బీజేపీ, ఆప్‌లు మొబైల్ వ్యాన్‌లు పెట్టి ఉల్లిపాయల్ని తక్కువ ధరకి అమ్మారు. ఇప్పుడు మోదీ సర్కార్ కూడా ఎగుమతుల్ని నిషేధించి దిగుమతుల్ని పెంచుతోంది.

అంకెల్లో ఉల్లి

2 ఉల్లి ఉత్పత్తి చేసే దేశాల్లో మన స్థానం

24.8% ప్రపంచ ఉల్లి ఉత్పత్తిలో 2017లో మన వాటా

1.6 కోట్ల టన్నులు భారత్‌లో ఉల్లి సగటు వినియోగం

37.4% 2023 నాటికి ఉత్పత్తి చేయాలనే లక్ష్యంగా విధించుకునే వాటా

19.9 లక్షల టన్నులు 2018లో ఉల్లి ఎగుమతులు

50,000 మెట్రిక్ టన్నులు ప్రతీ రోజూ భారత్‌కు అవసరమయ్యే ఉల్లి

10-12 % అవసరమైన ఉల్లిలో ప్రస్తుతం సరఫరా అవుతున్నది

ఆర్టీసీలో కార్మిక సంఘాలు ఉండాల్సిందే

వెంటనే ఎన్నికలు జరపాలి: అశ్వత్థామరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో కార్మిక సంఘాలు లేకుండా చేసే ప్రయత్నం చట్ట విరుద్ధమని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే పునరాలోచించుకోవాలని, లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు. శనివారం ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో ఆయన జేఏసీ కోకన్వీనర్ బాబు, రవీందర్‌రెడ్డి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కార్మిక సంఘాల ఎన్నికలు ఉండాలనే కార్మికులంతా కోరుకుంటున్నారని, రహస్య బ్యాలెట్ నిర్వహించి వారి మనోగతం తెలుసుకుంటే వాస్తవాలు బోధపడతాయని తెలిపారు. ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశం తర్వాత అధికారుల తీరులో బాగా మార్పు వచ్చిందని, స్నేహపూర్వక వాతావరణం ఉండాలని సీఎం చెప్పగా, అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నగరంలో వెయ్యి బస్సులు తొలగిస్తే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని, నష్టాలొస్తున్నాయని తెలిసినా కొత్తగా మరో 1,334 అద్దె బస్సులు తీసుకురావడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.

'కేసీఆర్ సే తెలంగాణ బచావో': టీపీసీసీ

సాక్షి, న్యూఢిల్లీ: జాతీయ స్థాయిలో ఏఐసీసీ 'భారత్ బచావో'ఆందోళన స్ఫూర్తిగా తెలంగాణలో సైతం ప్రభుత్వ వైఫల్యాలపై 'కేసీఆర్ సే తెలంగాణ బచావో'ఆందోళన నిర్వహించాలని టీపీసీసీ కోర్ కమిటీ ప్రాథమికంగా నిర్ణయించింది. శనివారం ఢిల్లీలో 'భారత్ బచావో'ఆందోళనకు వచ్చిన కోర్ కమిటీ నేతలు సమావేశంలో పలు అంశాలను చర్చించారు. తెలంగాణ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, ఏఐసీసీ కార్యదర్శులు బోస్‌రాజ్, శ్రీనివాసన్, టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్, రేవంత్‌రెడ్డి తదితరులు శనివారం సమావేశమై తెలంగాణకు సంబంధించి పలు అంశాలను చర్చించారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, టీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యాలు, పార్టీ నుంచి బయటకు వెళ్లిన వారిని పార్టీలోకి ఆహ్వానించడం వంటి అంశాలపై చర్చించారు.

సమాజాన్ని విభజించే యత్నం!

పవన్‌కల్యాణ్ తీరుపై రాజు రవితేజ తీవ్ర విమర్శలు

సాక్షి, హైదరాబాద్: జనసేన అధినేత పవన్‌కల్యాణ్.. కులం, మతం ప్రాతిపదికన సమాజాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు మాజీ ప్రధాన కార్యదర్శి రాజు రవితేజ పేర్కొన్నారు. పార్టీ మూల సిద్ధాంతాలు, మౌలిక విలువలకు విరుద్ధంగా పవన్ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పవన్‌తో కలసి పనిచేయకండి.. ఆయన్ను నమ్మకండి.. అని పార్టీ నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రవితేజ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం జనసేన ఆధ్వర్యంలో సమాజాన్ని విభజించే, విచ్ఛిన్నపరిచే కార్యక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. నెలన్నర రోజులుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిర్వహిస్తున్న క్యాంపెయిన్ పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. సొంత పార్టీ వారిపైనే పథకాలు రచించడం, పైకి రానీయకుండా చేయడం పవన్ నైజమని, పార్టీని పర్సనల్ ప్రాపర్టీగా వాడుకుంటున్నారని అన్నారు.

మెల్‌బోర్న్ నిరసనలో పాల్గొన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

రాష్ట్రంలో పాలన పడకేసింది: కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసిందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో ఎవరూ సంతోషంగా లేరని, సీఎం కేసీఆర్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లోని సెయింట్ పాల్ కేథడ్రల్ ఫెడరేషన్ స్క్వేర్ వద్ద నిరసనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో కేసీఆర్ విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, కుమారుడు దీప్ ప్రజ్ఞ (విదేశ్ యూత్ కాంగ్రెస్ నేత), తదితరుల ఆధ్వర్యంలో పౌరసత్వ సవరణ బిల్లు, దేశంలో, రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగం, మహిళలకు భద్రత కరువు, రైతు మరణాలు, తదితర సమస్యలపై నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ఎన్ఆర్ఐలు కృషి చేయాలని కోరారు. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు.

పౌరసత్వ బిల్లుపై ఉద్యమించాలి: సురవరం

సాక్షి, హైదరాబాద్: దేశ లౌకిక ప్రజాతంత్ర మూలాలను ధ్వంసం చేసే పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాలని సీపీఐ సీనియర్ నేత సురవరం సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పొరుగు దేశాల్లో వివక్షను ఎదుర్కొంటున్న ముస్లిమేతరులకు భారత పౌరసత్వం ఇచ్చేందుకు ఉద్దేశించిన ఈ వివాదాస్పద బిల్లును పార్లమెంట్ ఆమోదించినా.. వామపక్షాలు, ప్రజాతంత్ర శక్తులు తీవ్రంగా వ్యతిరేకించాయని పేర్కొన్నారు. వ్యక్తుల మత గుర్తింపును పౌరసత్వానికి ముడిపెట్టడం విచారకరమని, లౌకికవాదానికి ఈ బిల్లు పూర్తిగా విరుద్ధమన్నారు. శనివారం మఖ్దూంభవన్‌లో మందా పవన్ అధ్యక్షతన జరిగిన సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో సురవరం మాట్లాడుతూ.. మత, సామాజిక విభజనకు మరింత పదునుపెట్టడం దేశ సమగ్రత, సమైక్యతకు అత్యంత ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ పౌరసత్వ పట్టికని (ఎన్ఆర్‌సీ) దేశమంతటికీ విస్తరిస్తామనడం సరికాదన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో, వారి సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు, రైతు, నిరుద్యోగ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ 'భారత్ బచావో'ఆందోళన శనివారం ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో నిర్వహించింది. తెలంగాణ నుంచి 4 వేల మంది నేతలు, కార్యకర్తలు ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ప్రధాని మోదీ విభజించి పాలించు తరహాలో దేశంలో వ్యవస్థలను నాశనం చేశారు. ఆర్థిక మాంద్యం దేశాభివృద్ధిని తిరోగమనంలో తీసుకెళ్తోంది. శాంతి భద్రతలు కరువయ్యాయి, మహిళలకు రక్షణ లేకుండా పోయింది'అని విమర్శించారు.

ఐడీసీ ఎత్తివేత!

- ఈఎన్‌సీల సంఖ్య పెంపు
- వారి పరిధిలోకి నలుగురైదుగురు సీఈలు
- సాగునీటి శాఖ పరిధిలో ఉన్న విధానాల పునర్‌వ్యవస్థీకరణ
- ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు కొత్త పాలసీ
- సీఎం సూచనల మేరకు 21, 22 తేదీల్లో వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ సాగునీటి ఎత్తిపోతల పథకాలన్నీ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి కావస్తుండటం.. అదే సమయంలో కాల్వలు, పంపులు, పంప్‌హౌస్‌లు, బ్యారేజీలు, రిజర్వాయర్‌ల నిర్వహణ కత్తి మీద సాములా మారనున్న తరుణంలో పలు విప్లవాత్మక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సాగునీటి శాఖను పూర్తిగా పునర్‌వ్యవస్థీకరించేందుకు సిద్ధమయ్యారు. భారీ, మధ్యతరహా, చిన్నతరహా అనేది లేకుండా అన్నింటినీ ఒకే గూటి కిందకు తేవాలని, ఇప్పటివరకు ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న రాష్ట్ర సాగునీటి అభివృద్ధి సంస్థ (ఐడీసీ)ని పూర్తిగా ఎత్తివేయాలనే ఆలోచనలో ఉన్నారు.

భవిష్యత్తుకు దిక్సూచిగా ప్రక్షాళన..

ప్రస్తుతం సాగునీటి శాఖలో ఐదుగురు ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)లు ఉన్నారు. వారికి అదనంగా మరో ఇద్దరు, ముగ్గురు ఈఎన్‌సీలను పెంచి వారి పరిధిలోకి నాలుగేసి జిల్లాల సర్కిళ్లను తేనున్నారు. ఒక్కో సర్కిల్‌కు చీఫ్ ఇంజనీర్‌ను నియమించి వారి కిందే జిల్లాకు సంబంధించిన భారీ, మధ్యతరహా, చిన్ననీటి, ఐడీసీ పథకాల పనులన్నింటినీ తేవాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం పాలమూరు జిల్లాను తీసుకుంటే జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి ప్రాజెక్టులకు ఒక సీఈ, మైనర్ వ్యవహారాలు చూసేందుకు మరో సీఈ, ఐడీసీ పథకాలకు మరో సీఈ ఉన్నారు. అయితే అలా కాకుండా జిల్లాకు సంబంధించిన అన్ని విభాగాల పనులు ఒక్క సీఈ కిందకే తేవాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశంగా ఉంది. దీని ద్వారా జిల్లాకు సంబంధించిన సమగ్ర సమాచారం ఒక్కరి వద్దే నిక్షిప్తంగా ఉంటుందని, నిర్ణయాలు సైతం ఒక్కరే తీసుకుంటారని, నిధుల ఖర్చు సులువుగా ఉంటుందని ఇటీవల సమీక్ష సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా ఐడీసీని పూర్తిగా ఎత్తివేయాలని సూచించారు. 10 వేల ఎకరాల వరకు సాగునీటిని అందించేలా ఐడీసీ ద్వారా ఎత్తిపోతల పథకాలు చేపడుతుండగా ప్రస్తుతం ప్రభుత్వం భారీ ఖర్చుతో ప్రాజెక్టులు చేపడుతున్నందున ఐడీసీ ప్రత్యేకంగా అక్కర్లేదన్నది సీఎం అభిప్రాయమని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. సీఎం సూచనల మేరకు వివిధ విభాగాలను సమీకృతం చేసేలా సాగునీటిశాఖ ప్రస్తుతం కసరత్తు ప్రారంభించింది. దీనిపై ఇంజనీర్లకు మార్గదర్శనం కోసం ఈ నెల 21, 22 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఈ మేరకు అందరికీ సమాచారం పంపింది. ఇందులో ఏదో ఒకరోజు వర్క్‌షాప్‌కు ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉంది.

ఓ అండ్ ఎంకు ప్రత్యేక పాలసీ..

రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం)కు ప్రత్యేక పాలసీని రూపొందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చూడాలని, దీనికి ప్రత్యేక బడ్జెట్ ఉండాలని సైతం సూచించారు. ఆయన సూచనల మేరకు ఎత్తిపోతల పథకాల పరిధిలో పంప్‌హౌస్‌లలోని పంపులు, మోటార్లు, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, రిజర్వాయర్, బ్యారేజీల గేట్లు, కాల్వలు, టన్నెళ్ల నిర్వహణంతా ఓ అండ్ ఎం కిందకే తేనున్నారు. వాటి నిర్వహణ ఖర్చును ఆయా జిల్లా బాధ్యతలు చూసే ఈఎన్‌సీ, సీఈలు పర్యవేక్షించేలా బాధ్యతలు అప్పగించనున్నారు. ఓ అండ్ ఎంకు అవసరమయ్యే ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, లష్కర్లు, ఆపరేటర్లు, ఇతర సిబ్బంది అవసరాలపై ప్రాజెక్టులవారీగా లెక్కలు తీసి నిర్ణీత సిబ్బంది నియామకాలు చేపట్టే బాధ్యతలను కట్టబెట్టనున్నారు.

శనివారం అనంతగిరిలో పుష్కరిణిలో పూజలు చేస్తున్న లక్ష్మణ్ తదితరులు

మూసీపై ప్రభుత్వం ప్రగల్భాలు

- నది ప్రక్షాళన చేసేవరకూ ఉద్యమం
- మున్సిపల్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్
- అనంతగిరిలో మూసీ ప్రక్షాళన పోరాటం ప్రారంభం

సాక్షి, వికారాబాద్: మూసీ నది ప్రక్షాళనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతుందే తప్ప, ఆచరణలో కార్యరూపం దాల్చడంలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. ప్రధాని మోదీ చేపట్టిన గంగానది ప్రక్షాళన స్ఫూర్తితో మూసీ నది ప్రక్షాళనకు ఉద్యమం ప్రారంభించామని తెలిపారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని మూసీ జన్మ స్థలం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేసి 'నమామి మూసీ'పేరిట పోరాటాన్ని ప్రారంభించారు. నదికి హారతి ఇచ్చిన అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ, మూసీ ప్రవహించే ఐదు జిల్లాల్లో ప్రక్షాళన కార్యక్రమం జరిగే వరకు బీజేపీ ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమం చేస్తామని వెల్లడించారు. ఇందులో అన్ని వర్గాలను కలుపుకుని వెళ్తామని, ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాల నుంచి ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటించారు. మెజార్టీ మున్సిపాలిటీలను కై వసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల మూసీ నది కాలుష్యకాసారంగా మారిందన్నారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కలుషిత నీటిని నది లోకి వదలడంతో పాటు డ్రైనేజీ నీరు కలిసి కంపుగా మారిందని తెలిపారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటంలేదని మండిపడ్డారు. రూ.3 వేల కోట్లతో మూసీ ప్రక్షాళనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఎటువంటి చర్యలూ ప్రారంభించలేదన్నారు. హుస్సేన్‌సాగర్‌ను ప్రక్షాళన చేసి కొబ్బరి నీళ్లలా మారుస్తామని చెప్పిన కేసీఆర్ మాటలకే పరిమితం అయ్యారని ఎద్దేవా చేశారు. 16న బాపూఘాట్, ఆ తర్వాత సూర్యాపేటలో మూసీ ప్రక్షాళన కోసం ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రాహుల్‌గాంధీ మైండ్ పొల్యూటైంది

కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మైండ్ పొల్యూట్ అయ్యిందని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ కోర్ కమిటీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. మూసీ ఉద్యమం ప్రారంభం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భారత్ బచావో పేరిట కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు.

ఒక్క రోజులో 26,488 కేసులు కొలిక్కి

లోక్ అదాలత్ బంపర్ హిట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్‌లను నిర్వహించారు. మొత్తంగా ఈ రోజు 26,488 కేసులు పరిష్కారం అయ్యాయి. హైకోర్టులో 503 కేసులు, కింది స్థాయి కోర్టుల్లో 25,985 కేసులు కొలిక్కి వచ్చాయి. ఈ జాబితాలో వివాద ప్రారంభ దశలో ఉన్న 14,462 కేసులు, విచారణలో ఉన్న 11,523 కేసులున్నాయి. హైకోర్టు కేసులు రాజీ కావడం ద్వారా కక్షిదారులకు రూ.4.71 కోట్లు అందనుంది. కింది స్థాయి కోర్టుల్లో కేసుల రాజీతో రూ.54.60 కోట్ల మేరకు వాద, ప్రతివాదులకు చెల్లించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ నవీన్ రావు, జస్టిస్ లక్ష్మణ్, రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ జీవీ సీతాపతిలు పలు కేసుల్ని రాజీ చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ ఆదేశాలతో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ అయిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నవీన్ రావులు అన్ని జిల్లాల్లో లోక్ అదాలత్‌లను పర్యవేక్షించారు. ముగ్గురు న్యాయమూర్తులు హైకోర్టు నుంచి జిల్లా కోర్టుల్లో కేసులను అంగీకారంతో రాజీ అయ్యేలా చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా పెద్ద సంఖ్యలో కేసుల్ని ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కారమైనట్లు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి జీవీ సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'కాళేశ్వరం'కు చౌకగా కరెంట్!

- యూనిట్‌కు రూ.3 లోపే ధరతో 1,500 మెగావాట్లు
- ఎన్టీపీసీ సీఎండీతో చర్చ తర్వాత ట్రాన్స్‌కో సీఎండీ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి 1,500 మెగావాట్ల సౌర విద్యుత్‌ను యూనిట్‌కు రూ.3 లోపు తక్కువ ధరతో విక్రయించేందుకు జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంసిద్ధత వ్యక్తం చేసిందని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం గోవాలో ఎన్టీపీసీ నిర్వహించిన దక్షిణాది ప్రాంత వినియోగదారుల సమావేశానికి హాజరైన ఆయన ఆ సంస్థ సీఎండీ గురుదీప్ సింగ్‌తో భేటీ అయ్యారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్వహణ కోసం వచ్చే ఏడాది విద్యుత్ అవసరాలు భారీగా పెరగనున్నాయని, కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రానికి అదనపు విద్యుత్ సరఫరా చేయాలని సమావేశంలో గురుదీప్‌సింగ్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన యూనిట్‌కు రూ.3లోపే 1,500 మెగావాట్ల సౌర విద్యుత్ విక్రయించేందుకు అంగీకరించారని తెలిపారు. రాష్ట్రంలో భారీగా జరుగుతున్న పునరుత్పాదక విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపుతుండటంతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదనను తగ్గించేందుకు బ్యాకింగ్ డౌన్ చేయాల్సి వస్తుందని, ఈ పరిస్థితులతో సూపర్ క్రిటికల్, సబ్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ల మధ్య భేదం లేకుండా పోయిందని సీఎండీ అభిప్రాయపడ్డారన్నారు. కేసీఆర్ విజ్ఞప్తి మేరకు రామగుండంలో 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామని గురుదీప్ తెలిపారన్నారు.

గ్రామాలపై దృష్టి పెట్టాలి

దంత వైద్యులకు మంత్రి ఈటల

హైదరాబాద్: దంత వైద్యులు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని సైబర్ సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో 6వ ఎడిషన్ తెలంగాణ స్టేట్ డెంటల్ కాన్ఫరెన్స్-2019ని శనివారం ఆయన ప్రారంభించారు. మూడ్రోజుల పాటు జరగనున్న ఈ కాన్ఫరెన్స్‌లో దంత వైద్యానికి సంబంధించిన పలు రకాల పనిముట్లు, యంత్ర పరికరాలు, శస్త్ర చికిత్స పద్ధతులకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈటల మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య అభివృద్ధిలో అట్టడుగున ఉన్న తెలంగాణ.. రాష్ట్రం ఏర్పడ్డాక దేశంలో మూడో స్థానానికి ఎదిగిందన్నారు. దంత వైద్యులు గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెట్టాలన్నారు. నూతన దంత వైద్య కళాశాలలు ఏర్పాటు చేసే బదులు ఇప్పుడు అందుబాటులో ఉన్న దంత వైద్యులనే సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. దంత వైద్య శిబిరాలు విస్తృతంగా నిర్వహించాలని రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

సామ్రాజ్యవాద కొత్త ముసుగులో అశాంతికి కుట్రలు

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

సాక్షి, హైదరాబాద్: సామ్రాజ్యవాదం కొత్త ముసుగులో అణ్వాయుధాలతో విధ్వంసాలు, మతాల పేరిట ఘర్షణలు సృష్టించేందుకు ప్రపంచ వ్యాప్తంగా కుట్రలు సాగుతున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. శాంతి, సౌభ్రాతృత్వం కోసం విద్యార్థులు, యువతను తగిన రీతిలో తీర్చి దిద్ది, వారిని ఈ రంగంలో ఉపయోగించే విషయంలో మేధావులు కృషి చేయాలని ఆయన కోరారు. శనివారం ఒక ప్రైవేట్ హోటల్లో ఆల్ ఇండియా పీస్, సాలిడారిటీ ఆర్గనైజేషన్ ద్వితీయ మహాసభలో ఆయన మాట్లాడుతూ అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలు, దోపిడీని, అశాంతిని నెలకొల్పే స్వభావం ఉన్న దేశాల విషయంలో లోతుగా ఆలోచించే సమయం ఆసన్నమైందన్నారు. ఇటీవలి తన అమెరికా పర్యటనలో ఆసక్తికరమైన విషయాలు దృష్టికి వచ్చాయని, అక్కడి యువత ఆర్థికంగా ఎదగడం కన్నా సోషలిజం వైపు మొగ్గుచూపుతున్నారని ఆయన ప్రస్తావించారు. ఆహ్వాన సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో సీపీఐ నేత సురవరం సుధాకర్ రెడ్డి, టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, శాంతి సంఘీభావ సంఘం నాయకులు పల్లబ్ సేన్ గుప్తా, అరుణ్ కుమార్, తిప్పర

రన్నరప్(ఫ్రాన్స్, భారత్)లతో కలసి చిరునవ్వులు చిందిస్తున్న మిస్ వరల్డ్ టోనీ-అన్ సింగ్(మధ్యలో)

మిస్ వరల్డ్‌గా జమైకా సుందరి

రెండో రన్నరప్‌గా భారత్‌కు చెందిన సుమన్ రావ్

లండన్: జమైకాకు చెందిన టోనీ-ఆన్ సింగ్ మిస్ వరల్డ్-2019 కిరీటం దక్కించుకున్నారు. లండన్‌లోని ఎక్సెల్ లండన్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమంలో ఆమెను ఈ కిరీటం వరించింది. గత ఏడాది మిస్ వరల్డ్‌గా నిలిచిన మెక్సికో సుందరి వనెస్సా పాన్స్.. టోనీ-ఆన్ సింగ్ తలపై మిస్ వరల్డ్ కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీలో ఫస్ట్ రన్నరప్‌గా ఫ్రాన్స్‌కు చెందిన ఒఫ్లి మెజినో, సెకండ్ రన్నరప్‌గా భారత్‌కు చెందిన సుమన్ రావ్ నిలిచారు. నవంబర్ 20వ తేదీ నుంచి మొదలైన 69వ మిస్ వరల్డ్-2019 పోటీలో 120 దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొన్నారు. పలు వడబోతల అనంతరం ఫైనల్స్ కోసం 10 మందిని ఎంపిక చేశారు. అంతిమంగా ఎంపికై న ఐదుగురికి ప్రముఖ వ్యాఖ్యాత పియర్స్ మోర్గాన్ నేతృత్వంలోని బృందం పలు ప్రశ్నలు సంధించింది. అందగత్తెల సమాధానాల ఆధారంగా విజేతలను ఎంపిక చేసింది. తన సొంతూరుతోపాటు ప్రపంచవ్యాప్తంగా లింగ సమానత్వం కోసం పోరాడతానని ఈ సందర్భంగా భారత్‌కు చెందిన రన్నరప్ సుమన్ రావ్ అన్నారు. జమైకా నుంచి మిస్ వరల్డ్ గెలుచుకున్న నాలుగో మహిళగా టోనీ-ఆన్ చరిత్ర సృష్టించారు. తొమ్మిదేళ్ల వయస్సులో ఆమె కుటుంబం అమెరికాకు వలస వెళ్లి, ఫ్లోరిడాలో స్థిరపడింది.

సుమన్ రావ్

- **జననం:** 1998 నవంబర్ 23
- **స్వస్థలం:** రాజస్తాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్ సమీపంలోని అయిదానా
- **తల్లి:** సుశీలా కున్వర్ రావ్, గృహిణి
- **తండ్రి:** రతన్ సింగ్, నగల వ్యాపారి
- **విద్య:** నవీముంబైలోని మహాత్మా స్కూల్ ఆఫ్ అకాడెమిక్స్ అండ్ స్పోర్ట్స్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు, ప్రస్తుతం ముంబై యూనివర్సిటీలో చార్టెర్డ్ అకౌంటెన్సీ చదువుతున్నారు.
- **భాషలు:** ఇంగ్లిష్, హిందీతోపాటు మాతృభాష మేవారీ
- **వృత్తి:** మోడల్, డ్యాన్సర్(కథక్)
- 2018లో మిస్ నవీముంబై పోటీలో పాల్గొని మొదటి రన్నరప్‌గా నిలిచారు. అనంతరం రాజస్తాన్ తరఫున పాల్గొని ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ -2019ను, ఆ పోటీల్లోనే మిస్ ర్యాంప్‌వాక్ అవార్డు గెలుచుకున్నారు.

'పౌరసత్వం'పై మంటలు

- బెంగాల్‌లో రైల్వే స్టేషన్‌కు, పలు బస్సులకు నిప్పు
- అస్సాంలో మంటల్లో ఆయిల్ ట్యాంకర్..డ్రైవర్ మృతి
- ఈశాన్య రాష్ట్రాల్లో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం

పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో బస్సులకు నిప్పుపెట్టి ఆందోళనకు దిగిన నిరసనకారులు

గువాహటి/కోల్‌కతా: సవరించిన పౌరసత్వ చట్టంపై అస్సాం, పశ్చిమబెంగాల్‌తోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. శనివారం బెంగాల్‌లో ఆందోళనకారులు రైల్వే స్టేషన్‌కు, బస్సులకు నిప్పుపెట్టారు. అస్సాంలోని సోనిపట్ జిల్లాలో శుక్రవారం రాత్రి ఆయిల్ ట్యాంకర్‌కు నిప్పుపెట్టడంతో అందులోని డ్రైవర్ మృతి చెందాడు. పౌరసత్వ చట్ట సవరణను రద్దు చేయాలంటూ ఈనెల 18వ తేదీన విధులు బహిష్కరించనున్నట్లు అస్సాం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. పౌరసత్వ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమంటూ దీనికి నిరసనగా ఈ నెల 21వ తేదీన బిహార్ బంద్ పాటించాలని ఆర్‌జేడీ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆందోళనల నేపథ్యంలో జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ ఈనెల 16 నుంచి జనవరి 5వ తేదీ వరకు సెలవులు ప్రకటించింది. పలు పరీక్షలను కూడా వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఇలా ఉండగా, అస్సాంలోని డిబ్రూగఢ్, గువాహటిలతోపాటు మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో అధికారులు శనివారం కర్ఫ్యూను సడలించారు. వదంతులు వ్యాపించకుండా అస్సాంలో ఇంటర్నెట్ సేవలపై నిషేధాన్ని ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించారు.

మంటల్లో రైల్వే స్టేషన్, బస్సులు

బెంగాల్‌లో రెండో రోజూ ఉద్రిక్తతలు కొనసాగాయి. ముర్షీదాబాద్, ఉత్తర 24 పరగణాల జిల్లాలు, హౌరా గ్రామీణ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్‌కు, బస్సులకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. హౌరా- ముంబై, ఢిల్లీ-కోల్‌కతా హైవేపై రెచ్చిపోయిన ఆందోళనకారులు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు చెందిన 15 బస్సులకు నిప్పుపెట్టడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బగ్నాన్‌లో 20 దుకాణాలు లూటీకి గురయ్యాయి. వందలాదిగా తరలివచ్చిన ఆందోళనకారులు శనివారం మధ్యాహ్నం సంక్రాయిల్ రైల్వే స్టేషన్ కాంప్లెక్స్‌కు నిప్పుపెట్టారు. పట్టాలపై బైఠాయించడంతో సెల్దా-హస్నాబాద్, షాండాలియా-కాక్రా మిర్జా పూర్, హౌరా-ఖరగ్‌పూర్ సెక్షన్లలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ పరిస్థితుల్లో ఈశాన్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది.

అస్సాంలో మరొకరు మృతి

అస్సాంలో శనివారం వివిధ సంఘాలు, సంస్థల ఆందోళనల కారణంగా రైళ్ల రాకపోకలు, రవాణా వ్యవస్థ స్తంభించాయి. విద్యాసంస్థలు, కార్యాలయాలు పనిచేయలేదు. సోనిపట్ జిల్లా ధెకియాజులి వద్ద శుక్రవారం రాత్రి ఖాళీ ఆయిల్ ట్యాంకర్‌కు ప్రజలు నిప్పుపెట్టడంతో అందులోని ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం ఉదయం అతడు ఆస్పత్రిలో కన్నుమూశాడని పోలీసులు తెలిపారు. గురువారం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఆందోళనకారులు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో రాష్ట్రంలో ఆందోళనల్లో మృతి చెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. కామాఖ్య రైల్వే స్టేషన్‌కు దిగ్బంధించడంతో దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి గువాహటి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజులపాటు సత్యాగ్రహం పాటించాలని ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఆందోళనలకు మద్దతుగా ఈనెల 18వ తేదీన విధులు బహిష్కరించనున్నట్లు అస్సాం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఎస్ఏకేపీ) అధ్యక్షుడు వాసవ్ కలిటా వెల్లడించారు. 16వ తేదీ నుంచి జరిగే సత్యాగ్రహ నిరసనలకు కూడా ఆయన మద్దతు ప్రకటించారు.

తమ పౌరులకు అమెరికా, బ్రిటన్ హెచ్చరిక

వాషింగ్టన్/లండన్: ఇంటర్నెట్ సేవలపై నిషేధం.. రవాణా వ్యవస్థకు అంతరాయం.. కొనసాగుతున్న ఆందోళనలు.. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా అమెరికా, బ్రిటన్‌తోపాటు కెనడా, సింగపూర్, ఇజ్రాయెల్ ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే తమ పౌరులకు హెచ్చరికలు జారీ చేశాయి. ఆందోళనలకు కేంద్ర బిందువుగా ఉన్న అస్సాంలో అధికార పర్యటనలను అమెరికా తాత్కాలికంగా రద్దు చేసింది. ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న తమ పౌరులకు ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం పలు సూచనలు చేసింది. ఆందోళనలు, అస్థిర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాలకు వెళ్లవద్దని, సాధ్యమైనంత వరకు జనసమ్మర్దం ఉన్న ప్రాంతాల్లో సంచరించవద్దని, చుట్టుపక్కల జరిగే పరిణామాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లరాదని బ్రిటన్, కెనడా, ఇజ్రాయెల్ తమ దేశస్తులను హెచ్చరించాయి.

అత్యాచారం.. ఆపై నిప్పు

చావుబతుకుల మధ్య బాధితురాలు

బండా (ఉత్తరప్రదేశ్): ఉన్నావ్‌లో అత్యాచార బాధితురాలిని నిందితులు సజీవ దహనం చేసిన ఘటన మరవకముందే అలాంటి దారుణం శనివారం యూపీలోని ఫతేపూర్ జిల్లాలో జరిగింది. ఫతేపూర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన 18 ఏళ్ల యువతి ఇంట్లో ఒంటరిగా ఉన్నపుడు దూరపు బంధువు ఒకరు ఆమెను రేప్ చేసి, ఆమెకు నిప్పంటించాడు. బాధితురాలి ఆక్రందనలు విన్న చుట్టుపక్కల వారు ఆమెను దగ్గరలోని ఓ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. బాధితురాలు కాన్పూర్‌లోని ఓ ఆస్పత్రిలో 90% కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

ఫరూక్ అబ్దుల్లా నిర్బంధం పొడిగింపు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా గృహనిర్బంధాన్ని మరో మూడు నెలలపాటు పొడిగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. సబ్‌జైలుగా ప్రకటించిన ఆయన నివాసంలోనే మరో మూడు నెలలపాటు ఫరూక్ అబ్దుల్లా నిర్బంధంలో ఉంటారని అధికారులు చెప్పారు. కశ్మీర్ స్వయంప్రతిపత్తిని ఎత్తివేస్తూ, ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర నిర్ణయం తీసుకున్నాక ఫరూక్‌ను ఆగస్టు 5వ తేదీ నుంచి గృహ నిర్బంధంలో(ప్రజా భద్రతా చట్టం కింద) ఉంచారు.

'పౌరసత్వం'పై కాంగ్రెస్ రెచ్చగొడుతోంది: అమిత్

గిరిధ్ బాఘ్మారా: పౌరసత్వ సవరణ చట్టం గురించి కాంగ్రెస్ ప్రజలను రెచ్చగొడుతోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చెప్పారు. శనివారం ఆయన జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తాము తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం కాంగ్రెస్‌కు కడుపునొప్పి తెప్పించిందని, అందుకే ఆ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రజలను రెచ్చగొడుతోందని అన్నారు. రాహుల్ గాంధీ జార్ఖండ్‌ను ఇటాలియన్ కళ్ల జోడుతో చూస్తున్నారని, అందుకే అభివృద్ధి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని, అయితే వారికి మద్దతుగా ట్రిపుల్ తలాక్ చట్టం తెచ్చిన ఘనత ఎన్డీయేదేనని స్పష్టంచేశారు. డిసెంబర్ 16న జార్ఖండ్‌లో నాలుగో విడత ఎన్నికలు జరగనున్నాయి.

నా పేరు రాహుల్ సావర్కర్ కాదు

- చావనైనా చస్తాను కానీ సారీ చెప్పను
- దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ నాశనం చేశారు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: దేశంలో అత్యాచారాల గురించి తాను చేసిన వ్యాఖ్యలపై వెనక్కుతగ్గబోనని, క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. రాహుల్ 'రేప్ ఇన్ ఇండియా'వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. 'నా పేరు రాహుల్ గాంధీ. రాహుల్ సావర్కర్ కాదు. నేను నిజమే మాట్లాడాను. చావనైనా చస్తాను కానీ క్షమాపణ మాత్రం చెప్పను'అని ఉద్ఘాటించారు. దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన భారత్ బాచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్.. ప్రధాని మోదీపై నిప్పులు చెరిగారు. తనకు తానుగా దేశభక్తుడిగా అభివర్ణించుకునే ప్రధాని.. ఒంటి చేత్తో ఆర్థిక వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు సమయమిదే: సోనియా

ఈ దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ చివరి శ్వాస వరకూ పోరాడుతూనే ఉంటుందని పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ స్పష్టం చేశారు. భారత్ బచావో ర్యాలీలో సోనియా మాట్లాడారు. ప్రజలందరూ అన్యాయంపై గళమెత్తాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దేశంలో ప్రస్తుతం అరాచక రాజ్యం నడుస్తోందని, సబ్‌కా సాథ్, సబ్ కా వికాస్ అన్న అధికార పక్ష నినాదం స్ఫూర్తి ఏదని దేశం మొత్తం ప్రశ్నిస్తోందని ఆమె భారతీయ జనతా పార్టీపై విరుచుకుపడ్డారు. ఈ నాటి అరాచకత్వంపై పోరాడకపోతే మనం చరిత్రలో పిరికివాళ్లుగా మిగిలిపోతామని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ప్రియాంకా గాంధీ తన భారత్ బచావ్ ర్యాలీ ప్రసంగంలో స్పష్టం చేశారు.

గాంధీ, నెహ్రూల్లానే సావర్కర్ కూడా..

రాహుల్ 'సావర్కర్' వ్యాఖ్యలపై శివసేన స్పందించింది. హిందుత్వ సిద్ధాంతాల విషయంలో తమ పార్టీ రాజీపడే ప్రసక్తే లేదని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. 'వీర్ సావర్కర్ మహారాష్ట్రకు మాత్రమే కాదు.. దేశం మొత్తానికి ఆదర్శనీయమైన వ్యక్తి. నెహ్రూ, గాంధీలకు లాగానే సావర్కర్ కూడా దేశం కోసం తన ప్రాణాలు అర్పించారు. అలాంటి వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని ట్వీట్ చేశారు.

సరిపోయే పేరు.. 'రాహుల్ జిన్నా': బీజేపీ

ముస్లింల ఓట్ల కోసం రాజకీయాలు చేసే రాహుల్‌కు 'రాహుల్ జిన్నా'అనే పేరు అతికినట్లు సరిపోతుందంటూ బీజేపీ ఎద్దేవా చేసింది. బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు 'ముస్లింలను బుజ్జగించే రాజకీయాలు చేసే నువ్వు మొహమ్మద్ అలీ జిన్నా వారసుడివే తప్ప, సావర్కర్‌కు కాదు'అని వ్యాఖ్యానించారు. 'రాహుల్ ఇన్నాళ్లకు నిజం మాట్లాడారు. ఆయన ఎన్నటికీ రాహుల్ సావర్కర్ కాలేరు. నెహ్రూ-గాంధీ కుటుంబంలో 5వ తరం వ్యక్తి సావర్కర్ స్థాయికి సరితూగరు 'అని బీజేపీ ఐటీ విభాగం అధిపతి అమిత్ మాల్వీయ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

'పద్మశ్రీ' లీలాశాంసన్‌పై సీబీఐ కేసు

సాక్షి, చెన్నై: చెన్నైలో కళాక్షేత్రలోని ఆడిటోరియం పునరుద్ధరణ వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అక్రమాలను గుర్తించింది. ఆ క్షేత్ర మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, భరతనాట్య కళాకారిణి లీలా శాంసన్‌పై కేసు నమోదు చేసింది. ఆమెతో పాటు అప్పటి నిర్వాహకులు తదితరులపై కేసులు నమోదయ్యాయి. చెన్నై తిరువాన్మియూరులోని 'కళాక్షేత్ర' ఫౌండేషన్‌లో 2006-12 మధ్య కాలంలో ఆడిటోరియం పునరుద్ధరణ కోసం కేంద్ర సాంస్కృతిక విభాగం నుంచి రూ. 7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి.

ఆందోళన జరిగితే నెట్ కట్

కశ్మీర్‌లో కల్లోలం.. ఇంటర్నెట్ కట్
ఈశాన్య రాష్ట్రాల్లో ఉద్రిక్తం.. సమాచారం షట్ డౌన్
సున్నిత అంశాలపై కీలక తీర్పు..
బయట ప్రపంచంతో సంబంధాలు ఉండవ్
ఏ ఆందోళనకైనా, ఏ నిరసనకైనా
అదే తంత్రం, అదే వ్యూహం

న్యూఢిల్లీ/వాషింగ్టన్: పౌరసత్వ సవరణ బిల్లుకి వ్యతిరేకంగా ఈశాన్య రాష్ట్రాలు అట్టుడుకుతున్నాయి. అస్సాంలో అంతకంతకూ ఆందోళనలు అధికమవడంతో పది జిల్లాల్లో మొబైల్, ఇంటర్నెట్ సేవల్ని 24 గంటల సేపు నిలిపివేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇప్పుడే కాదు 2018లో భారత్‌లో పలు సందర్భాల్లో 100 సార్లకుపైగా ఇంటర్నెట్ సేవలు బంద్ అయ్యాయి. భద్రతా కారణాల రీత్యా సమాచార సంబంధాలను నిలిపివేయడం ఇవాళ, రేపు చాలా దేశాల్లో జరుగుతోంది. ఆందోళనల్ని అణచివేయాలంటే ప్రజలకి ఇతర ప్రాంతాలతో సంబంధాలు లేకుండా చేయడమే మార్గమన్న ఉద్దేశంలో ప్రభుత్వాలు ఉన్నాయి.భారత్‌తో పాటు చైనా, ఇరాన్, ఇథియోపియా దేశాల్లో ఈ ధోరణి కనిపిస్తోంది. అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ ఫ్రీడమ్ హౌస్ సర్వేలో ఈ అంశం వెల్లడైంది. ఇంటర్నెట్, డిజిటల్ మీడియా స్వేచ్ఛపై 65కు పైగా దేశాల్లో ఈ సంస్థ సమగ్ర అధ్యయనాన్నే నిర్వహించింది.

2018లో 100 సార్లకుపైగా ఇంటర్నెట్ షట్‌డౌన్

ఈ ఏడాది 90 సార్లు • రికార్డు సృష్టిస్తున్న భారత్

మన దేశంలో మొదటిసారిగా 2010లో గణతంత్ర దినోత్సవాలకు ముందు కశ్మీర్ లోయలో ఇంటర్నెట్, ఫోన్ సేవల్ని నిలిపివేశారు.

ఎప్పుడెప్పుడు ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు

- 2016లో హిజ్‌బుల్ ముజాహిదీన్ ఉగ్రవాది బర్హాన్ వనిని హతం చేసిన తర్వాత కశ్మీర్‌తో బయట ప్రపంచానికి 133 రోజుల పాటు సంబంధాలు తెగిపోయాయి.
- కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని నిర్వీర్యం చేసే ఆర్టికల్ 370 రద్దు చేయడానికి ముందు రోజు ఆగస్టు 4 నుంచి కశ్మీర్‌లో ఇంటర్నెట్, ఫోన్ సేవలు నిలిపివేశారు. ఇప్పుడు ఫోన్ సేవలు పునరుద్ధరించారు కానీ, 130 రోజులు గడుస్తున్నా ఇంటర్నెట్ ఇంకా వాడకంలోకి రాలేదు.
- 2016లో పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్‌లో ప్రత్యేక గూర్ఖాలాండ్ ఆందోళన సమయంలో 100 రోజులు ఇంటర్నెట్ షట్ డౌన్ చేశారు.
- 2015లో గుజరాత్‌లో విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు డిమాండ్ చేస్తూ పటీదార్ ఉద్యమం సందర్భంలోనూ ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.
- గత నెలలో రామజన్మ భూమి తీర్పుకు ముందు ఉత్తరప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, రాజస్తాన్‌లో కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ బంద్ అయింది.

ఏ ఏడాది ఎన్నిసార్లు

2017 -	79
2018 -	134
2019 -	90

2012 నుంచి లెక్కల్ని చూసుకుంటే 360సార్లకు పైగా దేశంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి.

హోంశాఖకి అధికారాలు

ప్రజల భద్రత కోసం ఇంటర్నెట్, టెలిఫోన్ సేవల్ని తాత్కాలికంగా నిలిపివేయడానికి, ఆంక్షలు విధించడానికి 2017లో ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టంలోని కొన్ని నిబంధనల్ని చేర్చారు.. దీని ప్రకారం కేంద్ర హోంశాఖ, హోంశాఖ కార్యదర్శులకు తాత్కాలికంగా ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసే అధికారం ఉంటుంది. అయితే అయిదు రోజుల తర్వాత పరిస్థితుల్ని తప్పనిసరిగా సమీక్షించాలి.

ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు

భారత్‌లో అధికారాన్ని అడ్డుపెట్టుకొని చిన్నపాటి అనిశ్చితి పరిస్థితులకి కూడా ఇంటర్నెట్ సేవల వినియోగాన్ని నిలిపివేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేరళ హైకోర్టు ఇంటర్నెట్ అందుబాటులో ఉండడం అన్నది ప్రాథమిక హక్కు అని వ్యాఖ్యానించింది. రోజుల తరబడి ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేయడం చట్టవ్యతిరేకమని సెంటర్ ఫర్ ఇంటర్నెట్ సొసైటీ సభ్యుడు ప్రణేష్ ప్రకాశ్ అంటున్నారు.

యాంటీ బయాటిక్స్ అతి వాడకం అనర్థమే

బోస్టన్: తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోని పిల్లలు వారి మొదటి ఐదేళ్ల జీవితంలో సగటున 25 యాంటీ బయాటిక్ ప్రిస్క్రిప్షన్లను అందుకుంటున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇది వారిలో వ్యాధికారకాలతో పోరాడే సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని, అలాగే ప్రపంచవ్యాప్తంగా యాంటి బయాటిక్ నిరోధకతను పెంచుతుందని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంక్షోభానికి దోహదం చేసే ప్రధాన కారకాల్లో యాంటి బయాటిక్స్ వాడకం కూడా ఉందని తెలిపింది.

100కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

న్యూఢిల్లీ: మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ (ఎన్‌సీబీ) దేశంలోని పలుచోట్ల దాడులు చేసి రూ. 100 కోట్ల విలువైన 20 కేజీల నాణ్యమైన కొకైన్‌ను స్వాధీనం చేసుకుంది. దీనికి సంబంధించి అంతర్జాతీయ ముఠాకు చెందిన 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎన్‌సీబీ శనివారం తెలిపింది. వీరిలో అయిదుగురు భారతీయులు, ఇద్దరు నైజీరియన్లు, ఒక అమెరికన్, ఒక ఇండోనేషియన్ మహిళ ఉన్నట్లు వెల్లడించింది. త్వరలో రానున్న నూతన సంవత్సర వేడుకల్లో దీన్ని విక్రయించేందుకు వీరు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది.

ప్రశాంత్ కిశోర్‌తో కేజ్రీవాల్ జట్టు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) తో జట్టు కట్టారు. ఈ విషయాన్ని అరవింద్ కేజ్రీవాల్ శనివారం ట్వీట్ చేశారు. 2014లో మోదీ తరఫున ప్రశాంత్ ప్రచార వ్యూహాలు సిద్ధంచేశారు. ప్రస్తుతం ప్రశాంత్ బిహార్‌లోని జనతా దళ్ (యూ) ఉపాధ్యక్షుడిగానూ వ్యవహరిస్తున్నారు. కేజ్రీవాల్ శనివారం చేసిన ట్వీట్‌కు స్పందనగా ''పంజాబ్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ గట్టి ప్రత్యర్థిగా చూశామని, కానీ ప్రశాంత్ కిషోర్ ఎన్నికల వ్యూహాల కారణంగా కాంగ్రెస్‌ను విజయం వరించిందని''ఐప్యాక్ మరో ట్వీట్ చేసింది. ''పంజాబ్ ఎన్నికల ఫలితాల తరువాత మిమ్మల్ని (కేజ్రీవాల్) మేము ఎదుర్కొన్న బలమైన ప్రత్యర్థిగా గుర్తించాం. ఇప్పుడు కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీతో చేతులు కలపడం సంతోషాన్నిస్తోంది''అని తెలిపింది. ఢిల్లీ అసెంబ్లీలోని మొత్తం 70 స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ ఆమ్ ఆద్మీపార్టీలతో ముక్కోణపు పోటీ నెలకొన్న విషయం తెలిసిందే.

'నమామి గంగా'పై మోదీ సమీక్ష

ఒడ్డున ఉన్నవాళ్లకు మోదీ అభివాదం

కాన్పూర్: గంగా నది శుద్ధీకరణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉండే సంబంధాలకు ప్రత్యక్ష తార్కాణంగా నిలవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. నమామి గంగా ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన జాతీయ గంగా మండలి మొదటి భేటీకి ప్రధాని మోదీ అధ్యక్షత వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చంద్రశేఖర్ ఆజాద్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో శనివారం ఈ భేటీ జరిగింది. నదీ జలాలను రక్షించేందుకు అది ప్రవహిస్తున్న రాష్ట్రాలకు 2015-20 వరకు రూ. 20 వేల కోట్లు ఇవ్వడానికి కేంద్రం ముందుకు వచ్చిందని సంబంధిత వ్యవహారాల అధికారులు తెలిపారు. భేటీ అనంతరం మోదీ అరగంట పాటు గంగా నదిలో బోటు షికారుకు వెళ్లారు. ప్రయాణం నుంచి తిరిగి వస్తున్న క్రమంలో ఘాట్ మెట్లు ఎక్కుతుండగా ఆయన పట్టు జారి పడిపోయారు. వెంటనే ఆయన వెంట ఉన్న బలగాలు ఆయనకు సహాయం చేశాయి. అన్ని మెట్లలో ఒక మెట్టు ఎత్తు ఎక్కువగా ఉండటం వల్ల ఈ ఘటన జరిగినట్లు ఎస్పీజీ బలగాలు తెలిపాయి.

TENDER NOTICE
OLD USED GUNNY BAGS FOR SALE
Contract Period:
1st January-2020 to 30th June-2020
180 to 200 Tons per Month at the following locations
1. CHEGUNTA, Medak Dt.
2. RAJAHMUNDRY 3. ANAKAPALLY
Interested parties may send their sealed tenders along with Rs. 1,00,000/- DD per each plant on or before 5.30 pm on 25th December, 2019 to:
The General Manager
M/s. VENKATESHWARA HATCHERIES PVT LTD.
INTEGRATION DIVISION
Zonal Office: Survey No. 128, 4th Floor, Ratna Arcade, Beside Vensai Towers & Heritage Supermarket, Kompally, Hyderabad - 500 014, Telangana.
Subject to M/s. VENKATESHWARA HATCHERIES PVT LTD. Terms and Conditions

విభజన వ్యూహాలు ప్రమాదకరం

ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత, పాకిస్తాన్ అవలక్షణాలుగా చెబుతున్న అంశాల నుంచి తనను తాను వేరుచేసుకోవడానికి భారత్‌కు 25 ఏళ్లు పట్టింది. కానీ ఇన్నేళ్లుగా దేశం సాధించిన ప్రయోజనాలన్నింటినీ దేశీయ ప్రయోజనాల పేరిట మోదీ, అమిత్ షాలు వృథా చేసేశారు. భారత్ గురించి పాకిస్తాన్‌లో పెంచిపోషిస్తూ వచ్చిన అభద్రతా భావం, వైరభావం, ఉన్మాద ప్రచారం వంటివి మన దేశంలో ప్రస్తుతం కొన్ని చర్చల్లో కనిపించడం ఆశ్చర్యకరం. దేశీయ రాజకీయాల్లో తనకు ఉపయోగపడే సాధనంగా పాకిస్తాన్‌ను భారత్ ఇప్పుడు కొత్తగా కనుగొంటోంది. మత ప్రాధాన్యమైన, జాతీయ భద్రతా రాజ్యాన్ని నిర్మించుకోవడంలో పాక్ చేసిన ప్రయోగాలను భారత్ ఇప్పుడు చేపట్టాలనుకోవడం వేర్పాటువాదంలోకి మనకు మనం కూరుకుపోయేలా చేస్తుంది. నిజానికి ఈ విభజన తత్వం మనం అధిగమించాల్సిన విషాదం మాత్రమే.

శేఖర్ గుప్తా

జాతీయ భద్రత కలిగిన దేశాన్ని మనం ఎలా నిర్వచించాలి? మన పొరుగునే ఉంటున్న పాకిస్తాన్ నుంచి దీనికి ఉదాహరణలను చూద్దాం. జాతీయ భద్రత లేక అభద్రత అనే భావం చుట్టూతానే పాకిస్తాన్‌కి సంబంధించిన ప్రతి విషయం నిర్మాణమవుతూ వచ్చింది. అందుకే పాక్ సైన్యం దేశ అధికార చట్రంలో శాశ్వతమైన, ప్రత్యేక హోదాను కలిగి ఉంది. దాని నిఘా సంస్థ అయిన ఐఎస్ఐకి ఎవరికీ లేనంత సంస్థాగత స్వయం ప్రతిపత్తిని కట్టబెట్టారు.

పాకిస్తాన్‌లోని 21 కోట్ల మందికి పైగా ప్రజలను ఎవరైనా ఎలా భ్రమల్లో పెట్టగలరు? అంటే ఒక ప్రమాదకరమైన దెయ్యాన్ని చూపించడం ద్వారా ఇన్ని కోట్ల మందిని భయపెడుతూ పాక్ తన పబ్బం గడుపుకుంటూ వచ్చింది. జాతీయ భద్రత కలిగిన దేశ నిర్మాణం అంటూ సమర్థించుకోవాలంటే ముందుగా మీరు ప్రజల్లో భయాన్ని పాదుకొల్పాలి. పాక్ ప్రజల పాలిట భయంకరమైన రాక్షసిగా భారత్‌ని పాక్ విజయవంతంగా చిత్రిస్తూ వచ్చింది. భారత్ బూచిని చూపించడం ద్వారానే పాక్ ప్రభుత్వాలు సైన్యంపై అంత ఖర్చు పెట్టగలిగాయి. పాక్ గురించి నేను సందర్భానుసారం రాస్తూవచ్చిన అనేక కథనాల్లో ఒక దాంట్లో ఇలా పేర్కొన్నాను. 'వాఘా బోర్డర్ వద్ద మీ పాస్‌పోర్టులో స్టాంప్ వేస్తున్న ఇమిగ్రేషన్ అధికారి తలపై ఒక నోటీసు వేలాడుతూ ఉంటుంది. ఆ నోటీసులో ఇలా రాసి ఉంటుంది. మేం అందరినీ గౌరవిస్తాం. అందరినీ అనుమానిస్తాం'.

దీనర్థం ఏమిటంటే జాతీయ భద్రతా ప్రభుత్వం అంటేనే అనుమానాస్పదమైన ప్రభుత్వం అనే. పైగా, ఈ కారణం వల్లే పాక్ అంత అస్తవ్యస్తతలో ఉంటోంది. దివాలా తీసిన, రుణాల కోసం సాగిలబడుతున్న ఆర్థిక వ్యవస్థ, విచ్ఛిన్నమైపోయిన సమాజం, పతనమవుతున్న సామాజిక సూచికలు, జాతీయ సంపదలను టోకున అమ్మిపడేయడం, పొరుగునున్న 'అంకుల్ చైనా'కు రక్షణ ఫీజుల కింద దేశ భూభాగాన్నే అప్పగించేయడం, జిహాద్ యూనివర్సిటీ, ప్రపంచ వలస సరఫరా కేంద్రం వంటి వాటికి పేరొందడం ఇవీ పాక్ లక్షణాలు. ప్రత్యేకించి పొరుగుదేశాలు పాక్ నుంచి నేర్చుకోవలసిన అతి ముఖ్యమైన పాఠం ఏమిటంటే.. 'నాలాగా ఎవరూ ఉండవద్దు' అనే.

ప్రస్తుత భారతదేశం సరిగ్గా దీనికి సాక్ష్యాధారంగా నిలబడుతోంది. ఎందుకంటే పాక్ ఇస్తున్న పై సందేశరూపంలోని హెచ్చరికను సీరియస్‌గా తీసుకోవద్దని మనం నిర్ణయించుకున్నాం. మరోవైపున, 2015 తదుపరి పాకిస్తాన్ చిక్కుకున్న స్వీయ భావావరోధంలో మనం ఇప్పుడు ఇరుక్కుపోయాం. 2014 నాటికి పాకిస్తాన్ మన బహిరంగ ప్రసంగాలు, చర్చల్లో కనిపించకుండాపోయింది. పరుగుపందెంలో భారత్, పాక్ కంటే ఎంతో ముందు కెళ్లింది. పాక్ చికాకు కలిగించే రాజ్యంగా దిగజారిపోయింది.

తాజాగా పార్లమెంటులో పౌరసత్వ సవరణ బిల్లుపై చర్చ, జార్ఖండ్ ఎన్నికల ప్రచార సందర్భంగా పాక్ గురించి గత వారం పాకిస్తాన్ పేరును పదే పదే చర్చిస్తూ వచ్చారు. సర్జికల్ దాడులు, బాలాకోట్ వైమానిక దాడి సమయంలో కాంగ్రెస్ వైఖరి సరిగ్గా పాకిస్తాన్ వైఖరితో ఎలా సరిపోలిందంటూ హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. ప్రధాని మోదీ కూడా ఎన్నికల ప్రచార ప్రసంగాల్లో ఇదే వైఖరిని ప్రతిబింబించారు. దేశీయ రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఇప్పుడు పాక్ పేరును తరచుగా ప్రస్తావిస్తూ వస్తోందన్న విషయం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.



పుల్వామా ఘటన నేపథ్యంలో మీరు మా వైపు ఉంటారా లేక పాక్ వైపు ఉంటారా అనే అంశం చుట్టూనే 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమం నడిచింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, మహారాష్ట్ర వంటి నాలుగు రాష్ట్రాల్లో జరిపిన బహిరంగ సభల్లో మోదీ పాక్ పేరును 90 సార్లు ప్రస్తావించారు. తర్వాత హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలోనూ ఇది కొనసాగింది. చాలా కాలం తర్వాత మన బహిరంగ చర్చల్లో, మన రోజువారీ జీవితంలో కూడా పాకిస్తాన్ పేరును ప్రస్తావిస్తున్నాము.

ఇప్పుడు పౌరసత్వ సవరణ బిల్లుపై జరిగిన చర్చ మొత్తంగా పాకిస్తాన్, దేశ విభజన ప్రాతిపదికపైనే నడిచింది. పాకిస్తాన్‌లో మైనారిటీలతో వ్యవహరిస్తున్న తీరు మనకు చర్చనీయాంశమైంది. అందుచేత పాకిస్తాన్‌లోని ముస్లిమేతర మైనారిటీల క్షేమాన్ని పట్టించుకోవలసిన ప్రత్యేక బాధ్యత భారత్‌పై పడినట్లుగా ఉంది. పాకిస్తాన్‌ని సహజంగానే ముస్లింల నివాస స్థలంగా ఎలా పరిగణిస్తూ వస్తున్నారో భారత్ కూడా ఇప్పుడు హిందువుల నివాసస్థలంగా ఉండాలనే వాతావరణం దేశంలో బలపడుతోంది. భారత్ గురించి పాకిస్తాన్‌లో పెంచిపోషిస్తూ వచ్చిన అభద్రతా భావం, వైరభావం, ఉన్మాద ప్రచారం వంటివి మన దేశంలో ప్రస్తుతం కొన్ని చర్చల్లో కనిపించడం ఆశ్చర్యకరం. రాజకీయ చర్చలను దేశ విభజన వద్దకు తీసుకుపోవడం, విభజన నాటి తప్పులను సరిదిద్దుతామని హామీ ఇవ్వడం, అతిపెద్ద శత్రువును అప్పట్లో ఊరికే వదిలేశామని విమర్శలు చేయడం.. వంటి పరిణామాలను చూస్తుంటే పాకిస్తాన్‌ను భారత్ కొత్తగా కనిపెడుతున్నట్లు కనిపిస్తోంది.

భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య అంతరం ఎంత దూరం పోయిందంటే ప్రపంచంలో ఏ ఒక్కరూ చివరకు చైనాతో సహా మన రెండు దేశాలను ఒకే వైఖరితో చూడడం లేదు. భారత్–పాక్ మధ్య ఉన్న హైపనేషన్ ఇప్పుడు పూర్తిగా చెరిగిపోయింది. అంటే భారత్, పాక్‌లను కలిపి చూసే పరిస్థితి మాయమైపోయిందని అర్థం. ఒకప్పుడు పాక్ అవలంబించిన వైఖరిని ఇప్పుడు మనం తవ్వి తలకెత్తుకుంటున్నామా అనిపిస్తోంది. ఎందుకంటే మొదట అభద్రతా భావాన్ని పెంచిపోషించకుంటే మీరు జాతీయ భద్రతా రాజ్యాన్ని ఎలా నిర్మించగలరు? అందుకే ఈ అవసరం కోసం మీకు భయపెట్టే శత్రువు అవసరం. అది పాకిస్తానే మరి. ఇప్పటికి అది అంత భయపెట్టకపోవచ్చు కానీ పాన్ ఇస్లామిజం అనే పెద్ద ప్రమాదాన్ని చూసినప్పుడు అది భయంకర రాక్షసిగా మారక తప్పదు. అదే ఇప్పుడు అనుమానాన్ని కలిగిస్తుండగా, భారత్‌లోని 20 కోట్ల మంది ముస్లింలకేసి చూస్తే అతిపెద్ద ఉపద్రవంలాగే కనిపిస్తారు మరి.

1947లో రెండు దేశాలు కొత్త చరిత్ర దిశగా అడుగులేయడం ప్రారంభించిన నాటి పరిస్థితిని సమీక్షిద్దాం. మన రెండు దేశాలూ విభిన్నమైన మార్గాలను ఎంచుకున్నాయి. ఒకటి ఉదారవాద రాజ్యాంగ గణతంత్ర రాజ్యంగా మారగా, మరొకటి మెజారిటీవాద, మతతత్వ, సైనిక రాజ్యంగా మారింది. ఒకటి అలీన రాజ్యంగా మారగా, మరొకటి ఆయా కాలాల్లో ప్రాబల్యంలోకి వచ్చిన సైనిక కూటములలో చేరింది. కేవలం 25 సంవత్సరాల లోపే, మతప్రాధాన్య రాజ్యంగా తనను తాను పేర్కొన్న పాకిస్తాన్ తన భూభాగంలో సగానికి పైగా జారవిడుచుకుంది, మరో కొత్త దేశం బంగ్లాదేశ్ రూపంలో ఉనికిలోకి వచ్చింది. చివరకు ఆ కొత్త దేశం కూడా తన మాతృదేశం సమూనాలోకే వెళ్లిపోయి, ఇస్లాంని తన మెజారిటీ వాద భావజాలంగా ఎంచుకునేసింది. దానికి తోడుగా మిలిటరీ పాలకులూ పుట్టుకొచ్చారు. రెండు దశాబ్దాలకుపైగా అప్పులను యాచిం చడం, దారిద్ర్యంలో కూరుకుపోవడం జరిగాక, అనేక మూడో ప్రపంచ దేశాల చెడు లక్షణాలకు బంగ్లాదేశ్ ఒక సమూనాగా నిలిచిపోయింది. అధిక జనాభా, దారిద్ర్యం అనే సాంక్రమిక వ్యాధుల దేశంగా దానికి పేరుపడిపోయింది. 'ఆల్ ది ట్రబుల్ ఇన్ ది వరల్డ్' అనే తన సంకలనంలో అమెరికన్ ప్రముఖ రచయిత పీజే ఓ రూర్కే అధిక జనాభాతో వచ్చే సమస్యలకు బంగ్లాదేశ్‌నే ఉదాహరణగా పేర్కొనడం భావోద్వేగాలను రెచ్చగొట్టింది. పైగా అది ఒక అసందర్భ వ్యాఖ్య కూడా. కానీ అంత దూకుడు రచనలో కూడా రూర్కే ఒక వాస్తవాన్ని పదునైన వాక్యంలో చెప్పాడు. 'తినడానికి తగినంత ఆహారం లేని దేశం, పండకముందే పంటను వాసన చూస్తున్న దేశం ఎలా మనగలుగుతుంది?'

కానీ, చాలా త్వరలోనే ఆ కొత్త దేశం భారత్ వంటి దేశాన్ని పోలిన లౌకిక, ఆధునిక ఆదర్శ రాజ్య నమూనావైపు నడక మార్చుకుంది. మరో రెండు దశాబ్దాలలోపే, బంగ్లాదేశ్ ప్రతి సామాజిక, ఆర్థిక సూచికలోనూ పాక్‌కంటే ఎంతో ముందుకు సాగింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 48 ఏళ్లక్రితం పాక్ పీడన నుంచి తన విముక్తిలో సహాయం చేసిన భారత్‌నే అది ఇప్పుడు వెనుకకు నెడుతోంది. ఆకలిదప్పులకు, బహిరంగ మలవిసర్జనకు నమూనాగా రూర్కే వ్యాఖ్యానించిన ఆ బంగ్లాదేశ్ ఇప్పుడు ఈ రెండు శాపాలను భూస్థాపితం చేసిపడేసింది. బంగ్లాదేశ్ ఇప్పుడు బహిరంగ మల విసర్జన నుంచి దాదాపుగా బయటపడింది. దాని జనాభా వృద్ధి రేటు గణనీయంగా అంటే భారత వృద్ధి రేటు స్థాయికి.. ఒక్కశాతానికి పడిపోయింది. పాకిస్తాన్ నుంచి కొని తెచ్చుకున్న భావజాల వైరస్‌ను తుంగలో తొక్కి బయటపడిన దాని ఫలితమే ఇదంతా మరి.

1985లో పాకిస్తాన్‌కు మొట్టమొదటి సారిగా సందర్శించినప్పుడు అదెంత మెరుగైన స్థితిలో ఉండేదో చూసి ఆశ్చర్యపోయాను. ఆనాటికి దాని తలసరి ఆదాయం భారత్ కంటే 65 శాతం ఎక్కువగా నమోదయ్యింది. కానీ 2019లో భారత్ తలసరి ఆదాయం పాక్ కంటే 60 శాతం ఎక్కువగా నమోదైంది. ఇదెలా జరిగింది? పాకిస్తాన్ సామాజిక–ఆర్థిక వృద్ధి సూచికలు ఎంతగా కుప్పగూలిపోయాయంటే ఐఎమ్ఎఫ్ నుంచి ఆ దేశం 13వసారి ఉద్దీపన ప్యాకేజీని అందుకోవాల్సి వచ్చింది. ఇక పాక్ జనాభా వృద్ధి రేటు భారత్, బంగ్లాదేశ్‌ల కంటే రెట్టింపు పెరిగింది. కాని ఇప్పటికీ అది జాతీయ భద్రతా రాజ్యంగా సైనికాధిపత్యంతోనే ఉంటోంది. ఎంతలా అంటే పాక్ ప్రధాని తన ఆర్మీ చీఫ్‌కు సలామ్ చేసేంతగా. భారత్ కంటే ఏ రంగంలో అయినా పాక్ ముందుందంటే బహుశా అణ్వాయుధాల సంఖ్యలోనే కావచ్చు. కానీ భారతీయ వ్యూహాత్మక అధ్యయనాల నిపుణుడు దివంగత కె. సుబ్రహ్మణ్యం తరచుగా ఒక మాట చెప్పేవారు, నీ దేశ రక్షణకు తక్కువ ఆయుధాలు అవసరమైనప్పుడు ఎందుకు ఎక్కువ ఆయుధాలకోసం వెంపర్లాడతావు?

కాగా, దేశీయ రాజకీయాల్లో తనకు ఉపయోగపడే సాధనంగా పాక్‌ను భారత్ ఇప్పుడు కొత్తగా కనుగొంటోంది. నిజానికి ఇది పేలవమైన ఎంపిక. ఇప్పుడు పాక్‌తో మనల్ని మనం పోల్చుకోవాలంటే భారత్ తన కాళ్లు నెప్పి పెట్టేలా ముందుకు వంగాల్సి ఉంటుంది. మరోమాటలో చెప్పాలంటే.. మత ప్రాధాన్యమైన, జాతీయ భద్రతా రాజ్యాన్ని నిర్మించుకోవడంలో పాక్ చేసిన ప్రయోగాలను భారత్ ఇప్పుడు చేపట్టాలనుకోవడం వేర్పాటువాదంలోకి మనకు మనం కూరుకుపోయేలా చేస్తుంది. నిజానికి ఇది మనం అధిగమించాల్సిన విషాదం మాత్రమే.

వ్యాసకర్త ద ప్రింట్ చైర్మన్, ఎడిటర్–ఇన్–చీఫ్
Twitter@ShekarGupta

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి బ.తదియ ఉ.8.30 వరకు, తదుపరి చవితి నక్షత్రం పునర్వసు ఉ.6.47 వరకు, తదుపరి పుష్యమి తె.5.46 వరకు (తెల్లవారితే సోమవారం), వర్జ్యం ప.2.26 నుంచి 3.58 వరకు, దుర్ముహూర్తం సా.3.54 నుంచి 4.36 వరకు, అమృతఘడియలు... రా.11.38 నుంచి 1.12 వరకు.

సూర్యోదయం : 6.26
సూర్యాస్తమయం : 5.24
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

బోరిస్ జాన్సన్ (బ్రిటన్ ప్రధాని) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ట్రంప్ ట్వీట్ పెట్టాడు. 'యు ఆర్ లుకింగ్ సో గుడ్' అన్నట్లుంది ఆ ట్వీట్. అన్నట్లుందే కానీ, అతడు అన్నదైతే అది కాదు. 'సెలబ్రేట్ బోరిస్' అంటాడు.

గెలిచిన వాళ్లెవరిలోనైనా అందాన్నే చూస్తాడు ట్రంప్. గెలుపంటేనే అందం ట్రంప్‌కి. దగ్గర్లేను. ఉంటే ఒక్కటిచ్చేవాడు. మగాడు మగాడికి ఇవ్వకూడనిది ఏదైతే ఉంటుందో సరిగ్గా దాన్నే ఇచ్చి ఉండేవాడు. ఇచ్చి నవ్వేవాడు. 'యు ఆర్ లుకింగ్ సో గుడ్' అనేవాడు మళ్లీ. లోపల ఇంకో ట్రంపేం ఉండడు పాపం నాన్–మేల్ రూపంలో. అదొక ధోరణి అంతే. దాన్ని అర్థం చేసుకున్నవాళ్లు మూడేళ్ల క్రితం ట్రంప్‌కి ఓటేశారు. మూడేళ్లు ట్రంప్‌ని చూశాక కూడా అర్థం చేసుకోనివాళ్లు అతడి ఇంపీచ్‌మెంట్‌కి నిన్న ఓటేశారు. నవ్వుకుని ఉంటాడు.

ట్వీట్‌లో 'సెలబ్రేట్ బోరిస్' అనడానికి ముందు.. నువ్వూ నేను కలిస్తే ఇక నీకెవరి డీల్సూ అక్కర్లేదని కూడా అన్నాడు ట్రంప్! 'జనవరిలో యూరోపియన్ యూనియన్ నుంచి బయటికి వచ్చేటప్పుడు యూనియన్‌తో నువ్వు కుదుర్చుకునే డీల్స్ అన్నిటికన్నా, అందులోంచి బయట పడినందుకు జనవరి తర్వాత నేనిచ్చే డీల్ నీ ముఖాన్ని వెలిగించేంత మనోహరంగా ఉంటుంది' అంటాడు!

ప్రధానిగా గెలిచినందుకు కాకుండా, ప్రధానిగా గెలిచినందుకు ట్రంప్ నాకేదో ఇస్తానని అన్నందుకూ కాకుండా.. నన్ను నేను సెలబ్రేట్ చేసుకోవలసిన గెలుపు ఇది. నేనేమిటో బ్రిటన్‌కి తెలుసు. తెలిసీ బ్రిటన్ ప్రజలు నాకు ఓటు వేశారంటే.. బ్రిటన్‌కి ఒక ప్రధానిగా వాళ్లు నన్నెన్నుకోలేదు. బ్రిటన్‌కి అవసరమైన ఒక ప్రధానిగా నన్ను ఎన్నుకున్నారు! అదీ నేను చేసుకోవలసిన సెలబ్రేషన్.

ఎన్నికల ప్రచారంలో లేబర్‌పార్టీ నా మీద చేసిన పెద్ద దుష్ప్రచారం.. నేను ట్రంప్‌లా ఉంటానని. ఇద్దరి ఫేస్‌లు ఒకేలా ఉంటాయని. ఇద్దరి జోక్‌లు ఒకేలా ఉంటాయని. ఇద్దరికీ 'గే' లంటే పరిహాసం అని. ఇద్దరికీ ముస్లింలంటే పడదని!

స్కాటిష్ నేషనల్ పార్టీ ఆ దుష్ప్రచారాన్ని ఫొటోషాప్‌లో ఇంకొంచెం పై లెవల్‌కి తీసుకెళ్లింది. యాభై ఐదేళ్ల వయసులో ట్రంప్ ఎలా ఉన్నాడో ఆ ఫొటోను సంపాదించి, 'చూడండి ప్రజలారా.. అచ్చు బోరిస్‌లా ఉన్నాడు కదా' అంది. డెబ్భై మూడేళ్ల వయసులో బోరిస్ ఎలా ఉంటాడో ఫేస్‌యాప్‌లోంచి తీసి, 'చూశారా ప్రజలారా.. అచ్చు ట్రంప్‌లా ఉన్నాడు కదా' అంది. ప్రజలు చప్పట్లు కొట్టారు. బోరిస్, ట్రంప్ ఒకలా ఉంటారు అన్నందుకు చప్పట్లు కొట్టారో.. బోరిస్, ట్రంప్ ఒకలా ఉన్నందుకు చప్పట్లు కొట్టారో ఇప్పడా రెండు పార్టీలకు అర్థమయ్యే ఉంటుంది.

యూరోపియన్ యూనియన్ నుంచి మనస్ఫూర్తిగా ఒక్క శుభాభినందనా అందలేదు. ఇంట్లోంచి ఒకరు వెళ్లిపోయి స్వతంత్రంగా ఉండాలనుకోవడం ఆ వెళ్లేవాళ్లకు సంతోషాన్నిస్తుంది కానీ, వాళ్లు ఉంటే బాగుంటుందని కోరుకునే ఇంటికి సంతోషాన్నివ్వదు.

జనవరి లోపు ఇల్లు వెకేట్ చేస్తామని చెప్పిన వాళ్లనే బ్రిటన్ గెలిపించింది. బోరిస్ ముఖం, ట్రంప్ ముఖం సేమ్ టు సేమ్ అన్నవాళ్లను పట్టించుకోలేదు. ఎవరి ముఖం ఎలా ఉంటే ఏమిటీ, ఒక ముఖమైతే ఉండటం ముఖ్యం కానీ అనుకుని ఉండాలి.

స్కాట్లాండ్ ఎప్పట్నుంచో బ్రిటన్‌నుంచి వెళ్లిపోతానని అంటోంది.

ఈయూ నుంచి బ్రిటన్ బయటికి వచ్చాక.. బ్రిటన్ నుంచి బయటికి వెళ్లిపోతానని స్కాట్లాండ్ ఈసారి పట్టుపట్టొచ్చు. 'నువ్వు బయటికి రావచ్చు కానీ నేను బయటికి వెళ్లిపోకూడదా..' అని కూడా అంటుంది. ట్రంప్ ఇస్తానన్న మనోరంజకమైన డీల్‌కి ముడిపెట్టి ఎలాగైనా స్కాట్లాండ్‌ను బయటికి వెళ్లకుండా ఆపాలి.

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

ఈ-మెయిల్

"నేను ఈ-మెయిల్ వినియోగించడం మానేశా. ముఖ్యమైన ఒక మెయిల్‌ను చదవడం కంటే డిలీట్ చేయాల్సిన వాటికే ఎక్కువ సమయం పడుతోంది. ప్రస్తుతం నా దగ్గర సుమారు ఇరవై వేల చదవని ఈ-మెయిల్స్ ఉన్నాయి"

– శేఖర్ కపూర్, దర్శకుడు

వేగం

"మన జీడీపీ కంటే వేగంగా పడిపోతున్నది ఒకటే ఒకటి ఉంది. అది మన ఇంటర్నెట్"

– ఆకాష్ బెనర్జీ, కమెడియన్

వినాలి

"దేశవ్యాప్తంగా అన్నిచోట్లా నిరసనలు తలెత్తుతున్నాయి. పౌరసత్వ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దేశం ఐక్యంగా ఉండాలని, రాజ్యాంగం అన్నిటికంటే ఉన్నతమైనదని అందరూ ఎలుగెత్తి చాటుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందరి వాదనలు వినాలి"

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

గౌరవం

"ప్రజా ఆస్తులపై దాడిచేసి, ధ్వంసం చేసే ఏ వర్గమూ ఈ ప్రపంచంలో సాధించేదేమీ లేదు. మతం సంగతి పక్కనబెట్టి అంతా తమ చదువులపై దృష్టి పెట్టాలి. అప్పుడు మాత్రమే వారు శాస్త్రవేత్తలు, కళాకారులు, మానవతావాదులుగా ఎదిగి ఇతరుల గౌరవాన్ని తమకు తాముగా సంపాదించుకుంటారు"

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

వాదన

"ఇదే వాదనను రాహుల్ గాంధీ తన గురించి ఎక్కువ చెప్పకోకుండా, మహారాష్ట్రలో పొత్తులు పెట్టుకోకుండా చేసి ఉంటే బావుండేదని నా అభిప్రాయం. సైద్ధాంతిక స్వచ్ఛత ఉండాలని కోరే రాహుల్ మహారాష్ట్రలో ఎందుకు పొత్తు పెట్టుకున్నట్టు? ఆయన మాటలు జాతీయ పౌరసత్వ సవరణ బిల్లు నుంచి దృష్టి మళ్లించడానికి తోడ్పడతాయి"

– బర్ఖాదత్, జర్నలిస్ట్

మూర్ఖత్వం

"పౌరసత్వ సవరణ బిల్లులో అతి పెద్ద అబద్ధం, మూర్ఖత్వం దాక్కుని ఉన్నాయి. దాని ఉద్దేశం ప్రకారం హిందువులు ఇతర హిందువులను (కులపరమైన దురాగతాలు లేవా?), ముస్లింలు ఇతర ముస్లింలను పీడించరు. బెంగాలీ ముస్లింల ఆధిపత్యాన్ని పంజాబ్ ముస్లింలు సహించి వుంటే బంగ్లాదేశ్ ఏర్పడేదే కాదు"

– సబా నఖ్వి, రచయిత్రి

సిగ్గు

"ప్రజల మోకాళ్లకంటే పైన కొట్టడానికి పోలీసులకు అనుమతిచ్చిన దేశం ప్రపంచంలో ఇండియా మాత్రమే. ఈ విషయంపై ఏ రాజకీయ పార్టీ, సంస్థా మాట్లాడకపోవడం సిగ్గుచేటు"

– కె.వి. కృష్ణస్వామి, జర్నలిస్ట్

నిస్సహాయ లిబియా

లిబియాలో అగ్రరాజ్యాలు నిప్పురాజేసి ఎనిమిదేళ్లవుతోంది. ఇప్పటికీ ఆ దేశం కుదుటపడలేదు. దేశాధినేతగా గడాఫీ ఉన్నప్పుడు ప్రశాంతంగా ఉండే ఆ దేశం అమెరికా దన్నుతో బ్రిటన్, ఫ్రాన్స్‌లు సాగించిన దురాక్రమణతో, వివిధ సాయుధ గ్రూపుల ఘర్షణలతో అస్తవ్యస్థంగా మారింది. వచ్చే ఏడాది అక్కడ 9 లక్షలమంది ప్రజానీకానికి మానవతా సాయం అవసరమవుతుందని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. అక్కడ స్వచ్ఛమైన మంచినీరు, వైద్య సదుపాయాలు, సురక్షితమైన ఆవాసం అవసరం ఉన్నదని సమితి మానవీయ వ్యవహారాల సమన్వయ విభాగం తెలిపింది. దీనికి 12 కోట్ల డాలర్ల సాయం అవసరమవుతుందని తెలిపింది. ఘర్షణలతో ఇళ్లూ వాకిళ్లూ వదిలి పోయినవారు, ఘర్షణలు జరిగే ప్రాంతంలో ఉంటూ సర్వం నష్టపోయిన వారూ, నిత్యం హింసను ఎదుర్కొంటున్నవారూ ఇప్పుడు సాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆ విభాగం వివరించింది. లిబియాలో ఇప్పటికీ అరాచకమే రాజ్యమేలుతోంది. గత ఏప్రిల్‌లో సైనిక కమాండర్ ఖలీఫా హఫ్తార్ తన బలగాలతో రాజధాని ట్రిపోలీపై దండెత్తినప్పటినుంచీ పరిస్థితి మరింత దిగజారింది. ప్రభుత్వ బలగాలకూ, హఫ్తార్ బలగాలకూ మధ్య ఇప్పటికీ ఘర్షణలు ఆగలేదు.హఫ్తార్‌కు సిరియా, ఉక్రెయిన్, సూడాన్‌ల నుంచి వచ్చిన సాయుధుల అండదండలున్నాయి

ఉత్పత్తిరేటు తగ్గినా మాంద్యం లేదంటే ఎలా?

సందర్భం

సారంపల్లి మల్లారెడ్డి

జాతీయ స్థూల ఉత్పత్తి రేటు తగ్గినప్పటికీ, భారత దేశంలో మాంద్యం లేదంటూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ నవంబర్ పార్లమెంట్ శీతాకాలం సమావేశాలలో ప్రకటించారు. మరోవైపు దేశంలో మాంద్యం కొనసాగడం వల్ల జాతీయ స్థూల ఉత్పత్తి తగ్గుతున్నదని ప్రధాని మోదీ ప్రకటించారు. పరస్పర విరుద్ధ ప్రకటనలతో ప్రధాని, ఆర్థిక మంత్రి భారత ప్రజానీకాన్నే కాక ఆర్థిక మేధావులను కూడా గందరగోళం చేస్తున్నారు. 2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతామని ప్రకటించారు. 2019–20లో 2.8 ట్రిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. 2025 నాటికి మరో 3.2 ట్రిలియన్ డాలర్లకు పెరగాలి. కానీ 2018–19లో 7.1 శాతంగా ఉన్న స్థూల ఉత్పత్తి రేటు ప్రస్తుతం రెండవ క్వార్టర్‌లో 4.5 శాతానికి తగ్గినట్లు ఆర్థిక గణాంకాలు చెపుతున్నాయి. ప్రస్తుత స్థూల ఉత్పత్తి రేటు ప్రకారం మరో 9 ఏళ్లకు అనగా 2033–34 నాటికి 5.18 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు చెపుతున్నారు. పై గణాంకాల్ని చూసినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ మాంద్యం వల్ల ఉత్పత్తి రేటు తగ్గినట్లు స్పష్టమవుతున్నది.

ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం ఈ మాంద్యం ఇప్పట్లో తగ్గదని తెలుస్తుంది. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిలోకి తెస్తామని, 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రధాని ఎన్నికల హామీ సందర్భంగా ప్రకటించారు. కానీ వ్యవసాయరంగం స్థూల ఉత్పత్తి ప్రస్తుతం 2.1 శాతంగా ఉంది. లక్ష్యం 4 శాతం పెట్టుకున్నప్పటికీ ఏనాడూ ఆ లక్ష్యాన్ని చేరలేదు. 2001 నాటికి 58.3 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడిన జనాభా ప్రస్తుతం 52.7 శాతంగా ఉన్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 25.7 శాతానికి తగ్గుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి ప్రధాని ప్రకటించిన పథకాలలో ఉత్పాదకత పెంచడం, గిట్టుబాటు ధర కల్పించడం, మంచి ఉపకరణాలను అందుబాటులో పెట్టడం, ఇరిగేషన్ సౌకర్యం కల్పించడం, విత్తన బదలాయింపు, తగినంత ఎరువు వాడకం, నూతన టెక్నాలజీ వినియోగం చేపట్టాలని ప్రణాళికలో చెప్పారు. మద్య దళారీలను తొలగించి ముందే నిర్ణయించిన కనీస మద్దతు ధరను మార్కెట్‌లో అమలు జరపడంతోపాటు, నిర్ణయించిన ధరకన్నా తక్కువ వచ్చినప్పుడు ఆ లోటు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. కానీ పై అంశాలేవీ వాస్తవంలో అమలుకు నోచుకోవడం లేదు.

దేశంలో 2018–19లో 43 కోట్ల ఎకరాలు సాగులో ఉండగా 30 కోట్ల ఎకరాలలో ఆహార ధాన్యాలు (7 కోట్ల ఎకరాలలో పప్పుధాన్యాలు కలిపి), 6

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 15-12-2019

హ్యాట్సాఫ్ టు దిశ యాక్ట్

ఏపీ సీఎంకు తారల ప్రశంస

**రియల్ లైఫ్.. రీల్ లైఫ్‌కి దగ్గరయ్యింది.
సినిమాల్లోనే సాధ్యమయ్యే సత్వర న్యాయం ఆంధ్రుల సొంతమయ్యింది.
ఓ రేప్ కేసును దృష్టిలో పెట్టుకొని 'టెంపర్' సినిమా తీశారట పూరి.
ఆడపిల్లకు అన్యాయం జరిగితే వాళ్లకు హీరో లాంటి
అన్నయ్య ఒకడుంటాడు అని 'రాఖీ' సినిమాలో కృష్ణవంశీ చూపించారు.
ఇప్పుడు ఆంధ్రాలో ఆడపిల్లలకు నేనున్నాను అంటున్నారు జగన్‌మోహన్‌రెడ్డి.
స్టార్స్ అంతా 'ఏపీ దిశ యాక్ట్'కు హ్యాట్సాఫ్ అంటున్నారు.**

జగన్ గారికి అభినందనలు - పూరి జగన్నాథ్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిగారు ప్రవేశపెట్టిన దిశాచట్టం చాలా చాలా మంచిది. ఇది అవసరం. ఇలాంటి చట్టం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉంది. ఎంత కిరాతకంగా ఆత్యాచారం చేస్తే అంత కంటే కిరాతకంగా శిక్షలు కూడా ఉంటాయని తెలియాలి. దేశంలో ఇలాంటి చట్టాలు అవసరం.

తొంబై శాతం రేప్‌లు మద్యం మత్తులో జరుగుతుంటాయి. మద్యపానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కంట్రోల్ చేసేలా చర్యలు చేపడుతున్న జగన్ మోహన్‌రెడ్డిగారిని మెచ్చుకోవాలి. నిజానికి ఈ విధానం వల్ల రాష్ట్రానికి ఆదాయం తగ్గిపోతుంది. అయినా సరే చిత్తశుద్ధితో చేస్తున్న ఆయన్ను అభినందించాలి. జగన్‌గారికి హ్యాట్సాఫ్. చాలామంచి పని చేస్తున్నారు. అలాగే గ్రామ సచివాలయ విధానాన్ని ప్రవేశపెట్టి దాదాపు రెండు లక్షల మంది యువతీయువకులకు ఉద్యోగ కల్పన చేశారు జగన్ గారు. అది చిన్న విషయం కాదు.

కొందరు తల్లిదండ్రులు వారి అమ్మాయిలను చాలా అమాయకంగా పెంచాలనుకుంటుంటారు. అది తప్పు. పుస్తకాల్లో కానీ మరోచోట కానీ 'ఆడవారికి సిగ్గే సింగారం' అని చెబుతుంటారు. అదీ తప్పే. సిగ్గుపడే మహిళలు అంటే నాకు నచ్చదు.

ఏ దేశాల్లో అయితే ఆడవారు ఎక్కువగా సిగ్గుపడుతుంటారో ఆ దేశాల్లో ఆత్యాచారాలు ఎక్కువగా జరుగుతుంటాయి. చైనా, పాకిస్తాన్, ఇండియా.. ఇలా. ఆడవారి సిగ్గుని మగవారు అడ్వాంటేజ్‌గా తీసుకుంటారు. మగవారితో ధైర్యంగా మాట్లాడటానికి సిగ్గపడకూడదని దయచేసి తల్లిదండ్రులు వారి ఆడపిల్లలకు చెప్పండి. స్ట్రాంగ్ ఉమెన్‌ని రేప్ చేయడానికి మగవారు భయపడతారు. ఆడవారు స్ట్రాంగ్‌గా ఉండేలా వారి తల్లిదండ్రులు పెంపకం ఉండాలి.

మహిళలను మనం పుస్తకాల్లో గౌరవిస్తున్నాం కానీ నిజంగా గౌరవించడం లేదు. ఎన్నో ఏళ్లు బాల్యవివాహాలు ప్రాక్టీస్ చేశాం. చైల్డ్ అబ్యూస్ ప్రాక్టీస్ చేశాం. ఇంకా ఎన్నో ఏళ్లు భర్త చనిపోతే భార్యను తగలబెట్టే సతీసహగమనాన్ని ప్రాక్టీస్ చేశాం. 2002లో రాజస్థాన్‌లో చివరి సతీసహగమనం జరిగింది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట పడాలంటే దిశ లాంటి చట్టాలు రావాలి.

తీహార్ జైల్లో ఉన్న వందమంది రేపిస్ట్‌లను ఒక పాత్రికేయురాలు ఇంటర్వ్యూ చేశారు. అందరితో మాట్లాడిన తర్వాత ఆ అమ్మాయికి అర్థమైంది ఏంటంటే... రేపిస్ట్‌లందరూ ఎక్స్ట్రార్డినరీ వారు కాదు. ఆర్డినరీ వారే. వారు ఎందుకు చేశారు అంటే చదువుకోకపోవడం ఒక కారణం. తల్లిదండ్రుల పెంపకం మరో కారణం. అలాగే రేప్‌కు గురైన ప్రతి అమ్మాయి అమాయకురాలే. అరగంటకో రేప్ జరుగుతుంది. ఆ పాయింట్‌పై 'టెంపర్' సినిమా తీశాను. మనకు తెలియకుండా తగలబడిపోయినవారు ఇంకా ఎందరు ఉంటారో!

న్యూ ఇయర్ గిఫ్ట్ - జయసుధ

దిశ గురించి దేశమంతా ఎలా మాట్లాడుకున్నారో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన దిశాబిల్లు గురించి కూడా అందరూ మాట్లాడాలి. ఆడపిల్లలను హింసించే వారందరూ ఇక జాగ్రత్తగా ఉండాలి. భారతదేశంలో ఏం చేసైనా శిక్ష పడకుండా హాయిగా బయట తిరిగేయొచ్చు, అనే వారందరికి సవాలు విసిరారు జగన్. ఇకనుండి ఇలాంటి వాళ్ల పప్పులు ఉడకవు. 21 రోజుల్లో సత్వర న్యాయం అనే విషయం వింటుంటేనే ఒక ఆడదానిగా, నటిగా, రాజకీయాల్లో ఎంతో మందిని చూసిన నేతగా అన్నీ రకాలుగా హ్యాపీగా ఉన్నాను ఈ బిల్లు గురించి తెలియగానే. అలాంటి సీయం అందరికీ కావాలి. చాలామంది సీయంలకు ఇలా చేయాలని ఉన్నా కూడా చేయలేక పోయారు. ఇప్పుడు అలాంటి డెసిషన్ తీసుకుందాం అనుకునే వాళ్లందరికీ జగన్ మార్గదర్శకుడయ్యారు అనటంలో సందేహం లేదు. అలాంటి జగన్ గారు నాకు వ్యక్తిగతంగా తెలియటం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఎలక్షన్ ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటం ఏ నాయకుడికైనా అంత ఈజీ ఏం కాదు. ఈయన ఎప్పుడు ఏం తప్పుచేస్తారా ఆయన గురించి మాట్లాడే అవకాశం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసే ప్రతిపక్షాలు ఉంటాయి. వీటన్నిటి గురించి ఆలోచించకుండా ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ఇది హిస్టారికల్ డెసిషన్. నేను ఎన్నో సంఘటనలను చూశాను. ఆడవాళ్ల అందరికి ఈ బిల్లు చాలా ధైర్యాన్నిచ్చింది. ఎందుకంటే ఏ తల్లితండ్రులూ ఇంతటి దారుణాన్ని ఊహించరు. ఓ నలుగురు మనుషులు తమ కూతురుని రేప్ చేసి, హత్య చేసి ఆనక కాల్చి బూడిద చేస్తారని ఊహించటానికి కూడా ఇష్టపడరు. అలాంటిది అది మనకు తెలిసినవాళ్లకో, మన దగ్గరివాళ్లకో జరిగితే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుంది! అందుకే ఈ బిల్లు ప్రవేశ పెట్టారు అనగానే నేను ఎంత ఆనంద పడ్డానో మాటల్లో చెప్పలేను. ఇదేదో లబ్ధి పొందటానికి జగన్ గారు చేశారనుకోవాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఆయన సీయం పీఠమెక్కి ఆరు నెలలే. ఇంకా నాలుగున్నరేళ్లు ఆయన పాలన ఎంత డైనమిక్‌గా ఉండబోతుందో ఈ సంఘటన ద్వారా తెలుస్తూనే ఉంది. ఇలాంటి డెసిషన్ తీసుకోవటానికి ఇది కరెక్ట్ టైమ్. యంగర్ జనరేషన్‌కి ప్రాబ్లం వస్తే ఆ తల్లితండ్రుల పరిస్థితి ఎంతో దారుణంగా ఉంటుంది. అందుకే ఇది 2019లోనే పెద్ద డెసిషన్, 2020 న్యూయర్‌కి ఆడవాళ్లందరికీ జగన్ ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్‌లా ఫీలవుతున్నాను. జగన్ సీయం పదవిలో ఉండి ఈ బిల్లును పాస్ చేశాడు కాబట్టి మేమందరం కూడా ఇలా చేయాలి అని మిగతా సీయంలు అనుకొని భారతదేశంలోని ఆడవాళ్లందరికీ న్యాయం చేస్తారని అనుకుంటున్నాను.

నేరాలు తగ్గుతాయి - కృష్ణంరాజు

ఏపీ 'దిశ' బిల్లు వల్ల నేరాలు కచ్చితంగా తగ్గుతాయనిపిస్తోంది. శిక్ష ఎప్పుడో పడుతుంది? అనే ఆలోచనతో కూడా నేరాలకు పాల్పడే వాళ్లు ఉంటారు. ఇప్పుడు 21 రోజుల్లోనే అనేది ఆహ్వానించదగ్గ మార్పు. ఏపీ ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయం ఇది.

ఎవర్నీ ఎన్‌కౌంటర్ చేయాలని మనం కోరుకోం. కానీ ఘోరాలు చేస్తున్నవాళ్లను ఎలా వదులుతాం? దిశ ఘటన తర్వాత చాలా షాక్ అయ్యాం. ఎన్‌కౌంటర్ వార్త విని, చాలా ఆనందపడ్డాం. నేరం చేయాలనే ఉద్దేశం ఉన్నవారికి ఇదొక పాఠం. శిక్ష వెంటనే పడాలి. అప్పుడు నేరాలు తగ్గుతాయి. ఓ 20, 25 ఏళ్లు కంటికి రెప్పలా పెంచిన కూతుర్ని చీమలా నలిపిస్తే ఏ తల్లిదండ్రికి బాధ ఉండదు చెప్పండి. అలాగే మగపిల్లలనూ ఇష్టంగానే పెంచుతారు తల్లిదండ్రులు. వాళ్లు నేరం చేశారంటే ఆ పేరంట్స్‌కి కూడా బాధగానే ఉంటుంది. తప్పు చేస్తే సమాజంలో గౌరవం ఉండదనే భావన ఉంటే తప్పు చేయరు. రష్యాలో ఒక ప్లేస్ ఉంది. అక్కడ డ్రింక్ చేసి బాగా గొడవ చేసేవాళ్లు. అక్కడో బోర్డ్ పెట్టారు. ఎవరెవరు ఎంతెంత తాగారు? అని ఆ బోర్డ్ మీద రాసేవాళ్లు. తర్వాతి రోజు అది చూసుకుని, ఎక్కువ తాగిన వ్యక్తిగా ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నవాడు... ఊళ్లో తనే తాగుబోతు అని చెప్పుకుంటారేమోనని మూడు నుంచి రెండు పెగ్గులకు తగ్గించాడు. అలా అలా పూర్తిగా మానేశాడు. గౌరవంగా బతకాలనుకునేవాళ్లల్లో ఇలా మంచి మార్పు వస్తుంది. పేరంట్స్ పెంపకం వంటివన్నీ వదిలేస్తే.. గౌరవం కాపాడుకోవాలనే తపన ఎవరికి వాళ్లకు ఉండాలి. అప్పుడు హుందాగా బతుకుతారు.

మంచి నిర్ణయం - వెంకటేశ్

"ఈ బిల్లు ద్వారా నేరాలు తగ్గుతాయా లేదా అనే వాదన పక్కన పెడితే ఇలాంటి నేరాల్లో నిర్ణయం త్వరగా తీసుకోవాలి అనుకోవడం చాలా కరెక్ట్. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి బిల్ పాస్ చేయడం చాలా ముఖ్యం. ఇలాంటి కేసులు జరిగినప్పుడు తీర్పు ఇవ్వడంలో ఆలస్యం చేయకూడదు. ఈ విషయం గురించి మాట్లాడటానికి నేను సరైన వ్యక్తిని కాకపోయినా చెబుతున్నాను. ఇలాంటి విషయంలో టైమ్ వేస్ట్ చేయకూడదు. గవర్నమెంట్ మంచి నిర్ణయం తీసుకుంది. ఎవరో ఒకరు ఇలాంటి నిర్ణయం తీసుకోవాలి. ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. చాలా సంతోషం. స్త్రీలను ఎలా గౌరవించాలి, వాళ్లను ఎలా సేఫ్‌గా ఉంచగలం అని అందరూ ఆలోచించాలి.

అభినందనీయం - నాగచైతన్య

ఇలాంటి ఇష్యూలకు ఇంత చర్చ ఉండటం అనవసరం. తీర్పు అనేది సత్వరంగా ఉండాలి. జీఎస్టీ లాంటి విషయాల్లోనే తొందర తొందరగా నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు ఇలాంటి విషయాల్లో ఆలస్యం ఎందుకు చేస్తున్నాం మనం? ఇలాంటి బిల్‌ను తీసుకొచ్చిన ఏపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను.

● ముగ్గు-ముచ్చట

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్,
రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
muggulu.sakshi@gmail.com

తల్లీకూతుళ్లు

బ్యూటిఫుల్ ఫ్యామిలీ

**అందం అంటే తెల్లటి మేను..
కొలతల ఆకృతి కాదు..
అందం అంటే అంతులేని ఆత్మవిశ్వాసమే అని
మొన్న విశ్వసుందరిగా నిలిచిన
జొజొబిని తుంజీ నిరూపించింది.
అసంపూర్ణతలు అవకాశాలను అడ్డుకోలేవు..
వైకల్యాలు పరిధిని నిర్ణయించలేవు
అని చాటారు అపర్ణ క్రోవి..
ఆమె ఇద్దరు కూతుళ్లు షీతల్, శ్రీనిధి!
జొజొబిని తుంజి ఘనతకు
వీళ్ల విజయానికి సంబంధం ఏంటీ?
వీళ్లూ గెలుపొందింది బ్యూటీకాంటెస్ట్‌లోనే!**

అపర్ణ క్రోవి, షీతల్, శ్రీనిధి

షీతల్

అపర్ణ క్రోవి స్వస్థలం హైదరాబాద్. ప్రస్తుతం అమెరికాలోని బోస్టన్‌లో ఉంటున్నారు. భర్త వ్యాపారవేత్త. ముగ్గురు పిల్లలు షీతల్, శ్రీనిధి, సుహాస్. పెద్దమ్మాయి షీతల్ ఫ్యాషన్ డిజైనింగ్ చదువుతోంది. రెండో అమ్మాయి, అబ్బాయి కవలలు. టెన్త్‌క్లాస్‌లో ఉన్నారు. అపర్ణా, తన ఇద్దరు కూతుళ్లు ఇటీవల అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన "మిస్ భారత్ యూఎస్ఏ 2019" అందాల పోటీల్లో పాల్గొని ముగ్గురూ టైటిల్స్ గెలుచుకున్నారు. "మిస్ భారత్ యూఎస్ఏ 2019"గా షీతల్, "మిసెస్ భారత్ ఫస్ట్ రన్నరప్"గా 39 ఏళ్ల అపర్ణ, ఇండియా నెక్స్ట్ టాప్ మోడల్‌గా శ్రీనిధి విజేతలయ్యారు. ఒక పోటీలో తల్లీకూతుళ్లు గెలుపొందడం అరుదే. ఈ అచీవ్‌మెంట్ ఈ ముగ్గురికీ ప్రత్యేకం అనడానికి ఇదొక్కటే కారణం కాదు. దీని వెనక ఈ ముగ్గురికీ ఒకే రకమైన స్ట్రగుల్ ఉండడం కూడా!

కన్నుమూసి తెరిచేలోగా తలకిందులు..

అయిదేళ్ల కిందటిదాకా ఆనందంగా ఉంది అపర్ణ కుటుంబం. 2015 కొత్త సంవత్సరం వేడుక వాళ్ల జీవితాన్ని తలకిందులు చేసింది. ఆ యేడు న్యూ ఇయర్‌ను జైపూర్‌లో జరుపుకుందామనుకున్నారు.ఆ సంతోషాన్ని ఆస్వాదిస్తున్న సమయంలో ఒక్కసారిగా బాణాసంచా పేలి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపర్ణ, షీతల్, శ్రీనిధిలకి గాయాలయ్యాయి. చికిత్స కోసం వాళ్లు తిరగని దేశం లేదు. గాయాలకన్నా కాలిన మచ్చలతో ఉన్న తమను చూసే చూపులే ఎక్కువ బాధించాయి అంటారు అపర్ణ. "పిల్లలు కుంగిపోకుండా ఉండాలంటే ముందు నేను ధైర్యం కూడగట్టుకోవాలి. దానికి ఆ మచ్చలనే ప్రేరణగా తీసుకున్నా. మేము మేముగా నిలబడాలి. ఆ గుర్తింపు మాకు కావాలి అని తపన మొదలైంది. దానికి అందాల పోటీలను ఎందుకు వేదికగా మలచుకోకూడదు అనిపించింది. అందుకే ధైర్యాన్నే ఆయుధంగా చేసుకున్నా. పిల్లల్నీ ట్రైన్ చేశా. మొన్న జరిగిన "మిస్ భారత్ యూఎస్ఏ 2019"కి దరఖాస్తు చేశాం. గెలిచాం" అని చెప్తారు అపర్ణ మునుపటి ఆనందాన్ని సొంతం చేసుకున్న విశ్వాసంతో.

ఫుడ్ బ్లాగర్..

అపర్ణకు పందొమ్మిదేళ్లకు పెళ్లయింది. ఇరవై ఏళ్ల గృహిణిగానే సాగింది. ఆమె రచయిత, స్టోరీ టెల్లర్, మారథాన్ రన్నర్, ఫుడ్ బ్లాగర్ కూడా. ఇవన్నీ అగ్నిప్రమాదం అయిన తర్వాత సాధించినవే. ఈ కలలన్నీ ముందునుంచే ఉన్నా పెళ్లి, పిల్లలతో కొంతకాలం, ఫైర్ యాక్సిడెంట్‌తో మరి కొంతకాలం వెనకబడ్డాయి. ఇప్పుడు అన్నింటిలో రాణిస్తోంది. "కలలు అంటూ ఉంటే ఎప్పుడైనా సాధించవచ్చు. టైమ్ లిమిట్ ఉండదు. కావల్సిందల్లా మన మీద మనకు నమ్మకం, సామర్థ్యం, పట్టుదల అంతే! ఏ వైకల్యమూ మన అవకాశాలను కుదించలేదు" అంటుంది అపర్ణ. ఆమె కూతుళ్లూ అంతే ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. పెద్దమ్మాయి షీతల్ ఫ్యాషన్ డిజైనర్‌గా గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టాలనుకుంటుందట. ఈ విజయం ఆ ప్రయాణాన్ని మరింత సులువు చేసింది అంటుంది షీతల్.

సానుకూల దృక్పథం ఎంతటి లక్ష్యాన్నయినా ఛేదిస్తుంది.. కొత్త ప్రపంచాన్ని చూపిస్తుంది అనడానికి ఈ కుటుంబమే మంచి ఉదాహరణ.

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం
15-12-2019

● వెంకటేశ్ నాగచైతన్య

ఫొటో: శివ మల్లాల

మా అల్లుడు వెరీ కూల్!

- వెంకటేశ్

వెంకటేశ్, నాగచైతన్య వరుసకి మేనమామ, మేనల్లుడు. ఇప్పుడు ఆన్‌స్క్రీన్ మీద కూడా మామా అల్లుళ్లుగా 'వెంకీ మామ' చేశారు. 'మా మామ కూల్' అంటున్నారు చైతన్య. 'మా అల్లుడు వెరీ కూల్' అంటున్నారు వెంకటేశ్. ఈ ఇద్దరూ ఆఫ్ స్క్రీన్ ఎలా ఉంటారు? ఫిట్‌నెస్ సీక్రెట్స్ ఏంటి? ప్లస్‌లు మైనస్‌లు 'సాక్షి'తో పంచుకున్నారు. వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా కేయస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీమామ'. సురేశ్‌బాబు, టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. పాయల్ రాజ్‌పుత్, రాశీఖన్నా కథానాయికలు. గత శుక్రవారం ఈ చిత్రం విడుదలైంది. ఈ సందర్భంగా చెప్పిన విశేషాలు.

● రామానాయుడుగారు ఉంటే చాలా హ్యాపీగా ఫీల్ అయ్యేవారు. మీ ఇద్దర్నీ స్క్రీన్ మీద చూసి బాగా సంబరపడేవారేమో.

వెంకటేశ్: తప్పకుండా. అందరికంటే నాన్నగారు చాలా సంతోషపడేవారు. చైతూ సినిమాల్లోకి రాగానే ఆయన చాలా ఎగ్జయిట్ అయ్యారు. నాన్నకు చైతూ అంటే బాగా ఇష్టం. 'మీ ఇద్దరూ కలిసి ఓ సినిమా చేయండి' అంటుండేవారు. అప్పట్లో చాలా కథలు విన్నాం కానీ కుదర్లేదు. ఇంతకాలానికి ఇలాంటి కథ రావడం దాన్ని మేం చేయడం, ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించడం హ్యాపీగా ఉంది. ఫ్యామిలీలు థియేటర్స్‌కి వస్తున్నారు.

● తాతయ్య (రామానాయుడు) మిమ్మల్ని బాగా ముద్దు చేసేవారా?

నాగచైతన్య: అవును. చిన్నప్పుడు చాలా బొద్దుగా ఉండేవాణ్ణి. బాగా ముద్దు చేసేవారు. 'ఏం చేస్తావు రా' అని అడిగేవారు. 'ఇంజనీరింగో ఏదో ఒకటి చేస్తా తాతా' అనేవాణ్ణి. విని నవ్వేవారు. 'ఇప్పుడు ఇలానే అంటావు లే తర్వాత చూద్దాం' అనేవారు. నేను హీరో అయ్యాక మనం సినిమా చేద్దాం, నువ్వే కథ తీసుకొని రా అంటుండేవారు. నన్ను, వెంకి మామను పెట్టి సినిమా తీయాలన్నది ఆయన కోరిక. ఒకవేళ తాతగారు ఉండి ఉంటే ఈ సక్సెస్‌ను ఆయనే ఎక్కువ ఎంజాయ్ చేసేవారు.

● ఇద్దరూ కలిసి సినిమా చేస్తున్నాం అని తెలిసిన ప్పుడు ఏమైనా ఒత్తిడిగా అనిపించిందా?

వెంకీ: ఇద్దరి పాత్రలు మంచిగా ఉన్నాయి. అన్ని ఎమోషన్స్ తగినన్ని ఉన్నాయి. ఫస్ట్ హాఫ్‌లో వినోదం సెకండ్ హాఫ్‌లో ఎమోషనల్ సీన్స్, ఫైట్స్ అన్నీ కరెక్ట్‌గా ఉన్నాయి. ఈ సినిమా చేయడాన్ని కూడా బాగా ఎంజాయ్ చేశాం.

● కెమిస్ట్రీ కూడా బాగా కుదిరింది. చైతూ కాకుండా వేరే హీరో ఉన్నా ఇలానే ఉండేదా?

వెంకీ: చైతూ లేకుండా ఎలా కుదురుతుంది? ప్రేక్షకులు కూడా మా ఇద్దర్నీ స్క్రీన్ మీద చూడాలనుకున్నారు. పోస్టర్ రిలీజ్ చేసినప్పటి నుంచి ప్రేక్షకుల్లో ఆసక్తి బాగా పెరిగింది. పాజిటివ్ రెస్పాన్స్ ఉంది.

● పెద్ద మావయ్య బెస్టా? చిన్న మావయ్య బెస్టా?

చైతూ: ఎవరి క్వాలిటీస్‌లో వాళ్లే బెస్ట్. ఇద్దరి మావయ్యల దగ్గర విభిన్నమైన లక్షణాలు ఉన్నాయి. చిన్నవాళ్లంటే కొంచెం చనువు ఉంటుంది కదా. అలా నేను, రానా వెంకీ మామతో సరదాగా ఉంటాం. సురేశ్ మామ దగ్గర ఆ సీనియారిటీ ఉంటుంది.

● ఇద్దరు తాతలు (రామానాయుడు, నాగేశ్వర రావు), నాన్న (నాగార్జున), మావయ్యలు (సురేశ్ బాబు, వెంకటేశ్) వీళ్లందరి పేరు నిలబెట్టాలనే భయం ఉంటుందా?

చైతూ: భయం కంటే బాధ్యతగా ఉంటుంది. 4-5 సినిమాలు చేశాక మన మీద అంచనాలు, బాధ్యతలు చాలా ఉన్నాయి అని అర్థం అయింది.

● వెంకీగారు చేసిన సినిమాల్లో మీకు నచ్చినవి?

చైతూ: చాలా సినిమాలున్నాయి. మామ ఒక రకమైన సినిమాలకే అతుక్కుపోలేదు. అన్ని జానర్లను టచ్ చేశారు. ఎలాంటి సినిమా చేసినా కన్విన్స్ చేస్తారు.

● మామూలుగా వెంకటేశ్ గారి కామెడీ టైమింగ్ బావుంటుంది కదా... మీకు ఆయనతో ఈ సినిమా చేయడం ఇబ్బంది ఏమైనా అనిపించిందా?

చైతూ: చాలా ఇబ్బంది అనిపించింది. యాక్ట్ చేసేప్పుడు ఇబ్బంది పడ్డాను. కానీ మామ దగ్గర నుంచి చాలా నేర్చుకున్నాను. వెంకీ మామ ముందే కామెడీ చేసే అవకాశం రావడం వల్ల చాలా నేర్చుకున్నాను.

● ఈ సినిమా చేస్తున్నప్పుడు నిజజీవితంలో మీ మధ్య జరిగిన ఇన్సిడెంట్స్ ఏమైనా గుర్తొచ్చాయా?

వెంకీ: అలా ఏం లేదు. మేమిద్దరం ఎలాంటి వాళ్లం అంటే.. దేనికీ ఎగ్జయిట్ అయిపోం. కూల్‌గా ఉంటాం. ఈ సినిమా ప్రయాణం అద్భుతంగా ఉంది. మా ఫ్యామిలీ చాలా ఆనందంగా ఉన్నారు.

● అన్నయ్య, అబ్బాయి కలిసి సినిమా చేయడం మీ అమ్మగారికి ఎలా ఉంది.

చైతూ: చాలా సంతోషంగా ఉన్నారు. మా ఇద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ, మా కామెడీ బాగా నచ్చింది. బాగా కనెక్ట్ అయ్యారు. నన్ను మిలటరీ పాత్రలో చూడటం సంతోషంగా ఉంది అన్నారు.

● ఎవరైనా ప్లస్సుల గురించే మాట్లాడతారు. మీ మావయ్య గురించి ఓ మైనస్ చెప్పండి.

చైతూ: అస్సలు ఏం లేదు.

● కోప్పడతారా?

చైతూ: ఈ సినిమా షూటింగ్ చేసే ముందు వరకూ ఎక్కువ నవ్వుతూనే చూశాను. కానీ షూటింగ్ అప్పుడే కోప్పడటం చూశాను. అది పని కోసమే.

నేను కావాలా? మీ మామయ్యా? అని సినిమాలో మీ హీరోయిన్ అంటుంది. నిజ జీవితంలో అలాంటి సందర్భం ఎదురైతే?
వెంకీ: అవన్నీ సినిమాలో. బయట వాడు చాలా క్లియర్‌గా ఉంటాడు. (నవ్వుతూ).

వెంకీ ఆసనం నేర్పిస్తున్నారా?
వెంకీ: వాడికి అవసరమే లేదు. నో ఫ్రస్ట్రేషన్. ఓన్లీ కూల్. ఫ్రస్ట్రేషన్ ఉన్నా కూల్‌గా డీల్ చేస్తాడు.

మామ నుంచి నేర్చుకున్న విషయం.
చైతూ: కామ్‌గా ఉండటం. పాజిటివ్‌గా ఉండటం. ఏ ప్రాబ్లమ్ వచ్చినా అరిచి గోల చేయకుండా స్మూత్‌గా డీల్ చేయడం.

వెంకీమామ ఆధ్యాత్మిక పాఠాలేమైనా చెబుతారా?
చైతూ: అప్పుడప్పుడు సంభాషణల మధ్యలో వస్తుంటాయి. అర్థం అయినవి తీసుకుంటుంటాను. అన్నీ అర్థం చేసుకునే అవగాహన నాకు లేదు.

వెంకటేశ్: ఎక్కడో వస్తుంది. కానీ ముందు కన్నా బాగా తగ్గించాను. అప్పుడు టెంపర్ ఫుల్‌గా ఉండేది. ఇద్దరం చాలా కామ్‌గా ఉంటాం.

● మీరు చైతన్య వయసులో ఉన్నప్పటితో పోలిస్తే చైతన్య మీ కంటే కూల్ అనుకుంటా?

వెంకీ: అందులో డౌటే లేదు. నా కెరీర్ ప్రారంభంలో నాకు కొంచెం టెంపర్ ఎక్కువ ఉండేది. ఇరిటేషన్ ఎక్కువగా ఉండేది. అంత కంఫర్ట్‌బుల్‌గా ఉండేది కాదు. ఈ సీన్ ఇంకా బెటర్‌గా చేసుండొచ్చు అనుకుండేవాణ్ణి. మెల్లిగా కూల్ అయ్యాను. చాలా హ్యాపీ. తన మైనస్ అంటే నాకంటే సెలెంట్. అది బయటవాళ్లకు మైనస్‌లా కనిపించవచ్చు. కానీ మాకు అలా ఉండటం చాలా సౌకర్యంగా ఉంటుంది.

● చైతూ చిన్నప్పుడు చేసిన చిలిపి పనులేమైనా..?

వెంకీ: అస్సలు లేవు. చాలా బుద్ధిగా ఉండేవాడు. బొద్దుగా కూడా (నవ్వుతూ). ఇప్పుడు ఫుల్ ఫిట్‌గా ఉంటున్నాడు. హెల్దీఫుడ్ తీసుకుంటాడు. తన లైఫ్ స్టయిల్ కూడా డీసెంట్.

● ఫిట్‌నెస్ గురించి టిప్స్ పంచుకుంటారా?

వెంకీ: నేను అడిగేవాణ్ణి. తను యంగ్. అద్భుతంగా పర్ఫెక్ట్ బాడీ మెయింటెయిన్ చేస్తున్నాడు. మనం వాళ్ల నుంచి నేర్చుకోవాలి. చైతన్యే అని కాదు యంగ్‌స్టర్స్ నుంచి నేర్చుకోవాలి. రానా దగ్గర నుంచి కూడా. వాడి ఫిట్‌నెస్ కంటే కూడా బిజినెస్ సైడ్. వాడు మా నాన్నలానే. సినిమాలంటే వాడికి చాలా ప్యాషన్.

● చైతూని పెళ్లికొడుకుగా చూసినప్పుడు ఎలా అనిపించింది?

వెంకీ: కొత్త లైఫ్ ప్రారంభించబోతున్నాడు. మంచి పార్ట్‌నర్‌ని ఎంచుకున్నాడు. వాళ్లు ఒకరినొకరు గౌరవించుకునే విధానం బాగుంటుంది.

● రాశీ ఖన్నా

● సంపత్ నంది, గోపీచంద్, తమన్నా, శ్రీనివాస చిట్టూరి

ఆట ఆరంభం

గోపీచంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మాణంలో ఓ సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో తమన్నా కథానాయికగా నటిస్తున్నారు. భూమిక, రావు రమేష్, దిగంగన సూర్యవంశి కీలక పాత్రధారులు. కబడ్డీ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. అంటే ఆరంభమైందన్నమాట. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీనివాస చిట్టూరి మాట్లాడుతూ–''హైదరాబాద్‌లో మొదలైన తొలి షెడ్యూల్‌లో ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశాం. ఆ నెక్స్ట్ రాజమండ్రి, ఢిల్లీల్లో షూటింగ్ జరుగుతుంది. వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని అన్నారు. ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.

అందరూ కనెక్ట్ అవుతారు

సాయి తేజ్, రాశీఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రతి రోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించారు. ఎస్‌కేయన్ సహ-నిర్మాత. ఈ సినిమా ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశీ ఖన్నా చెప్పిన విశేషాలు...

● ఈ చిత్రంలో రాజమండ్రికి చెందిన టిక్ టాక్ సెలబ్రిటీ ఏంజిల్ అర్జా పాత్ర చేశాను. మొదట్లో నాకు టిక్ టాక్ అంటే తెలియదు. ఈ కథ వింటున్నప్పుడు భయం వేసింది. ఏంజిల్ అర్జా ఏంటి? టిక్ టాక్ సెలబ్రిటీ ఏంటి? అని అనుకున్నాను. ఆ తర్వాత నేను టిక్ టాక్ యాప్‌ను నా మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాను. ఆ తర్వాత టిక్ టాక్ ఫన్ తెలిసింది. టిక్ టాక్‌పై సెటైరికల్‌గా నా పాత్ర ఉండదు. నా క్యారెక్టర్‌కు అందరూ బాగా కనెక్ట్ అవుతారు.

● రియల్‌లైఫ్‌లో నాకు చాలా సిగ్గు. సెల్ఫీలు తీసుకోవడానికి కూడా ఆలోచించేదాన్ని. ఇప్పుడు అలా కాదు. కొంతమంది నా ఫ్రెండ్స్‌లో టిక్ టాక్ చేసేవారు ఉన్నారు. క్యారెక్టర్ కోసం కొంతమంది టిక్ టాక్ సెలబ్రిటీలను కూడ కలిశాను. 'జిల్' సినిమా తర్వాత నేను బబ్లీ క్యారెక్టర్ చేసింది ఈ సినిమాలోనే.

● సాయితేజ్ మంచి కో స్టార్. పాత్రకు నేను న్యాయం చేయగలనని దర్శకులు మారుతిగారు నన్ను నమ్మారు. సెట్‌లో ఆయన చాలా క్లారిటీగా ఉంటారు. ఆర్టిస్టుల నుంచి తనకు కావాల్సింది రాబట్టుకుంటారు. చాలా హ్యూమరస్‌గా ఉంటారు.

● ఈ సినిమా కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. తెలుగు ప్రేక్షకులు మంచి సినిమాలను ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారని నేను కోరుకుంటున్నాను.

● నేను హీరోయిన్‌గా నటించిన 'వెంకీ మామ, ప్రతిరోజూ పండగే' చిత్రాలు వారం గ్యాప్‌లో విడుదల అవుతున్నాయి. వీటిని నేను ప్లాన్ చేయలేదు. విడుదలైన 'వెంకీమామ' చిత్రంలో నేను పోషించిన హారిక పాత్రకు మంచి స్పందన లభిస్తోంది. హారిక లాంటి పాత్ర నేను ఇంతవరకు చేయలేదు.

● ఈ చిత్రానికి నేను డబ్బింగ్ చెప్పలేదు. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన 'వరల్డ్ ఫేమస్ లవర్' చిత్రానికి నా పాత్రకు డబ్బింగ్ చెప్పుకుంటున్నాను. కథా చర్చలు జరుగుతున్నాయి. నా తర్వాతి చిత్రాల గురించి త్వరలో వెల్లడిస్తాను.

ఈ విజయానికి మూడు ప్రధాన కారణాలు

- నిఖిల్

● రాజ్‌కుమార్ ఆకెళ్ళ, లావణ్యా త్రిపాఠి, 'ఠాగూర్' మధు, నిఖిల్, సంతోష్, సత్య

''మా సినిమాకు హెల్ప్ చేయడానికి దేవుడిలా వచ్చిన చిరంజీవిగారు, ప్రేక్షకుల మౌత్ టాక్, మీడియా సపోర్ట్... మా 'అర్జున్ సురవరం' చిత్రం విజయం సాధించడానికి ఈ మూడు ప్రధాన కారణాలు'' అని అన్నారు నిఖిల్. టి. సంతోష్ దర్శకత్వంలో నిఖిల్, లావణ్యా త్రిపాఠి జంటగా బి.మధు సమర్పణలో రాజ్ కుమార్ ఆకెళ్ల నిర్మించిన చిత్రం 'అర్జున్ సురవరం'. నవంబరు 29న విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతోందని చిత్రబృందం చెబుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిఖిల్ మాట్లాడుతూ–''మా సినిమాను నమ్మి, ప్రమోట్ చేసిన నిర్మాతలకు ధన్యవాదాలు. నటనలోనే కాదు.. ప్రమోషన్స్‌లోనూ కోపరేట్ చేసిన లావణ్యాత్రిపాఠికి ధన్యవాదాలు'' అని అన్నారు. ''ఎంతో కష్టపడ్డాం. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఫైనల్‌గా విజయం సాధించాం. సంతోషంగా ఉంది. ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు సంతోష్. ''మోసం విశ్వవ్యాప్తమైనప్పుడు నిజం చెప్పడం విప్లవాత్మకమైన చర్య అని జార్జ్ ఆర్వెల్ చెప్పిన కొటేషన్ ఈ సినిమాకు స్ఫూర్తి'' అన్నారు రాజ్‌కుమార్. ఇంతటి ఘనవిజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు లావణ్యా త్రిపాఠి. ''అనుక్షణం సినిమా గురించి ఆలోచించే వ్యక్తి నిఖిల్. తనను చూసి చాలా నేర్చుకుంటున్నాను. ఈ సినిమా పెద్ద విజయం సాధించడం హ్యాపీ'' అన్నారు నటుడు రాజ్ తరుణ్. నిర్మాతలు 'ఠాగూర్' మధు, సుధాకర్ రెడ్డి, ఏషియన్ సునీల్, అభిషేక్ అగర్వాల్ నటీనటులు సత్య, కేదార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● పరశురామ్

కొత్త కాంబినేషన్

'మజిలీ, వెంకీ మామ' సినిమాల సక్సెస్‌తో జోష్ మీద ఉన్నారు నాగచైతన్య. ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. తాజాగా పరశురామ్ దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి అంగీకరించారు. ఇది నాగచైతన్య కెరీర్‌లో 20వ చిత్రం. 14 రీల్స్ ప్లస్ బ్యానర్స్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'గీత గోవిందం' చిత్రం తర్వాత పరశురామ్ తెరకెక్కించనున్న చిత్రమిదే. త్వరలో షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాలో నటీనటుల, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే తెలియజేస్తాం అని చిత్రబృందం తెలిపింది.

స్త్రీని ఉపాసించే సంస్కృతి మనది

మానవుడిని మాధవుడిగా మార్చే సనాతన ధర్మంలోని గొప్పతనాన్ని సామాన్యుల చెంతకు తీసుకువెళ్లాలి ... తద్వారా సమాజంలో శాంతిని నెలకొల్పాలి అనే లక్ష్యంతో ఆధ్యాత్మిక ప్రవచన జ్ఞానయజ్ఞాన్ని అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు సామవేదం షణ్ముఖశర్మ. గుంటూరులో యోగవాశిష్ఠం పై ప్రవచనం చేస్తున్న సందర్భంగా 'మానవుడు ఆధ్యాత్మిక మార్గంలో ఎందుకు నడవాలి', 'పురాణాలలో స్త్రీమూర్తికి ఇచ్చిన స్థానం ఏంటి' తదితర సందేహాలకు వారు ఇచ్చిన సమాధానాలు సాక్షికి ప్రత్యేకం.

● ఆధ్యాత్మికం అంటే ?

శరీరం, ప్రాణం, మనస్సే కాకుండా ఆత్మ అనే వస్తువు ఉంది అనే జ్ఞానానికే ఆధ్యాత్మికం అని పేరు. ఆత్మ అనేది ఎప్పుడూ నశించనిది, సత్యమైనది. దాని గురించి తెలుసుకున్నవాడు భౌతిక జీవితంలో ఆనందంగా, శాంతంగా జీవించగలుగుతాడు. సైన్సు భౌతికవిజ్ఞానాన్నే చెబుతుంది. పరా విద్య ఆధ్యాత్మికం, పరమాత్మ గురించి చెబుతుంది. మనిషిలో వివేకాన్ని రగిల్చి అశాశ్వతమైన భౌతిక సుఖాల కోసం అవినీతికి, అధర్మానికి పాల్పడకుండా కాపాడే శక్తి ఆధ్యాత్మిక విజ్ఞానానికే ఉంది.

● ఆధ్యాత్మిక మార్గం అంటే ?

భౌతికప్రపంచంలో ధర్మపరమైన అనుబంధం ఉండాలి. అంతరంగంలో ఆత్మస్వరూపుడైన భగవంతుడున్నాడనే స్పృహ ఉండాలి. ఆ స్పృహ తో భౌతిక జీవిత ధర్మాన్ని పాటించినట్లయితే అది వ్యక్తికి, సమాజానికి క్షేమం. సైన్సు సాధించలేనిది ఆధ్యాత్మికత సాధించగలదు. శరీరం పోయినా నువ్వు ఉంటావు అనే భరోసా సైన్సు ఇవ్వలేదు. ఆధ్యాత్మిక శాస్త్రం ఇస్తుంది. తప్పు, ఒప్పు గమనించే పరమాత్మ ఒకరు ఉన్నారని తెలిసాక తప్పు చేయడానికి వెనుకాడతాము. మంచి చేయడానికే ప్రయత్నిస్తాము. ఆధ్యాత్మిక మార్గం అధర్మాన్ని చేయనివ్వదు. ఒక ఓర్పును, ధైర్యాన్ని ఇస్తుంది. ఆధ్యాత్మికం జీవితానికి అతీతమైనది కాదు. సరైన జీవితం ఆధ్యాత్మికం.

● భగవంతుడు అన్నిటికీ అతీతుడని ఋషి ప్రోక్తం. పురాణకథలలో దేవతలు మానవుల్లా కోపతాపాలకు, రాగద్వేషాలకు గురయినట్లు కనబడుతుంది. దీనిని అర్థం చేసుకోవడం ఎలా ?

పురాణాలను అర్థం చేసుకోవడానికి ప్రత్యేక అధ్యయనం అవసరం. మామూలు కథలలాంటివి కాదు. వాటిలో అనేక సంకేతాలు, సందేశాలు ఉంటాయి. యోగశాస్త్రం మంత్రశాస్త్రం, ధర్మశాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం, తత్వశాస్త్రం, మనస్తత్వ శాస్త్రం కథల రూపంలో ఇమిడి ఉంటాయి. శివుడు, విష్ణువు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపం. వారి భావాలు మనలా ఉండటాన్ని లీల అంటారు. మనలా ప్రవర్తించారనడం సరి కాదు. మనకు అర్థమయ్యేలా ఋషులు బోధించారు. మానవుడి స్థాయిలో జరిగితే కర్మ అంటారు. భగవంతుడి స్థాయిలో జరిగితే లీల అని చెప్పుకుంటాం. పురాణాలలో భగవంతుని లీలలు చెప్పబడ్డాయి. లీలల్లో సందేశాలు ఉంటాయి. జ్ఞానం ఉంటుంది. ఆ జ్ఞానం మనకు అర్థమయ్యేలా చెప్పడం కోసం ఋషులు మనకు కథల రూపంలో అందించారు. కోపాలు, తాపాలు, భావాలు అన్ని లోకాల్లో ఉంటాయి. పశువులు, మానవులు, దేవతలు వారి వారి స్థాయికి తగ్గట్టుగా ఆ భావాలు, స్పందనలు వ్యక్తమవుతాయి. దేవతలకు కలిగే భావాలు, స్పందనలు లోక క్షేమానికి దారితీస్తాయి. అంతుపట్టని భగవత్ తత్వం కూడా ఇలాంటి కథల వలన సామాన్య మానవుడికి చేరువ అవుతుంది.

● పురాణాలలో స్త్రీకి తక్కువ స్థానం ఇచ్చారని కొందరు విమర్శిస్తారు. మీలాంటి ప్రవచకులు గొప్పస్థానాన్ని ఇచ్చారని చెబుతారు ఏది సత్యం ?

భారతీయ సంస్కృతిలో స్త్రీకి ప్రాధాన్యం ఎక్కువగా ఉంది. ఇంచుమించు అన్ని పురాణాల్లో స్త్రీ పాత్రలు గొప్పగా చూపబడ్డాయి. వేదాలలో ఋషులు ఎలా ఉన్నారో, ఋషికలు అలాగే ఉన్నారు. బ్రహ్మ వాదులు ఎలా ఉన్నారో బ్రహ్మవాదినిలు ఉన్నారు. తత్వశాస్త్రం లోనూ గొప్ప స్త్రీ మూర్తులు ఉన్నారు. రాజ్యాలను నడిపేవారు, గృహసామ్రాజ్యం నడిపే పాత్రలు కోకొల్లలు కనపడతాయి. దత్త చరిత్రలో–మదాలస, త్రిపురరహస్యంలో–హేమలేఖ, యోగవాశిష్ఠంలో – పద్మ లీల, మార్కండేయ పురాణంలో– రాజ్యాలేలిన రాణుల చరిత్ర కనపడతాయి. ప్రపంచాన్ని నడిపే శక్తిగా స్త్రీ రూపాన్ని ఉపాసన చేస్తున్నాము. స్వామి వివేకానంద స్త్రీని మాతృమూర్తిగా గౌరవించడం మన సాంప్రదాయమని బోధించారు. పురాణాలలో, వేదాలలో, ధర్మశాస్త్రంలో స్త్రీకి ఒక గౌరవ స్థానం రక్షణస్థానం ఇవ్వబడ్డట్లుగా స్పష్టంగా కనపడుతుంది.

● ప్రశ్న భక్తులకు మీ సందేశం ?

మనకున్న సంస్కృతి యుగాలనాటిది. మనిషికి కావలసిన ఇహపరమైన అన్ని విషయాలు మన గ్రంథాలలో చెప్పబడ్డాయి. అనేక శాస్త్రాల విజ్ఞాన సమన్వయం హిందూ ధర్మశాస్త్రాలలో కనపడుతుంది. వాటి ఎడల ముందుగా గౌరవభావం ఏర్పడితే తరువాత తెలుసుకోవడం జరుగుతుంది. మనిషి బౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా ఎదగడానికి కావాల్సిన పూర్ణజ్ఞానం మహర్షులు మనకు ఇచ్చారు. దీనిని మతదృష్టితో కాకుండా విజ్ఞానదృష్టితో గ్రహిస్తూ దానిని ఆచరించే ప్రయత్నం చేయాలి. భారతీయులందరికీ తమ ధర్మంపై, విజ్ఞానంపై భక్తి, గౌరవ భావం ఏర్పడాలి. ఎవరి ధర్మాన్ని వారు ఆచరిస్తూ ఇతరుల ధర్మాన్ని గౌరవించాలి. ఇంకొకరి ధర్మాన్ని నిందించడం వ్యక్తిత్వ లోపమని తెలుసుకోవాలి'' అంటూ అనుగ్రహ భాషణ చేశారు సామవేదం షణ్ముఖ శర్మ.

– కోలుకొండ శ్రీకర్,
సాక్షి, గుంటూరు ఈస్ట్

స్త్రీ వైశిష్ట్యం-21

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
15-12-2019

నేరాల సంఖ్య తగ్గాలంటే..?

లలితాపరా భట్టారికా స్వరూపాన్ని చూడడానికి ఏ కాంచీపురమో, శృంగేరీయో వెళ్ళక్కరలేదు, అప్పుడే పుట్టిన తన పిల్లలకు పాలు ఇస్తున్న కుక్కలో కనబడుతుంది. తన్నుకు పోవడానికి వచ్చిన గద్దనుంచి రక్షించడానికి పిల్లలను రెక్కల కింద దాచిని కోడిపెట్ట కళ్ళల్లో ఆ మాతృత్వం, లలితా పరా భట్టారికా తత్త్వం కనబడుతుంది. ఆ మాతృత్వానికున్న విశేషం ఏమిటో నిజంగా పరమేశ్వరుడు ఎలా సృజించాడో అర్థం చేసుకున్న నాడు ప్రతి స్త్రీలో నిబిడీకృతమై ఉన్న మాతృత్వాన్ని చూడవచ్చు. ''కన్నుదోయికి అన్యకాంతలడ్డంబైన మాతృభావనచేత మరలువాడు..'' అంటారు పోతన గురించి. ఇంత పరమ పవిత్రమైన అమ్మ వారి విభూతిని సంతరించుకున్న తల్లి–అని ఆమె పాదాలను చూసి నమస్కారం చేసి తప్పుకుంటాడు తప్ప అన్యమైన భావనలు మనసులో పొంగే అవకాశమే ఉండదు. మాతృత్వం చేత స్త్రీ పట్టాభిషేకాన్ని పొందింది.

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఈ జాతిలో అన్యభావనలు, అనవసర విషయాలు ఎప్పుడు ప్రబలుతాయి? మన సంస్కృతిని ఉపదేశం చేయనప్పుడు, కావ్యాలు, పురాణాల్లో ఎంతో గొప్పగా చెప్పబడిన స్త్రీ వైశిష్ట్యాన్ని ప్రబోధం చేయడం ఆగిపోయినప్పుడు... నేర మనస్తత్వం పెరుగుతుంది. మన శాస్త్రాల్లోని మంచి మాటలు, స్త్రీలను గౌరవిస్తూ వేదాలు చెప్పిన విషయాలు మనం మన పిల్లలకు చెప్పగలిగినప్పుడు, చెప్పినప్పుడు అసలు నేరాల సంఖ్య ఇలా అయితే ఉండదు.

ఆమె చదువుకుందా లేదా అన్నదానితో సంబంధం ఉండదు. అవసరమయితే తన ప్రాణాన్ని ఇస్తుంది. అది పురుషుడివల్ల వశం కాదు. ఒకసారి తన ముగ్గురు బిడ్డలు, భరత్తో కలిసి ఒక సాధారణ ప్యాసింజరు రైలునుకుని వేరొక రైలెక్కిన నిరక్షాస్యురాలయిన ఒక పేద స్త్రీ... తీరా విషయం తెలుసుకుని దిగిన తరువాత చూసుకుంటే ఒక బిడ్డ లోపలే ఉండిపోయాడని తెలిసి.. ప్రాణాలకు తెగించి అప్పుడే బయల్దేరిన రైలువెంట పరుగులు తీస్తున్నది. ఛస్తావని అందరూ చివరకు భర్తకూడా హెచ్చరిస్తున్నా లెక్క చేయకుండా ప్లాట్‌ఫారమ్ మీద పరుగులు తీస్తుంటే చూసిన రైల్వే అధికారి ఒకరు రైలును ఆపించి బిడ్డను తల్లికి చేర్చారు. బిడ్డను తీసుకొచ్చేలోగా ఆమె స్పృహ తప్పింది. తరువాత బిడ్డను తడిమి చూసుకుని ఆమె పడ్డ ఆనందం మాటల్లో చెప్పనలవికాదు. అది కేవలం తల్లికే సాధ్యమయిన విశిష్ట లక్షణం.

ఒక ప్రత్యేకమైన యాగం చేస్తే పితృరుణం తీరుతుంది. కానీ మాతృరుణం అలా తీరేది కాదని వేదం చెప్పింది. అందుకే దేశంలో ఒక సత్సంప్రదాయం ఉంది. సన్యాసం తీసుకుని పీఠాధిపత్యం పొందిన తరువాత ఆయనను చూడడానికి పూర్వాశ్రమంలోని తండ్రి వెడితే... మిగిలిన అందరిలాగే దర్శించుకుని నమస్కారం చేసి రావాల్సి ఉంటుంది. అంతే తప్ప మరో ఏర్పాటేదీ ఉండదు. అదే తల్లి కనబడిందనుకోండి. అప్పటిదాకా కూర్చుని ఉన్న పీఠాధిపతి లేచి నిలబడాలి. తల్లి అన్న మాటకు సన్యాసాశ్రమంలో కూడా అంత గౌరవం ఇచ్చింది శాస్త్రం. పరమాత్ముడంతటివాడు కూడా అంత విలువనిస్తాడు. స్త్రీ విషయంలో సాష్టాంగ నమస్కారానికి కూడా మినహాయింపు ఇచ్చింది శాస్త్రం. ఇంత గౌరవం, ఇంత ప్రాధాన్యత ఆమెపట్ల మాత్రమే ప్రకాశిస్తాయి. అది పురుషుని శరీరం విషయంలో అలా ప్రకాశించదు.

సువార్త

శాంతి సమాధానం సాఫల్యం

దేవుడు ఇచ్చే సంపదలు!

'పస్కా' అనే పులియని రొట్టెల పండుగను యెరూషలేములో ఎంతో ఘనంగా ప్రతి ఏడాదీ జరుపుతారు. ప్రపంచంలోని యూదులంతా ఇప్పటికీ ఈ పండుగ చేసుకోవడానికి యెరూషలేము కొచ్చి అక్కడి మహా దేవాలయంలో దేవుని ఆరాధిస్తారు. యేసు ఆయన శిష్యులు కూడా పస్కా పండుగ కోసమే ఒకసారి యెరూషలేము కొచ్చారు. ఐగుప్తు దాస్య విముక్తికి సూచనగా కొన్ని వందల ఏళ్ళ క్రితం ఇశ్రాయేలీయులు ఆ పండుగను దేవుని ఆదేశాల మేరకు వాగ్దానదేశానికి వెళ్తున్న అరణ్యంలో తొలిసారిగా ఆచరించారు. అప్పటి నుండీ దేవుని ప్రజలు కొన్ని వందల ఏళ్లుగా పస్కా పండుగను ఆచరిస్తూనే ఉన్నారు.



ఈసారి పస్కా పండుగ లో యేసే సిలువలో తనను తాను పస్కా పశువుగా బలియాగం చెయ్యబోతున్నాడు. యేసు ఆ విషయాన్ని తన శిష్యులకు ఎంతగా బోధించినా వారికర్థం కావడం లేదు. ప్రభువు శిష్యుల్లో ఒకడైన యూదా ఇస్కరియోతైతే, ఏకంగా యేసును అమ్మి డబ్బు సంపాదించుకునేందుకు అదొక మంచి అవకాశమని నమ్మాడు. యెరూషలేములో ప్రధాన యాజకులను, యూదుల పెద్దలను కలుసుకొని, యేసు చుట్టూ ఎప్పుడు చూసినా వేలాది మంది ప్రజలుంటారు. కాబట్టి ఎవరూ లేని చోట ఆయన్ని అప్పగిస్తానని ఒప్పందపడి అందుకు ప్రతిఫలంగా ముప్పై వెండి నాణేలు యూదా తీసుకున్నాడు.యూదా లోకి దేవుని శత్రువైన సాతాను ప్రవేశించాడని, తమతో చేతులు కలిపిన యూదాను చూసి యేసు శత్రువులైన యాజకులు, అధిపతులు ఎంతో సంతోషించారని బైబిల్ చెబుతోంది(లూకా 22:3–6).యేసుప్రభువును సంతోషపెట్టాల్సిన యూదా ఆయన శత్రువులను సంతోషపెట్టడం ఆశ్చర్యంగా ఉంది కదూ??

దేవుని రాజ్యం డబ్బుకు, ఈ లోకప్రలోభాలకు సంబంధించినది కాదని, అది పూర్తిగా పరలోక సంబంధమైన విలువలకు, అత్యున్నతమైన సాక్ష్యపు ప్రమాణాలకు సంబంధించిన అంశమని యేసు ప్రభువు పదే పదే తన శిష్యులకు, ప్రజలకు కూడా తన బోధల్లో స్పష్టం చేశాడు. డబ్బుకు విలువ లేదని, దాని విలువ ప్రభువుకు తెలియదనీ కాదు. యేసు, ఆయన శిష్యులు కూడా తమ ఆహారం తదితర అవసరాల కోసం తప్పకుండా డబ్బు వెచ్చించారు. ఎప్పటికప్పుడు యేసు అభిమానులే ఆ డబ్బు సమకూర్చారు, ప్రభువు ఆ డబ్బు సంచిని యూదా వద్దనే పెట్టాడు కూడా. అయితే డబ్బే సర్వం కాదని యేసు నమ్మాడు, అలాగే జీవించాడు, తన శిష్యులకు అదే బోధించాడు కూడా. లోకం డబ్బుతోనే నడుస్తుంది. కాని డబ్బు కోసమే లోకం నడవకూడ దని ప్రభువు బోధించాడు, తన జీవనశైలితో అదే అంశాన్ని యేసు చాటాడు కూడా. డబ్బుతో కొనలేని, వెలకట్టలేని కుటుంబ ప్రేమలు, స్నేహ బంధాలు, శాంతి, సమాధానం, తృప్తి, జీవన సాఫల్యం, ప్రేమ, క్షమాపణ, ప్రజల ఆదరాభిమానాలు, ఇవన్నీ ప్రభువు మాత్రమే ఇవ్వగలిగిన దేవుని రాజ్యసంబంధమైన మూలధనాలు, అమూల్య సిరులు. ఇల్లు, తిండి, డబ్బు లేనోళ్ళు పేదోళ్ళని లోకం నిర్వచిస్తుంది. అన్నమున్నా అది తినేందుకు ఆకలి, అవకాశం లేని వాళ్ళు, మెత్తటి పాన్పు, గొప్ప బంగాళా ఉన్నా హాయిగా నిద్ర పోయి, అందులో ఆనందించే వీలు లేని వాళ్ళు, దేవుని కోసం, దేవుని ప్రేమను పొరుగువాడికి చాటేందుకు కాక, ధనార్జనే ధ్యేయంగా జీవితమంతా స్వార్థం కోసం బతికే వాళ్ళే నిరుపేదలని, దారిద్ర్యరేఖకు దిగువన జీవించేవాళ్ళని యేసుప్రభువు బోధలు, ఆయన జీవితమూ నిర్వచించాయి. ఈ 'బాలశిక్ష' స్థాయిలోనే యూదా ఇస్కరియోతు ఫెయిల్ అయ్యాడు. 'కామాతురత' కన్నా భయంకరమైనది 'ధనప్రలోభం'!! దైవిక రాజ్య విస్తరణలో తనకు సాయం చేసేందుకు దేవుడు పిలిస్తే, మధ్యలో దారి తప్పి ధనప్రలోభానికి గురై, పరిచర్యల్లో నిర్వీర్యులై, భ్రష్టులైన మహామహులెంతో మంది ఉన్నారు. వాస్తవమేమిటంటే, నశించిపోతున్న ఆత్మల్ని రక్షించే అతి ప్రాముఖ్యమైన పని కోసం దేవుడు లోకంలోని అత్యుత్తమ శ్రేణికి చెందిన వ్యక్తులనెన్నుకొని వారిని తనకు పరిచారకులుగా నియమించుకున్నాడు. పోతే, ధనార్జన లాంటి చిన్నపనుల కోసం దేవుడు లోకంలోని కుబేరులనెన్నుకున్నాడు. ఈ తేడా తెలియకనే, యూదా ఇస్కరియోతు దేవుడు తనకిచ్చిన వెలలేని భాగ్యానికి ముప్పై వెండి నాణేల విలువ కట్టి, చరిత్రహీనుడయ్యాడు.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

పండుగ పర్వం

పావన పాశుర మాలిక తిరుప్పావై

శ్రీవైష్ణవ భక్తిసాగరంలో ఓలలాడే వెలలేని ఆణిముత్యం 'తిరుప్పావై'. శుద్ధ తమిళంలో ఉండే ఈ పావన పాశురమాలిక మరొక భగవద్గీతగా సమ్మానించబడుతోంది. ఎందరో పండితులైన భక్తాగ్రగణ్యులు తిరుప్పావై పాశురాలను తమ తమ మాతృభాషలలోకి అనువదించి కృతార్థులైనారు. ఈ అనువాదాలు సామాన్యుల హృదయాలకు తిరుప్పావైని దగ్గర చేశాయి. మాన్యులకు శిరోధార్యాలైనాయి. చేతనులు విష్ణుసాయుజ్యం పొందటానికి సులభమార్గాన్ని 'ప్రపత్తి' లేదా శరణాగతి ద్వారా తిరుప్పావై పాశురాలు మృదు మధురంగా ప్రబోధిస్తాయి. శాస్త్రీయ దృక్పథాన్ని పాటించే నేటి అత్యాధునిక ప్రపంచంలో కూడా ఇది ఆచరణ యోగ్యం కావటం అద్భుతం.

ఆమె అనుభవించే భావోద్వేగాలు, ప్రపత్తి పథంలో ఆమె ఎదుర్కొనే తీవ్ర ఆవేదన, అపరిమితానందం ఆండాళ్ తిరుప్పావైలో వ్యక్తమౌతాయి. మాయామయం, అజ్ఞాన ధూళి ధూసరితమైన నిద్రమత్తు నుండి మేల్కొని పరమపురుషుని కైంకర్యసేవలో పాలుపంచుకుని అతడిలో మమైక్యం కమ్మని చెలులకు, తద్వారా యావత్ ప్రపంచానికి పిలుపునిస్తుంది ఆండాళ్.

అలనాటి గోపికల మార్గళి వ్రతాన్ని తాను అనుకరిస్తున్నట్లే భ్రమింపజేస్తూ ఆండాళ్ శ్రీవైష్ణవులకు మాత్రమేగాక ప్రపంచంలోని ప్రపన్నులందరికీ తనదైన విలక్షణపంథాలో మోక్షమార్గాన్ని సుగమం చేస్తుంది. ఆండాళ్ తన తిరుప్పావై, నాచ్చియార్ తిరుమొళి పాశురాలలో ప్రబోధించిన శ్రీసూక్తులను ఆచార్యవర్యులందరూ శిరసావహించారు. నాథముని శిష్యుడైన పుండరీకాక్షుడు ఆండాళ్ గౌరవార్థం రచించి, సమర్పించిన రెండు తమిళ స్తుతిశ్లోకాలు (తనియన్‌లు), పరాశరభట్టర్లు సమర్పించిన నీళాతుంగ స్తన తిరుప్పావైకి అనుసంపుటీకరించటం ఆలయాలలో, ఆస్తికజనులలోని సంప్రదాయం.

పెరియాళ్వార్ భగవానుని క్షేమం, వైభవం కోరుకుంటే ఆయన బిడ్డ ఆండాళ్ భగవానుని భక్తుల క్షేమాభ్యున్నతి కోరుకున్నది. భగవానుడు ఆళ్వారులను అనుగ్రహించి వారిని మేల్కొల్పితే ఆండాళ్ భగవానుడినే మేల్కొల్పి ఆయన పట్ల ఆయనను నమ్ముకున్న భక్తుల శ్రద్ధాపూరితమైన అధీనతను ఎరుక చేసింది. చేతనులందరికీ ప్రేమమార్గంలో పురోగమించి ఆధ్యాత్మిక సమాగమాన్ని అందుకునే ఉపాయం చెప్పింది.

– శ్రీదేవీ మురళీధర్

ప్రశ్నోత్తర భారతం



అర్జున ద్రోణులు

414. అశ్వత్థామ మనసు ఏ విధంగా ఉంది?
415. అనూయతో అశ్వత్థామ ఏం చేయమన్నాడు?
416. ఒకనాడు అన్నం తింటుండగా ఏం జరిగింది?
417. చీకటిలో భోజనం చేస్తున్న అర్జునుడు ఏమి ఆలోచించాడు?
418. నిద్రలో ఉన్న ద్రోణుడికి ఏం వినిపించింది?
419. అర్జునుడితో ద్రోణుడు ఏమన్నాడు?
420. అర్జునుడు ఏం చేశాడు?
421. ద్రోణుడు ఏయే విద్యలు నేర్పాడు?
422. అర్జునుడిని ఎవరితో పోల్చారు?
423. ద్రోణుడు ధనుర్విద్యలో ఎటువంటి పరీక్ష పెట్టాడు?

- నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ

జవాబులు: 414) అశ్వత్థామకు అర్జునుడి మీద ఉన్న ఇష్టత, అతనిలా తాను ఎదగాలని అనుకోవడం. 415) తన మరణానికి ఒక ఉపాయం ఆలోచించి, ధర్మరాజు కుమారుడైన యుధిష్ఠిరుడి దగ్గర ఉండి, అతడి ప్రాణాలు తీయమని అనూయతో అశ్వత్థామ చెప్పాడు. 416) దేవుడు మనుషుల అదృష్టాన్ని ఏర్పాటు చేసి, ఆ ప్రకారం ఇస్తాడు. 417) అశ్వత్థామ, అర్జునుడి ఇద్దరి ఆలోచనలు ఒకే విధంగా ఉండటం. 418) ద్రోణుడికి ధనుర్విద్యలో ఎవరు సాటి రారని, అర్జునుడు ఈ విద్యలో ఎదిగి, ఆ విద్యలో ఎవరికీ లేని పేరు సంపాదించాలని. 419) ఆ విద్యలో నీ కన్నా ఎక్కువ తెలిసిన వాడు ఉన్నాడు. అతడు ఎవరో కాదు, నీ తండ్రి అర్జునుడు. 420) ద్రోణుడి ఆజ్ఞ మేరకు అర్జునుడు ఆ విద్యలో ఎదిగి, ఆ విద్యలో ఎవరికీ లేని పేరు సంపాదించాడు. 421) ఏనుగు, గుర్రం, రథం, విల్లు, ఖడ్గం, గదా యుద్ధం, ఈటెలు, కత్తి, బాణాలు, ఆయుధాలు ఎలా వాడాలో నేర్పాడు. 422) అర్జునుడిని ఇంద్రుడితో పోల్చారు. 423) ద్రోణుడు ఒక పెద్ద చెట్టుకు ఉన్న ఆకులన్నిటిని ఒక్కటి వదలకుండా, ఒక్క బాణంతో కొట్టి, ఆ ఆకులన్నిటిని తన బాణంతో తాకి, ఆ ఆకులన్నిటిని తన బాణంతో తాకి, ఆ ఆకులన్నిటిని తన బాణంతో తాక

వార్తల్లో వ్యక్తులు

నిర్మలా సీతారామన్

శక్తిమంతమైన మహిళ అంటే... శ్రీమంతురాలు మాత్రమే కాదు!!. తన నిర్ణయాలతో ఎంతోమందిని ప్రభావితం చేయగల వ్యక్తి. అందుకే ఈసారి ఫోర్బ్స్ రూపొందించిన ఈ శక్తిమంతమైన మహిళల జాబితాలో పారిశ్రామిక వేత్తలతో పాటు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్థానం దక్కింది. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల్లో నిర్మల 34వ స్థానంలో నిలిచారు. జర్మనీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ ఈ జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు.

సనా మారిన్

ఫిన్‌లాండ్ ప్రధానిగా 34 ఏళ్ల సనా మారిన్ బాధ్యతలు స్వీకరించారు. అతిచిన్న వయసులోనే ఒక దేశ ప్రభుత్వాధిపతిగా బాధ్యతలు చేపట్టిన మహిళగా చరిత్రకెక్కారు. ఫిన్‌లాండ్ ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించిన సనా మారిన్ ఆ దేశానికి మూడో మహిళా ప్రధానమంత్రి. 2003లో అనెలీ జాటీన్‌మాకి, 2010లో మారి కివినిమి అక్కడ ప్రధానులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

గొల్లపూడి మారుతీరావు...



సుప్రసిద్ధ నటుడు, విలక్షణ రచయిత, విమర్శకుడూ గొల్లపూడి మారుతీరావు పేరు వినని తెలుగు వారుండరంటే అతిశయోక్తి కాదు. తెలుగు సినీ రంగానికి ఆయన చేసిన సేవ అనన్యసామాన్యం. రేడియో మొదలుకొని నాటకరచయితగా, కథారచయితగా తెలుగు సాహితీరంగంలో విశేష కృషి చేసిన గొల్లపూడి మారుతీరావు ఈ నెల 12న మరణించారు.

సవ'రణం' మామూలుగా లేదు!!

• జాతీయం

ఈశాన్యంలో పౌరసత్వ చట్టంపై ఆరని మంటలు

జనాభా పరంగా మారిపోతాయన్నదే స్థానికుల భయం

అరవై నాలుగేళ్ల కిందటి భారత పౌరసత్వ చట్టానికి సవరణ చేయటం ఈ వారం పెద్ద దుమారాన్నే రేపింది. లోక్‌సభ, రాజ్యసభ రెండింటినీ కుదిపేసిన ఈ అంశం... ఇపుడు ఈశాన్య రాష్ట్రాల్లో సెగలు పుట్టిస్తోంది. ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న నిరసనలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మారటం... ఆర్మీ రంగంలోకి దిగటం... ఆందోళనల్లో కొందరు ప్రాణాలు కోల్పోవటం... ఇలా ఇది చినికిచినికి గాలివానవుతోంది. నిజానికి 1955 నాటి పౌరసత్వ చట్టానికి సవరణ చేస్తూ తీసుకొచ్చిన బిల్లు దేశంలోని లౌకిక రాజ్యభావనను దెబ్బతీసి, భారత్‌ను మతరాజ్యంగా మారుస్తుందన్నదే ప్రధాన ఆందోళన. ఉభయసభల్లో ప్రతిపక్షాలు ఈ మేరకు ఆందోళన చేసినా... అధికార పార్టీ బలగంతో బిల్లు గట్టెక్కిపోయింది. చట్టంగానూ మారింది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి 2014 డిసెంబర్ 31కన్నా ముందు భారత్‌కు వలస వచ్చేవారికి దేశ పౌరసత్వం ఇవ్వాలన్నదే ఈ సవరణ బిల్లు ముఖ్యోద్దేశం. దాంతో పాటు పౌరసత్వాన్ని కోరేవారు దేశంలో గడిచిన 14 ఏళ్లలో 11 ఏళ్ల పాటు నివసించి ఉండాలన్న నిబంధనను ఐదేళ్లకు కుదించారు. కాకపోతే ఈ నిబంధనలు ఆ మూడు దేశాల నుంచి వచ్చిన హిందూ, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, పార్శీ, జైన మతస్తులకు మాత్రమే వర్తిస్తుంది.

ఇది రాజకీయం... అది స్థానికం

బిల్లు ముస్లింలను పక్కనబెట్టడంతో చాలా రాజకీయ పార్టీలు నిరసనలు వ్యక్తంచేశాయి. ఇది దేశ లౌకిక తత్వాన్ని దెబ్బతీస్తుందని, మత రాజ్యంగా మారుస్తుందని ధ్వజమెత్తాయి. కాకపోతే అధికార బీజేపీ అంశాన్ని అకస్మాత్తుగా తెరపైకి తేలేదు. 2014 ఎన్నికల్లో, 2019 ఎన్నికల్లో కూడా తన మేనిఫెస్టోలో ఈ మేరకు హామీనిచ్చింది. ఆయా దేశాల నుంచి వచ్చిన హిందువులతో సహా పలువురికి పౌరసత్వం కల్పిస్తామని స్పష్టం చేసింది. అందులో భాగమే ఈ బిల్లు అని ఆ పార్టీ చెబుతోంది. ఇక రాజకీయాలను మించిన నిరసనలు ఈశాన్య రాష్ట్రాల్లో వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే అస్సాంలో ఇటీవల చేపట్టిన జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సీ) నమోదులో ఏకంగా 19 లక్షల మంది స్థానికుల పేర్లు గల్లంతయ్యాయి. ఇప్పుడేమో.. ఈ సవరణ. దీనివల్ల ప్రధానంగా బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందువులు తమ రాష్ట్రాల్లో స్థిరపడిపోతారని, జనాభా పరంగా తమ రాష్ట్రాల తీరుతెన్నులే మారిపోతాయని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని చోట్లయితే తాము మైనారిటీలమైపోతామని కూడా వారు భయపడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీనికితోడు ఇప్పటికే అంతంతమాత్రంగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత దెబ్బతింటాయన్నది అక్కడి విద్యార్థుల ఆందోళన. ఇదే హింసకు దారితీస్తోంది. కాకపోతే నిఘా వర్గాలు మాత్రం తాజా సవరణ వల్ల 30 వేల మంది మాత్రమే పౌరులుగా నమోదయి లబ్ధి పొందుతారని చెబుతున్నాయి. ఆయా దేశాల నుంచి వచ్చి అక్రమంగా వలస ఉంటున్న లక్షల మంది ముస్లింలను వెనక్కి పంపేయటానికి కూడా తాజా బిల్లు ఉపకరిస్తుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి ఈ వివాదం సర్దుమణగడానికి కొంత సమయం పట్టేటట్టే ఉంది!!.

• ఆంధ్రప్రదేశ్

'దిశా'నిర్దేశం!

- చారిత్రక బిల్లును ఆమోదించిన ఏపీ అసెంబ్లీ
- మహిళల రక్షణకు అత్యంత కఠిన చట్టానికి రూపకల్పన
- రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు

సాక్షి, అమరావతి: దేశంలోనే తొలిసారిగా మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చారిత్రక 'ఏపీ దిశ – 2019' బిల్లుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మహిళలు, బాలికల భద్రతా చట్టాలు కఠినంగా ఉండాలని, శిక్షలు వేగంగా పడాలనే లక్ష్యంతో ప్రభుత్వం దీన్ని రూపొందించింది.

రెండు బిల్లులకు సభ ఆమోదం

మహిళలు, బాలికలపై అత్యాచారాల్లాంటి క్రూరమైన నేరాలకు పాల్పడితే మరణ శాసనం లిఖించేలా, 21 పనిదినాల్లోనే తీర్పు ఇచ్చేలా ప్రభుత్వం ఈ బిల్లు తెచ్చింది. ఇందుకోసం ఇండియన్ పీనల్ కోడ్ క్రిమినల్ లా చట్టం–1973ని ఏపీకి వర్తింపచేయడంతో పాటు సవరణ లతో రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ దిశ చట్టం– క్రిమినల్ లా (సవరణ) బిల్లు–2019'ని శాసనసభ ఆమోదించింది. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే గరిష్టంగా జీవితఖైదు, సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా మహిళల్ని వేధించడం, అసభ్య పోస్టింగులు పెడితే రెండేళ్ల నుంచి నాలుగేళ్ల వరకు జైలుశిక్ష విధించేలా ఈ చట్టంలో కొత్త సెక్షన్లను చేర్చారు. మహిళలు, బాలలపై నిర్దేశిత నేరాల విచారణకు రూపొందించిన ప్రత్యేక న్యాయస్థానాల బిల్లు–2019కి కూడా సభ ఆమోదం తెలిపింది. రెండు బిల్లులను శుక్రవారం శాసనసభలో హోంమంత్రి మేకతోటి సుచరిత ప్రవేశపెట్టారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'దిశ' ఘటన నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల కంటే ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల రక్షణకు కఠినమైన చట్టాన్ని తెచ్చారు.

'దిశ' చట్టంతో ముఖ్యమంత్రి జగన్ దేశానికి దిశా నిర్దేశం చేశారని జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురుస్తోంది. ఈ చట్టంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. జాతీయ మీడియా ఈ అంశాన్ని విస్తృతంగా కవర్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడింది. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా ఈ చట్టాన్ని తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. దిశ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలీవాల్ ప్రధాని మోదీకి లేఖ రాశారు.

దేశమంతా అమలు చేయాలని ప్రధానిని కోరిన ఢిల్లీ మహిళా కమిషన్

• తెలంగాణ

న్యాయం'దిశ'గా!

- 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో కీలక పరిణామాలు
- విచారణకు త్రిసభ్య కమిషన్‌ను నియమించిన 'సుప్రీం'

(సాక్షి, హైదరాబాద్)

'దిశ' హత్యాచారం ఘటన దేశవ్యాప్తంగా ఎంత సంచలనం సృష్టించిందో నిందితుల ఎన్‌కౌంటర్, తదనంతర పరిణామాలూ అంతే సంచలనమయ్యాయి. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణకు త్రిసభ్య కమిషన్‌ను నియమిస్తూ సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకోవడంతో కీలక మలుపు తిరిగింది. ప్రజల ఆగ్రహ జ్వాలలు నిందితుల ఎన్‌కౌంటర్‌తో కొంతమేర చల్లారినా పౌర హక్కుల సంఘాలు న్యాయ పోరాటానికి దిగడం పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలకు పాల్పడ్డారంటూ ప్రజాసంఘాలు ఇటు హైకోర్టు అటు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. 'దిశ'ను పాశవికంగా హతమార్చినప్పుడు స్పందించకుండా నిందితులను ఎన్‌కౌంటర్ చేసినప్పుడు గళం విప్పడం ఎంతవరకు సమంజసమని దేశవ్యాప్తంగా మహిళా సంఘాలు ఆక్షేపిస్తున్నాయి. లైంగిక దాడులకు పాల్పడుతున్న వారికి మద్దతుగా న్యాయస్థానాలను ఆశ్రయించడంపై మహిళా లోకం మండిపడుతోంది.

వేగంగా మారిన పరిణామాలు

'దిశ'ను దారుణంగా హతమార్చిన నలుగురు నిందితులను తమకు అప్పగించాలంటూ వేలాది మంది ప్రజలు పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగడం, ప్రజాగ్రహం వెల్లువెత్తుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని జాతీయ మీడియా ప్రముఖంగా కథనాలు ప్రచురించింది. కొద్ది రోజుల వ్యవధిలోనే నిందితులు ఎన్‌కౌంటర్‌లో మరణించడం, పౌరహక్కుల సంఘాల రంగప్రవేశంతో పరిణామాలు చకచకా మారిపోయాయి. సీన్ రీ కన్‌స్ట్రక్షన్ పేరుతో పోలీసులే వారిని హతమార్చారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ ఘటనపై నిజ నిర్ధారణ కోరుతూ న్యాయస్థానం మెట్లెక్కడంతో ఆఖరి నిమిషంలో మృతుల అంత్యక్రియలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించడమే కాకుండా దిశ కుటుంబీకులు, నిందితుల కుటుంబ సభ్యులతో మాట్లాడింది. పోలీసుల విచారణ, ఎన్‌కౌంటర్ తీరును తెలుసుకుంది. నిందితులు రాళ్లతో దాడి చేయడంతో గాయపడ్డ పోలీసులతోనూ మాట్లాడి వివరాలు సేకరించింది.

ఆరు నెలల్లోగా కమిషన్ నివేదిక

దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వీఎస్ సిర్పుర్కర్, బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రేఖ, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్‌తో కూడిన త్రిసభ్య కమిషన్‌ను నియమిస్తూ సర్వోన్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్‌హెచ్‌ఆర్సీ, హైకోర్టు విచారణలను నిలిపివేయాలని ఆదేశించింది. ఆరు నెలల్లోపు దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసు విచారణ నివేదికను అందజేయాలని స్పష్టం చేసింది. ఈ పరిణామం పోలీసువర్గాలకు ఇబ్బందికరంగా మారిందనే వాదన వినిపిస్తోంది.

అసెంబ్లీ వేదికగా ప్రతిపక్షం దౌర్జన్య పర్వం

చీఫ్ మార్షల్‌పై బలప్రయోగం, దుర్భాషలకు దిగిన చంద్రబాబు

సాక్షి, అమరావతి: శాసనసభలో ప్రజలకు సంబంధించిన అంశాలపై చర్చించాల్సిన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ తన బాధ్యతను విస్మరించి, భద్రతా సిబ్బందితో గొడవకు దిగడం, రాద్ధాంతం చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకూ ఐదు రోజులు జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో చీఫ్‌మార్షల్, మార్షల్స్‌పై దౌర్జన్యం చేయడం తప్ప ఏ ఒక్క ప్రజా సమస్యపైనా చర్చించేందుకు టీడీపీ ముందుకు రాలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తొలిరోజు నుంచే మీడియాలో ప్రచారం కోసం పాకులాడిన ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఆ క్రమంలో అసెంబ్లీ భద్రతా సిబ్బందితో యుద్ధానికి దిగారు. అసెంబ్లీలో ప్రవేశించడానికి ముందు మీడియాను ఆకర్షించేందుకు టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి నిరసన పేరుతో మూకుమ్మడిగా లోనికి దూసుకెళ్తుండగా మార్షల్స్, పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులు లేకుండా, ఒక్కొక్కరు లోనికి వెళ్లాలని మార్షల్స్, పోలీసులు కోరడాన్ని తప్పు పట్టిన ప్రతిపక్ష పార్టీ నేతలు వారితో వాగ్వాదానికి దిగారు. మూడు రోజులపాటు ఇదే రీతిలో గొడవ పడి, మార్షల్స్‌ను బెదిరించి, దూషించి తోసుకుంటూ లోనికి వెళ్లారు. నాలుగో రోజు సైతం ప్రదర్శనగా రెండో గేటు నుంచి లోనికి వెళ్లడాన్ని మార్షల్స్ అడ్డుకోవడంతో వారిపై చంద్రబాబు, ఆయన కుమారుడు నారా లోకేష్, ఎమ్మెల్యేలు రామానాయుడు ఇతర నేతలు వీరంగం వేసిన దృశ్యాలు విస్మయపరిచాయి. చీఫ్ మార్షల్ థియోఫిలస్‌ను చంద్రబాబు అసభ్య పదజాలంతో ధూషించగా, నారా లోకేష్ యూజ్‌లెస్ ఫెలో అంటూ తిట్టారు. ఒక దశలో చీఫ్ మార్షల్‌పై దాడికి దిగి నెట్టుకుంటూ నానా హంగామా సృష్టించారు. 40 ఏళ్ల అనుభవం ఉందని పదేపదే చెప్పుకునే చంద్రబాబు భద్రతా సిబ్బందితో గొడవకు దిగిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది.

బాబులో లోపించిన సహనం

అసెంబ్లీ సమావేశాల్లో అధికార పక్షాన్ని ఎదుర్కొనే వ్యూహం టీడీపీలో కనిపించడం లేదని, ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రతి సందర్భంలో సహనం కోల్పోయి, విచక్షణ లేకుండా మాట్లాడారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దిశ బిల్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం బోధన, గ్రామ–వార్డు సచివాలయ వ్యవస్థ వంటి కీలక అంశాలు చర్చకు రాగా, వాటిపై సూచనలు, సలహాలివ్వాల్సిన ప్రతిపక్ష నేత వ్యక్తిగత అంశాలు లేవనెత్తారు. తొలిరోజే హెరిటేజ్ సంస్థ తమది కాదని సభలో ప్రకటించి సెల్ఫ్‌గోల్ చేసుకున్నారు. రెండోరోజు ఉల్లి కోసం క్యూలో నిలుచుని గుడివాడలో ఒక వ్యక్తి చనిపోయారని చెప్పి అభాసుపాలయ్యారు. అసెంబ్లీ స్పీకర్‌ను సైతం మర్యాద ఉండదంటూ హెచ్చరించడాన్ని బట్టి ఆయనలో సహనం లోపించి, రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినట్లు విశ్లేషకులు అంటున్నారు. ఆయా అంశాలపై చర్చను పక్కదారి పట్టించడమే లక్ష్యంగా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం, భద్రతా సిబ్బందిపై దౌర్జన్యానికి దిగారనే వాదన వినిపిస్తోంది.

• అంతర్జాతీయం

బ్రెగ్జిట్‌కు ఓకే... మరి స్కాట్లాండ్?

- బోరిస్ జాన్సన్‌కు తిరుగులేని మెజారిటీ
- బ్రెగ్జిట్‌కు స్పష్టంగా ఓకే చెప్పిన బ్రిటన్
- స్కాట్లాండ్‌లో మాత్రం ఎస్ఎన్‌పీ హవా
- స్వాతంత్ర్య పోరు ఊపందుకునే అవకాశం!

దీన్ని కూడా ఒకరకమైన రెఫరెండమే అనాలేమో!!. ఎందుకంటే 'బ్రెగ్జిట్'... అంటే యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటకు వెళ్లటాన్ని సాధిద్దామనే ఒకే ఒక నినాదంతో ఎన్నికల బరిలో దిగిన బ్రిటన్ కన్సర్వేటివ్ పార్టీ ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ రకంగా తాము బ్రెగ్జిట్‌కు ఎంత అనుకూలంగా ఉన్నామన్నది స్థానికులు చెప్పకనే చెప్పారు. అందుకే ప్రధాని బోరిస్ జాన్సన్ కూడా గెలిచాక చెప్పినదొక్కటే... ''బ్రెగ్జిట్ జరుగుతుంది. ఇందులో ఐతే.. కానీ... ఒకవేళ లాంటి సందేహాలకు తావే లేదు. నిర్దేశించిన గడువు జనవరి 31లోగా బ్రిటన్ ఈయూ నుంచి బయటకు వెళుతుంది'' అని తేల్చిచెప్పారు. తాజా ఎన్నికల్లో 650 స్థానాల హౌస్ ఆఫ్ కామన్స్‌లో కన్సర్వేటివ్ పార్టీ ఏకంగా 364 స్థానాలు సాధించింది.

థెరెస్సా మే ఊహించినా...

నిజానికి గత ప్రధాని థెరెస్సా మే... బ్రెగ్జిట్‌ను సాకారం చేయటానికి ఇలాంటి ఫలితాన్నే ఊహించి 2017లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. ఊహించని విధంగా జెరెమీ కోర్బిన్ సారథ్యంలోని లేబర్ పార్టీ పుంజుకుని థెరెస్సాకు చేదు ఫలితాన్ని అందించింది. గత్యంతరం లేక ఆమె ఐర్లాండ్ పార్టీలతో పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని నడిపించాల్సి వచ్చింది. అందుకేనేమో!! ఈసారి ప్రజలు జాన్సన్‌కు స్పష్టమైన మెజారిటీ ఇచ్చారు. దీంతో జనవరిలో ప్రారంభమయ్యే బ్రెగ్జిట్ ప్రక్రియ... నిర్ణీత వ్యవధిలో ముగుస్తుందనే ఆశిస్తున్నారంతా!!.

స్కాట్లాండ్‌లో మరో రెఫరెండం

ఈ ఎన్నికల ఫలితం బ్రిటన్‌కు కొత్త తలనొప్పులు కూడా తెచ్చిందని చెప్పాలి. ఎందుకంటే బ్రిటన్ యావత్తూ జాన్సన్‌కు మద్దతుగా స్పష్టమైన తీర్పునివ్వగా... స్కాట్లాండ్ ప్రజలు కూడా తమ ఆకాంక్షలకు అనుగుణంగా విస్పష్టమైన తీర్పునిచ్చారు. నికోలా స్టర్జియన్ సారథ్యంలోని స్కాటిష్ నేషనల్ పార్టీ ఏకంగా 48 స్థానాలు సాధించింది. గతంతో పోలిస్తే 13 స్థానాలు అధికం. ఇక్కడున్న 59 సీట్లలో ఎస్ఎన్‌పీ 48 సాధించిందంటే తీర్పు ఎంత ఏకపక్షంగా ఉందో చెప్పొచ్చు. దీంతో స్కాట్లాండ్ స్వాతంత్ర్యంపై మళ్లీ చర్చ ఊపందుకుంది. 2014లో ఇక్కడ రెఫరెండం నిర్వహించగా 45 శాతం మంది అనుకూలంగా ఓటేశారు. తాజా ఫలితాల్లో ఆ సంఖ్య విపరీతంగా పెరిగిందని భావించొచ్చు. ''బ్రెగ్జిట్‌కు అనుకూలంగా బోరిస్ జాన్సన్‌కు తీర్పు వచ్చి ఉండొచ్చు. కానీ స్కాట్లాండ్ ప్రజలు బ్రెగ్జిట్‌కు నో అన్నారు. స్కాట్లాండ్ భవితను నిర్ణయించాల్సింది స్కాట్లాండ్ వాసులే తప్ప బోరిస్ జాన్సన్ కాదు'' అని స్టర్జియన్ స్పష్టంగా చెప్పారు. తద్వారా ముమ్ముందు జగరబోయే పరిణామాలను ఆమె కళ్లకు కట్టారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
15-12-2019

12
చెన్నైలో భారత్ ఇప్పటివరకు 12 వన్డేలు ఆడింది. ఏడు మ్యాచ్‌ల్లో గెలిచి, నాలుగింటిలో ఓడిపోయింది. మరో మ్యాచ్ రద్దయింది.

4
ఈ వేదికపై వెస్టిండీస్‌తో భారత్ నాలుగుసార్లు తలపడింది. రెండు మ్యాచ్‌ల్లో గెలుపొంది (2011లో), మరో రెండు మ్యాచ్‌ల్లో (1994, 2007లో) ఓడిపోయింది. చివరిసారి ఈ రెండు జట్ల మధ్య ఇక్కడ జరిగిన రెండు వన్డేల్లో భారత్‌నే విజయం వరించింది.

ఎవరిదో శుభారంభం!

- సొంతగడ్డపై చెలరేగేందుకు భారత్ ఉత్సాహం
- సత్తా చాటుకునేందుకు వెస్టిండీస్ ప్రయత్నం
- నేడు భారత్, వెస్టిండీస్ మధ్య తొలి వన్డే
- మ్యాచ్‌కు వర్షం ముప్పు

అబ్బురపరిచే బ్యాటింగ్ విన్యాసాలు... విస్మయపరిచే బౌలర్ల ప్రదర్శనలు... కళ్లు చెదిరే బౌండరీలు... చుక్కలనంటేలా భారీ సిక్సర్లు... ఓవర్ ఓవర్‌కు మారే విజయ సమీకరణాలు.. వెరసి వెస్టిండీస్‌తో టి20 ఫార్మాట్ మజామజాగా సాగింది. ఇక రోజంతా క్రికెట్ కబుర్లు పంచేందుకు వన్డే ఫార్మాట్ సిద్ధమైంది. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు ఎం.ఎ.చిదంబరం స్టేడియంలో తొలి మ్యాచ్‌లో భారత్ తలపడనుంది. ఫామ్ దృష్ట్యా వన్డే సిరీస్‌లోనూ టీమిండియా ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

చెన్నై: పుష్కర కాలంగా వెస్టిండీస్‌పై వన్డేల్లో ఎదురులేని ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోన్న టీమిండియా మరోసారి తన ప్రతాపం చూపేందుకు సిద్ధమైంది. తాజాగా మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న కోహ్లిసేన అదే ఉత్సాహంతో వన్డే సిరీస్ విజయంపై గురి పెట్టింది. మరోవైపు భారత్ చేతిలో తమ పరాజయాల పరంపరకు కళ్లెం వేయాలని వెస్టిండీస్ పట్టుదలతో ఉంది. తొలి మ్యాచ్‌లోనే గెలుపొంది భారత్ జోరుకు బ్రేకులేసేందుకు విండీస్ సేన సిద్ధమైంది. ఇలా ఇరు జట్లు ఒకరిపై మరొకరు కయ్యానికి కాలు దువ్వుతుంటే వరుణుడు నేనున్నానంటూ పలకరించాడు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా భారత జట్టు ప్రాక్టీస్ సెషన్ కూడా తుడిచి పెట్టుకుపోయింది. నేటి మ్యాచ్‌కు కూడా వరుణుడు అడ్డుపడే వీలున్న నేపథ్యంలో మ్యాచ్ ఏవిధంగా సాగబోతుందోనన్న ఆసక్తి అందరిలో పెరిగింది.

ఆత్మవిశ్వాసంతో కోహ్లి సేన...

ఏ జట్టుకు అయినా సొంతగడ్డపై భారత్‌ను వన్డేల్లో ఓడించడం శక్తికి మించిన పనే. ఈ విషయం వెస్టిండీస్‌కు తెలిసినంత క్షుణ్ణంగా మరో జట్టుకు తెలిసి ఉండదేమో! ఇంకా చెప్పాలంటే గత కొన్నేళ్లుగా విండీస్ పరిస్థితి చూస్తుంటే ఏదో వచ్చామా? వెళ్లామా? అన్నట్లుగానే ఉంది. 2006-07 సీజన్ నుంచి ఇప్పటి వరకు భారత్‌లో ఆరుసార్లు పర్యటించిన విండీస్ ఖాళీ చేతులతోనే వెళ్లడం దీన్ని నిర్ధారిస్తోంది. ఈసారి కూడా వెస్టిండీస్‌పై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడేందుకే భారత్ సిద్ధమైంది. దీనికి తగినట్లుగానే కోహ్లి, రోహిత్, రాహుల్‌లతో కూడిన భారత టాపార్డర్ దుర్భేద్యంగా ఉంది. గాయపడిన ధావన్ స్థానంలో జట్టులోకి వచ్చిన మయాంక్ మంచి ఫామ్‌లో ఉండటంతో పాటు... వన్డేల్లో అరంగేట్రం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడు. వన్డే ప్రపంచకప్ సమయంలో ఆందోళన రేకెత్తించిన నాలుగో నంబర్ స్థానంలో ప్రస్తుతం శ్రేయస్ అయ్యర్ కుదురుకుంటున్నట్లే కనబడుతున్నాడు. దూకుడు, నిలకడలేమితో విమర్శలెదుర్కొంటున్న యువ వికెట్‌కీపర్ పంత్‌కు ఈ సిరీస్ మరో మంచి అవకాశం. టీమ్ మేనేజ్‌మెంట్, కెప్టెన్ కోహ్లి నమ్మకాన్ని నిలిపేలా అతను మంచి ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. ఇక బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో చురుగ్గా కదిలే రవీంద్ర జడేజా ఉండటం జట్టుకు పెద్ద సానుకూలాంశం. మనీశ్ పాండే కూడా సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. భువనేశ్వర్ స్థానంలో వచ్చిన శార్దుల్ ఠాకూర్, మొహమ్మద్ షమీ, దీపక్ చాహర్ పేస్ విభాగాన్ని నడపనున్నారు. స్పిన్ విభాగంలో 'కుల్చా' ద్వయం మరోసారి జోడీ కట్టనుంది. చివరిసారిగా వన్డే ప్రపంచకప్‌లో కలిసి ఆడిన కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చహల్ చెపాక్ పిచ్‌పై తమ స్పిన్ మాయాజాలాన్ని ప్రదర్శించనున్నారు.

కడవరకు నిలబడితేనే...

దూకుడు, పవర్‌హిట్టింగ్‌కు మారుపేరు వెస్టిండీస్. వచ్చీరాగానే భారీ షాట్లతో విరుచుకుపడటం, బంతుల్ని బౌండరీలకు తరలించడమే లక్ష్యంగా ఆడతారు విండీస్ వీరులు. తాజా టి20 సిరీస్‌లోనూ వారు కురిపించిన సిక్సర్ల వాన అభిమానులను మురిపించింది. అయితే ఈ తరహా ఆట రోజంతా సాగే వన్డే ఫార్మాట్‌కు పనికిరాదు. ప్రస్తుతం దీనిపైనే విండీస్ దృష్టి సారించింది. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ, వికెట్ కాపాడుకుంటూ కడవరకు క్రీజులో ఉండటమే లక్ష్యంగా ఆడతామని వెస్టిండీస్ సహాయక కోచ్ ఎస్ట్‌విక్ అన్నారు. ముంబై మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయడిన భారీ హిట్టర్ ఎవిన్ లూయిస్ నేటి మ్యాచ్‌లో ఆడే అవకాశముంది. కెప్టెన్ పొలార్డ్, షై హోప్, హెట్‌మైర్, నికోలస్ పూరన్, కింగ్‌లతో పాటు ఆల్‌రౌండర్ రోస్టన్ చేజ్ కూడా జట్టుతో చేరడంతో విండీస్ బ్యాటింగ్ పటిష్టంగా మారింది. పేసర్లు షెల్డన్ కాట్రెల్, జాసన్ హోల్డర్.. స్పిన్నర్ జూనియర్ వాల్ష్ భారత టాపార్డర్‌ను తొందరగా పెవిలియన్ పంపించేందుకు వ్యూహాలతో సిద్ధమయ్యారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలో దిగుతున్నప్పటికీ అనూహ్యమైన ఆటతీరుకు పెట్టింది పేరైన వెస్టిండీస్‌ను తక్కువ అంచనా వేయలేం.

జట్లు (అంచనా)

భారత్: విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్/మయాంక్ అగర్వాల్, శ్రేయస్ అయ్యర్, రిషభ్ పంత్, కేదార్ జాదవ్, శివమ్ దూబే, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, మొహమ్మద్ షమీ, దీపక్ చాహర్.

వెస్టిండీస్: పొలార్డ్ (కెప్టెన్), షై హోప్, క్యారీ పియరీ, రోస్టన్ చేజ్, రొమారియో షెఫర్డ్, సునీల్ ఆంబ్రిస్, నికోలస్ పూరన్, హెట్‌మైర్, అల్జారీ జోసెఫ్, వాల్ష్ జూనియర్, కీమో పాల్.

పిచ్, వాతావరణం

గత రెండు రోజులు వర్షం పడటంతో పిచ్‌ను పూర్తిగా కవర్లతో కప్పి ఉంచారు. చివరిసారి రెండేళ్ల క్రితం ఆస్ట్రేలియాతో ఇక్కడ జరిగిన వన్డేలో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి 281 పరుగులు చేసింది. వర్షం కారణంగా ఆసీస్ ఇన్నింగ్స్‌ను 21 ఓవర్లకు కుదించి లక్ష్యాన్ని 164 పరుగులుగా నిర్ణయించారు. ఆసీస్ 9 వికెట్లకు 137 పరుగులు చేసి ఓడిపోయింది. ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉండటంతోపాటు వర్షం కురిసే అవకాశాలు కూడా ఉన్నాయి.

రన్నరప్ హంపి

మొనాకో గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ

మొంటెకార్లో: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 7 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 5.5 పాయింట్లతో ఆరో స్థానాన్ని సంపాదించింది. 12 మంది మేటి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హంపి 7 పాయింట్లతో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (రష్యా), అలెగ్జాండ్రా గొర్యాచికినా (రష్యా)లతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. అయితే టోర్నీ టైబ్రేక్ నిబంధనల ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... కొస్టెనిక్ విజేతగా నిలిచింది. హంపి రన్నరప్‌గా నిలువగా... గొర్యాచికినా మూడో స్థానంతో సరిపెట్టుకుంది.

శనివారం జరిగిన చివరిదైన 11వ రౌండ్ గేమ్‌లో గొర్యాచికినాపై హంపి 68 ఎత్తుల్లో గెలిచింది. అంతకుముందు వాలెంటినా గునీనా (రష్యా), మరియా ముజిచుక్ (ఉక్రెయిన్), జావో జుయ్ (చైనా)లపై కూడా నెగ్గిన హంపి... హారిక (భారత్), నానా జాగ్‌నిడ్జె (జార్జియా), అనా ముజిచుక్ (ఉక్రెయిన్), కాటరీనా లాగ్నో (రష్యా), కొస్టెనిక్ (రష్యా), పియా క్రామ్లింగ్ (స్వీడన్)లతో గేమ్‌లను 'డ్రా' చేసుకొని... ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ) చేతిలో ఓడిపోయింది. ఓవరాల్‌గా హంపి నాలుగు గేముల్లో గెలిచి, ఆరింటిని 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో ఓడింది. హారిక 11 గేములు ఆడి మూడింటిలో (ఎలిజబెత్, గునీనా, మరియాలపై) విజయం సాధించింది. నానా జాగ్‌నిడ్జె, పియా క్రామ్లింగ్, అనా ముజిచుక్, హంపి, లాగ్నోలతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హారిక... గొర్యాచికినా, కొస్టెనిక్, జావో జుయ్‌లతో జరిగిన మూడు గేముల్లో ఓడిపోయింది. నాలుగు గ్రాండ్‌ప్రి సిరీస్ టోర్నమెంట్‌లలో భాగంగా రెండు టోర్నీలు ముగిశాక హంపి మొత్తం 293 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉంది. గత సెప్టెంబర్‌లో రష్యాలో జరిగిన తొలి గ్రాండ్‌ప్రి టోర్నీలో హంపి విజేతగా నిలిచింది. గ్రాండ్‌ప్రి సిరీస్‌లో మొత్తం 15 మంది క్రీడాకారిణులు గరిష్టంగా మూడు టోర్నీల్లో ఆడతారు. ఇప్పటికే రెండు టోర్నీలు ఆడిన హంపి వచ్చే ఏడాది మే నెలలో ఇటలీలో జరిగే చివరిదైన నాలుగో గ్రాండ్‌ప్రి టోర్నీలో పాల్గొంటుంది. హారిక మాత్రం వచ్చే ఏడాది మార్చిలో స్విట్జర్లాండ్‌లో జరిగే మూడో గ్రాండ్‌ప్రి టోర్నీలో ఆడుతుంది. ప్రస్తుతం హారిక 120 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో ఉంది. టాప్-2లో నిలిచిన వారు క్యాండిడేట్ చెస్ టోర్నీకి అర్హత సాధిస్తారు. క్యాండిడేట్ టోర్నీ విజేత ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం ప్రస్తుత మహిళల ప్రపంచ చాంపియన్‌తో 12 గేమ్‌లు ఆడుతుంది.

ప్రియా సెంచరీ వృథా

రెండో వన్డేలో భారత మహిళల 'ఎ' జట్టు ఓటమి

బ్రిస్బేన్: తొలి వన్డేలో భారీ విజయం సాధించిన భారత మహిళల 'ఎ' జట్టు రెండో వన్డేలో మాత్రం తడబడింది. ఆస్ట్రేలియా 'ఎ'తో మూడు అనధికారిక వన్డేల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 'ఎ' 81 పరుగుల తేడాతో ఓడిపోయింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 'ఎ' 50 ఓవర్లలో 5 వికెట్లకు 315 పరుగులు చేసింది. జార్జియా రెడ్‌మేన్ (128 బంతుల్లో 113; 10 ఫోర్లు, సిక్స్), ఎరిన్ అలెగ్జాండ్రా బర్న్స్ (59 బంతుల్లో 107; 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. భారత 'ఎ' బౌలర్లలో దేవిక వైద్యకు రెండు వికెట్లు లభించాయి. 316 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 'ఎ' 44.1 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ప్రియా పూనియా (127 బంతుల్లో 112; 16 ఫోర్లు, 2 సిక్స్‌లు), షెఫాలీ వర్మ (36 బంతుల్లో 46; 5 ఫోర్లు, సిక్స్) తొలి వికెట్‌కు 17 ఓవర్లలో 98 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అయితే షెఫాలీ అవుటయ్యాక... ప్రియా సెంచరీ పూర్తి చేసుకోగా... మిగతా వారు క్రీజులో నిలదొక్కుకోవడంలో విఫలమయ్యారు. హేమలత, అరుంధతి రెడ్డి, అనూజా పాటిల్, తనూజ కన్వర్ ఖాతా తెరవకుండానే అవుటయ్యారు. ఫలితంగా భారత 'ఎ' మహిళలకు ఓటమి తప్పలేదు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. చివరిదైన మూడో వన్డే సోమవారం జరుగుతుంది.

పాక్, శ్రీలంక టెస్టు నాలుగో రోజు వర్షార్పణం

రావల్పిండి: రాత్రి కురిసిన వర్షం, వెలుతురులేమి కారణంగా... పాకిస్తాన్, శ్రీలంక జట్ల మధ్య నాలుగో రోజు ఆట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పదేళ్ల తర్వాత పాక్ గడ్డపై తొలి టెస్టు జరుగుతున్న నేపథ్యంలో నాలుగో రోజు ఆట జరిగేందుకు మైదానం సిబ్బంది శాయశక్తులా కృషి చేసినా ఫలితం కనిపించలేదు. దాంతో రెండు జట్ల ఆటగాళ్లు హోటల్‌లోనే ఉండిపోయారు. ఈ టెస్టుకు తొలి రోజు నుంచి వర్షం, వెలుతురులేమి ఆటంకం కలిగించింది. తొలి రోజు 68.1 ఓవర్ల ఆట... రెండో రోజు 18.2 ఓవర్ల ఆట... మూడో రోజు 5.2 ఓవర్ల ఆట సాధ్యమైంది. నాలుగో రోజు ఒక్క బంతి కూడా పడలేదు. ఇప్పటికీ శ్రీలంక తొలి ఇన్నింగ్స్ కూడా పూర్తి కాకపోవడంతో మ్యాచ్ 'డ్రా' కావడం లాంఛనమే.

గోవా చేతిలో కోల్‌కతాకు చుక్కెదురు

గోవా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ప్రస్తుత సీజన్‌లో నిలకడగా ఆడుతోన్న మాజీ చాంపియన్ అట్లెటికో డి కోల్‌కతాకు చుక్కెదురైంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 1-2తో ఎఫ్‌సీ గోవా చేతిలో కంగుతింది. మ్యాచ్ మొదటి అర్ధ భాగాన్ని ఇరు జట్లు గోల్స్ లేకుండానే ముగించాయి. గోవా తరఫున 60వ నిమిషంలో మోర్తాడ ఫాల్... 66వ నిమిషంలో ఫెరాన్ కొరొమినాస్ ఒక్కో గోల్ చేశారు. 64వ నిమిషంలో కోల్‌కతాకు జాబీ జస్టిన్ ఏకైక గోల్ అందించాడు. నేడు ముంబైతో బెంగళూరు ఆడుతుంది.

మూర్ఖులు అర్థం చేసుకోలేరు

గంగూలీతో విభేదాలంటూ వస్తోన్న వార్తలపై రవిశాస్త్రి వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీపై తనకు ఎంతో గౌరవముందని భారత కోచ్ రవిశాస్త్రి అన్నారు. ఇది అర్థం చేసుకోలేని వారంతా మూర్ఖులు అని, వారి అభిప్రాయాన్ని తాను పట్టించుకోనని వ్యాఖ్యానించారు.

తామిద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయంటూ సోషల్ మీడియా, మీడియాలో వస్తోన్న వార్తలు అవాస్తవమని స్పష్టం చేశారు. 'శాస్త్రి-గంగూలీకి చెందిన ఏ విషయమైనా మీడియాకు మాంచి మసాలాతో కూడిన భేల్‌పూరి, చాట్‌లాంటి వార్తలా అనిపిస్తోంది. మాపై వచ్చే ఊహాగానాలకు మీడియా విపరీతంగా స్పందిస్తూ ఉంటుంది. పని పాట లేనివారే సోషల్ మీడియాలో విపరీత వ్యాఖ్యలు చేస్తారు. కానీ ఇందులో వాస్తవం లేదు. గంగూలీ క్రికెట్‌కు ఎంతో చేశాడు. అతనంటే నాకు చాలా గౌరవం. మ్యాచ్ ఫిక్సింగ్ ఉదంతంతో భారత క్రికెట్ గడ్డుకాలం ఎదుర్కొంటున్న సమయంలో గంగూలీ మళ్లీ భారత క్రికెట్‌లో పునరుజ్జీవం నింపాడు. మా ఇద్దరి మధ్య అంతా సవ్యంగానే ఉంది. ఈ విషయం అర్థం చేసుకోలేని మూర్ఖుల గురించి నేను ఆలోచించను' అని రవిశాస్త్రి వివరించారు. వారం క్రితం గంగూలీ కూడా ఇదే అంశంపై స్పష్టతనిచ్చాడు. ఊహాగానాలు, కల్పిత వార్తలు నమ్మొద్దని తెలిపాడు. బీసీసీఐ అధ్యక్షుడిగా దాదా ఎన్నికవడం పట్ల రవిశాస్త్రి హర్షం వ్యక్తం చేశారు. భారత కోచ్ పదవి ఒత్తిడితో కూడినదని అన్నారు. ప్రారంభంలో భారత జట్టు నంబర్‌వన్‌గా ఎదుగుతుందని తానంటే అందరూ వింతగా చూశారని, కానీ ఇప్పుడు అదే నిజమైందని కోచ్‌గా తన పనితీరుని విమర్శిస్తున్న వారికి సమాధానంగా చెప్పారు. టి20 ప్రపంచకప్‌లో రిషభ్ పంత్‌తో పాటు కేఎల్ రాహుల్‌ను కూడా వికెట్ కీపర్‌గా పరీక్షిస్తామని అన్నారు.

దక్షిణాఫ్రికా హెడ్ కోచ్‌గా బౌచర్


గ్రేమ్ స్మిత్, ఇనోచ్ ఎన్‌వే, మార్క్ బౌచర్ (ఎడమ నుంచి)

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా జట్టు హెడ్ కోచ్‌గా మాజీ టెస్టు వికెట్ కీపర్ మార్క్ బౌచర్ శనివారం నియమితులయ్యాడు. అతను ప్రొటీస్ జట్టుకు 2023 వరకు కోచ్‌గా పనిచేస్తాడని దక్షిణాఫ్రికా క్రికెట్ తాత్కాలిక డైరెక్టర్, మాజీ కెప్టెన్ గ్రేమ్ స్మిత్ తెలిపాడు. బుధవారం తాత్కాలిక డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గ్రేమ్ స్మిత్ వెంటనే జట్టు కోచింగ్ సిబ్బంది నియామకంపై దృష్టి సారించాడు. హెడ్ కోచ్‌గా 43 ఏళ్ల మార్క్ బౌచర్‌తో పాటు, అసిస్టెంట్ కోచ్‌గా ఇనోచ్ ఎన్‌వే, దక్షిణాఫ్రికా 'ఎ' జట్టు కోచ్‌గా మాజీ టెస్టు బ్యాట్స్‌మన్ యాష్‌వెల్ ప్రిన్స్‌ను నియమించాడు. మరో వారం రోజుల్లో సీనియర్ జట్టుకు బ్యాటింగ్, బౌలింగ్ కన్సల్టెంట్స్‌ను నియమిస్తానని తెలిపాడు. బౌచర్ 147 టెస్టులు, 290 వన్డేలు, 25 టి20 మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2012లో కంటికి తీవ్ర గాయం కావడంతో అతను ఆటకు స్వస్తి పలికాడు.

2023 వరకు పదవిలో

శాసించే స్థితిలో ఆస్ట్రేలియా

ప్రస్తుతం ఓవరాల్ ఆధిక్యం 417 • తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 166 ఆలౌట్

పెర్త్: స్వదేశంలో ఏడో డే నైట్ టెస్టులో విజయం దిశగా ఆస్ట్రేలియా జట్టు సాగుతోంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో భాగంగా ఇక్కడ డే నైట్‌గా జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా శాసించే స్థితికి చేరుకుంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ఓవరాల్‌గా తమ ఆధిక్యాన్ని 417 పరుగులకు పెంచుకుంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 109/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... ఆసీస్ బౌలర్ల విజృంభణకు 166 పరుగులకే కుప్పకూలింది. రాస్ టేలర్ (134 బంతుల్లో 80; 9 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్ 52 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్ లయన్‌కు రెండు వికెట్లు లభించాయి. 250 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన ఆస్ట్రేలియా ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడించకుండా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 57 ఓవర్లలో 6 వికెట్లకు 167 పరుగులు చేసింది. బర్న్స్ (123 బంతుల్లో 53; 6 ఫోర్లు), లబ్‌షేన్ (81 బంతుల్లో 50; 3 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. వేడ్ (8 బ్యాటింగ్), కమిన్స్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. కివీస్ బౌలర్ టిమ్ సౌతీ నాలుగు వికెట్లు తీశాడు.

'ఆసియా' ఫైనల్లో తస్నిమ్, తార

సురబాయ (ఇండోనేసియా): ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ బాలికల అండర్-15 సింగిల్స్ విభాగంలో భారత్‌కు టైటిల్ లభించడం ఖాయమైంది. ఈ విభాగంలో ఫైనల్ చేరిన ఇద్దరు క్రీడాకారిణులు తస్నిమ్ మీర్, తారా షా భారత్‌కే చెందిన వారు కావడం విశేషం. శనివారం జరిగిన అండర్-15 బాలికల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో తస్నిమ్ 21-16, 21-11తో సోరా ఇషియోకా (జపాన్)పై... తారా షా 21-18, 21-14తో కజునె ఇవాటో (జపాన్)పై విజయం సాధించారు.

చరిత్రకు విజయం దూరంలో...

గ్వాంగ్‌జౌ (చైనా): మరో విజయం సాధిస్తే జపాన్ స్టార్ కెంటో మొమోటా... బ్యాడ్మింటన్ చరిత్రలో ఒకే ఏడాది అత్యధికంగా 11 టైటిల్స్ గెలిచిన ప్లేయర్‌గా రికార్డు సృష్టిస్తాడు. సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ మొమోటా టైటిల్ పోరుకు అర్హత సాధించాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో మొమోటా 21-17, 21-12తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ)పై గెలిచాడు. మరో సెమీఫైనల్లో ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా) 21-15, 21-15తో రియో ఒలింపిక్స్ చాంపియన్ చెన్ లాంగ్ (చైనా)పై గెలిచాడు. నేడు జరిగే ఫైనల్లో జిన్‌టింగ్‌తో మొమోటా తలపడతాడు.

మానస తల్లి ఆమరణ దీక్ష

ఆమరణ దీక్షలో మానస తల్లి స్వరూప, తదితరులు

హన్మకొండ: మానస తల్లి గాదం స్వరూప శనివారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ స్మృతి వనం వద్ద ఎనిమిది రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించక పోవడంతో 9వ రోజు ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. నవంబర్ 27న పుట్టిన రోజు సందర్భంగా గుడికి వెళ్లి వస్తానని చెప్పిన మానస.. అత్యాచారం, హత్యకు గురైన విషయం విదితమే. అనంతరం హైదరాబాద్‌లో దిశ సంఘటన చోటుచేసుకుంది. అయితే.. దిశకు జరిగిన న్యాయం తన కూతురు విషయంలో జరగడం లేదని స్వరూప ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగి 18 రోజులు అవుతున్నా.. స్పందన లేదంటూ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై ఆమె మండిపడ్డారు. న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని స్పష్టం చేశారు. స్వరూపతో పాటు గొల్ల కురుమల నవనిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నగేష్ యాదవ్, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రుషికేశ్వర్ రాజు దీక్షలో పాల్గొన్నారు.

దీక్ష విరమణ: కాగా, మానస ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు స్వరూప దీక్ష విరమించారు.

సమతపై అత్యాచారం.. హత్య

- చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు
- రేపటి నుంచి కొనసాగనున్న విచారణ

సాక్షి, ఆసిఫాబాద్: సమతను అత్యాచారం చేశాక గొంతుకోసి చంపారని పోలీసులు కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో ఈ విషయం తేలిందన్నారు. అలాగే నిందితుల వీర్యానికి సంబంధించిన డీఎన్ఏ నివేదిక కూడా కోర్టుకు సమర్పించారు. శనివారం కుమురం భీం జిల్లా పోలీసులు ఆదిలాబాద్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో 150 పేజీలతో కూడిన చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో మొత్తం 44 మంది సాక్షులను గుర్తించగా, ఏ1గా షేక్‌బాబా, ఏ2 షేక్ షాబొద్దీన్,, ఏ3 షేక్ ముఖ్దూమ్‌గా పేర్కొన్నారు. ఇక కేసు విచారణ సోమవారం నుంచి రోజువారీగా కొనసాగనుంది. చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో ఓ గ్రామానికి చెందిన దళిత మహిళ గత నెల 24న కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో అత్యాచారం, హత్యకు గురైన విషయం తెలిసిందే. 27న నిందితులను అరెస్టు చేశారు. దిశ ఘటనకు మూడు రోజుల ముందు ఈ దారుణం జరిగింది. అయితే దిశ తరహాలో మొదట ప్రాధాన్యత దక్కకపోవడంతో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. తర్వాత ప్రభుత్వం స్పందించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

చంపడం పరిష్కారం కాదు

మనిషి మృగంగా మారుతుండటంతోనే 'దిశ' లాంటి ఘటనలు : మంత్రి ఈటల

- సామాజిక స్పృహ కోసం మానసిక సంఘర్షణ జరగాలి
- హుజూరాబాద్‌లో మానవ వికాస వేదిక మహా సభలు

హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఈటల

హుజూరాబాద్: సమాజంలో మార్పు వచ్చినప్పుడే దిశ, నిర్భయ వంటి ఘటనలు పునరావృతం కావని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం చంపడం, ఉరిశిక్షలు వేయడం పరిష్కారం కాదని చెప్పారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో శనివారం జరిగిన మానవ వికాస వేదిక 3వ రాష్ట్ర మహా సభల్లో ఈటల మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కోసం సంఘర్షణ జరగాలని, అప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తోందని అభిప్రాయపడ్డారు. మనిషి మృగంగా మారుతుండటంతోనే దిశ లాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వినకూడని, చూడకూడని దారుణాలను పత్రికలు, మీడియా ద్వారా వినాల్సి వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచం ఎప్పుడూ వైరుధ్యాలమయమని, మానవ మనుగడ ఉన్నంత కాలం వైరుధ్యాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. నేటి సమాజంలో సెల్‌ఫోన్, ఆధునిక టెక్నాలజీ మానవ మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచి కోసమే వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో సామాజిక కార్యకర్త దేవి, మానవ వికాస వేదిక కేంద్ర కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎన్ఎస్ మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విత్తన భాండాగారం తెలంగాణ

విదేశాలకు ఎగుమతి చేసేలా రైతులు ఎదగాలి

- ప్రతి రైతు పరిజ్ఞానవంతమైన శాస్త్రవేత్త కావాలి
- వ్యవసాయ పాలసీ మారుస్తాం.. రైతును రాజు చేయడమే లక్ష్యం
- నిర్మల్, జగిత్యాల జిల్లా సభల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి

మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

నిర్మల్/జగిత్యాల అగ్రికల్చర్: తెలంగాణను విత్తన భాండాగారంగా మారుస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి (బి) గ్రామం వద్ద రూ.13.63 కోట్లతో నిర్మించిన 13,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన సమీకృత విత్తన శుద్ధి కర్మాగారం, గిడ్డంగులను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలసి శనివారం ప్రారంభించారు. అలాగే.. జగిత్యాల జిల్లాలో రూ.16 కోట్లతో నిర్మించిన పొలాస వ్యవసాయ కళాశాల భవనాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశం మొత్తం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఇప్పటికే పది రాష్ట్రాలకు, పలు ఆఫ్రికా దేశాలకు తెలంగాణ నుంచి విత్తనాలు వెళ్తున్నాయని చెప్పారు. ప్రతి రైతు పరిజ్ఞానవంతమైన శాస్త్రవేత్త కావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచ పోకడలను గమనించాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విత్తనాలను తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేసేలా ఎదగాలని కోరారు. ఇప్పటికే ప్రపంచానికి అవసరమైన విత్తనాలను ఉత్పత్తి చేసే దిశగా తెలంగాణ నడుస్తోందని చెప్పారు.

ఐదు వేల ఎకరాలకు ఒక విస్తరణ అధికారి

ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించామని మంత్రి తెలిపారు. కేవలం పొలంలో పంటకు ఉన్న సమస్యను ఫొటో తీసి పంపిస్తే.. ఐదు నిమిషాల్లోనే పరిష్కారం చెప్పేలా యాప్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. రైతులు తమ ముందు తరమైన పిల్లలకు కచ్చితంగా వ్యవసాయాన్ని పరిచయం చేయాలన్నారు. ఇప్పటికే చాలా మంది సాఫ్ట్‌వేర్‌లు, ఉన్నతస్థాయి ఉద్యోగస్తులు సాగులోకి అడుగు పెడుతున్నారని వివరించారు.

పరిశీలనలో ప్రైవేట్ వ్యవసాయ కళాశాలల ఏర్పాటు

రాష్ట్రంలో ప్రైవేట్ వ్యవసాయ కళాశాలల ఏర్పాటును పరిశీలిస్తున్నామని మంత్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతులు పండించిన పంట మార్కెటింగ్ నుంచి ప్రాసెసింగ్ చేసి వినియోగదారుడికి చేరేలా అగ్రికల్చర్ పాలసీని మార్చబోతున్నామని చెప్పారు. పంట ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌గా మారిన ఎస్పీ

గుత్తికోయలకు వైద్యం

వెంకటాపురం (ఎం): ములుగు జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కొద్ది సేపు డాక్టర్‌గా అవతారమెత్తారు. వెంకటాపురం మండల కేంద్రంలోని వేదవ్యాస ఉన్నత పాఠశాలలో ములుగు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి హాజరైన ఎస్పీ.. స్వయంగా గొత్తికోయలకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. గతంలో మహారాష్ట్రలో ఐదేళ్ల పాటు వైద్య వృత్తిలో కొనసాగి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు.

పరీక్షిస్తున్న ఎస్పీ పాటిల్

జీవీ రమణారెడ్డి | ఎ.యాదగిరి | పి.రవిచంద్ర | ఎం.రాజు | నూనె శ్రీధర్

'కాళేశ్వరం' ఇంజనీర్లకు స్పెషల్ ప్రమోషన్

ప్రతిపాదనలు సిద్ధం చేసిన ప్రభుత్వం • రెండ్రోజుల్లో అధికారిక ప్రకటన!

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని ఐదుగురు ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లకు పదోన్నతులు ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు రెండ్రోజుల్లో ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడనున్నట్లు తెలిసింది. ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజనీర్లు కుటుంబాలకు దూరంగా ఉండి రాత్రింబవళ్లు శ్రమించి లక్ష్యానికి అనుగుణంగా కృషి చేసినందుకు ప్రభుత్వం స్పెషల్ ప్రమోషన్ ఇవ్వాలని నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లింకు-1లోని మేడిగడ్డ లక్ష్మీబ్యారేజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ రమణారెడ్డికి ఎస్ఈగా, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రాజుకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, అన్నారం సరస్వతీ బ్యారేజీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.యాదగిరికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవిచంద్రకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి ఇవ్వనున్నారు. అలాగే లింకు-2 పరిధిలోని నంది, గాయత్రి పంపుహౌస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్‌కు ఎస్ఈగా ప్రమోషన్ రానుంది. వీరందరికి ఒక నెల జీతం లేదా ఒక ఇంక్రిమెంట్‌ను ఇవ్వనున్నారు.

పక్షుల పండుగ ప్రారంభం

పక్షుల పండుగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ శోభ

పెంచికల్‌పేట్ (సిర్పూర్): కుమురం భీం జిల్లాలోని అరుదైన పక్షులను గుర్తించటానికి రాష్ట్రంలోనే మొదటి సారిగా పక్షుల పండుగ (బర్డ్‌ఫెస్ట్) నిర్వహిస్తున్నామని అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి (పీసీసీఎఫ్) శోభ అన్నారు. జిల్లాలోని పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ బొక్కివాగు ప్రాజెక్టు వద్ద శనివారం పక్షుల పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీశాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారికి అటవీశాఖ ఆధ్వర్యంలో ఉచిత వసతి, భోజనం కల్పించామని అన్నారు. అనంతరం అగర్‌గూడ అటవీ ప్రాంతంలో పర్యటించి పులి పాద ముద్రలను పరిశీలించారు. పులుల సంరక్షణకు చేపడుతున్న చర్యలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎంపీ సోయంపై రౌడీషీట్ తెరవాలి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

